THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_206229
UNIVERSAL
LIBRARY

కృతిపతి

శ్రీ

కృతిసమర్పణము

ఇయ్యది

ఉదారస్వభావులును, కరుణాతరంగితాంతరంగులును,

విద్వత్పరిపోషకులును, సద్గుణగరిష్ఠులును,

సౌజన్యధన్యులును, క్షమాశీలురును,

నర్సరావుపేట సంస్థానాధీశ్వరులును

అగు

శ్రీమన్మహారాజరాజశ్రీ శ్రీరాజా

మల్రాజు వేంకటనృసింహారావు బహద్దర్

జమీన్‌దారు సర్ దేశముఖు మన్నెవారు

పరగణే బెల్లంకొండ వ వినుకొండ తాలూకే రాచూరు వ కడలి

నైజాముల్ సర్కారు మృత్తుజాన్నగర్ వ ముస్తఫాన్నగర్ వ

రాజమహేంద్రవరము వ నెల్లూరు గారికి

అభ్యుదయ పరంపరాభివృద్ధియగునట్లు

కృతి యీయఁబడినది.

వాణీ ముద్రాక్షరశాల, బెజవాడ.

పీఠిక.

—:o:—

కవులకుఁ బీఠికలు వ్రాసుకొను టాచారమైపోయినది.

మా కవితాలతిక నేఁటికిఁ దొలిమొగ్గఁ దొడిగినది. నిరుపమ చమత్కారకల్పనానల్పశిల్పిశిరోమణి యగు శ్రీరామభద్రదీక్షితుని జానకీపరిణయ నాటకమే దీని ప్రాతిపదికము.

యత్నమా ప్రథమము. పూనిన పనియా తలకు మించినది. "పిల్లకాకి కేమి తెలియు నుండేలుదెబ్బ?" పెద్దలచాటువార మగుటచే మొండిధైర్యము నవలంబించితిమి. గురుచరణరజఃప్రభావ మెట్లో దీనిని ముగింపించినది ఇందేమేని గుణరత్నము లున్నచో నవి సహృదయుల పాలు. దోసములు మా పాలు.

మా యీ బాల్యచాపల్యమును సైతము ప్రోత్సాహదోహదమునఁ బెంపొందించిన పిన్నపెద్దలకుఁ గృతజ్ఞుల మనవలదా?

శ్రీ వేంకట పార్థసారథి కవులు.

—:*(o)*:—

ఈ నాటకమున వచ్చు పాత్రలు.

—:(౦):—

పురుషులు.

రాముఁడు.—(కథానాయకుఁడు)
లక్ష్మణుఁడు
భరతుఁడు
శత్రుఘ్నుఁడు
జనకుఁడు
శతానందుఁడు
విశ్వామిత్రుఁడు
పింగళుఁడు— రాముని మిత్రుఁడు
కాశ్యపుఁడు—
విశ్వామిత్రుని శిష్యుఁడు
రావణుఁడు
సారణుఁడు } రావణుని
విద్యుజ్జిహ్వుఁడు } యనుచరులు
మారీచుఁడు

కరాళుఁడు—
మారీచుని అనుచరుఁడు
విరాధుఁడు
మహాపార్శ్వుఁడు—
రావణుని నర్మసచివుఁడు
సంపాతి—విభీషణుని మంత్రి
గంధర్వుఁడు
జటాయువు
కబంధుఁడు
హనుమంతుఁడు
సుగ్రీవుఁడు
వాలి
శుకుఁడు } రావణుని సేవకులు
శార్దూలుఁడు }

(సమయానుకూలముగా ప్రతీహారి మొదలగువారు వత్తురు)

స్త్రీలు

సీత—(కథానాయిక)
సుచరిత } చెలికత్తెలు
శీలవతి }
అహల్య
ఊర్మిళ
మాండవి

శ్రుతకీర్తి
శూర్పణఖ
అనల
రాక్షసి
ఒక చెలికత్తె

విచిత్రరాఘవము

నాంది

అను వగు నైగమాంతవచనాసవ మానఁగనో? వ్రజాంగనా
జనకుచయుగ్మచందనరజమ్ముల నూడ్వనో? నాఁగఁ బిల్లఁగ్రో
విని విని చుట్టుఁగ్రమ్ముకొని వేడుక నావులు నాకుచుండఁగాఁ
దనరు నళీకబాలకు పదమ్ములు మీకు శుభమ్ము లీవుతన్.

సూత్ర:—(ప్రవేశించి) నాటకావలోకన కుతూహలమ్మునఁ బూజ్యులగు వీరెల్లరు నిచ్చట గుమికూడి యున్నారు. ఈ సమయమునఁ గాక మఱియెప్పుడు పేరు వచ్చును?

గీ॥ అర్థము, పదంబు, రచన షష్టాష్టకములు
గాక యొకదాని నొక్కటి కైవసంబు
చేసికొను రీతిఁ జెప్పక చెప్ప నట్టి
చిత్రమగు నాటకముఁ బ్రదర్శింపవలయు.

కావున మా నటితో నాలోచించెద. (తెరవంకకుఁ జూచి) నటీ! వచ్చెను. రమ్ము.

నటి:—(సంభ్రమముతోఁ బ్రవేశించి) ఏడీ యేడీ??

సూత్ర:—నీ కేమైన వెఱ్ఱియెత్తినదా యేమి? ఈ కారణములేని కంగారెందులకు?

నటి:—ఏమీ యతఁడు రానేలేదా?

సూత్ర:—అతఁ డెవఁడు?

నటి:—మహామాయుఁడు.

సూత్ర:—నీ వేమైనఁ గలఁగనుచున్నావా? విసిగింపక యసలు సంగతి చెప్పుము.

నటి:—మన కమలినీ నీ మేనల్లుఁ డగు కలహంసుని వరించియున్నది గదా! ఇప్పుడు మహామాయుఁ డను కుశీలవుఁడు తనమాయచే కలహంసవేషము ధరించి కమలిని నెత్తుకొనిపోవు నఁట! మన యమ్మాయి కోరిక యెట్లు ఫలించునా యని హడావుడి పడుచుండ నింతలో మీ కేక 'వచ్చె'నని వినఁబడినది. నిజముగా నిప్పుడే వచ్చినాఁడేమో యని రోజుచుఁ బరుగెత్తుకొని వచ్చితిని.

సూత్ర:—(నవ్వి) ఓసీ పిచ్చిదానా! కమలినీకలహంసుల పెండ్లి సంఘటింపఁజేయుటకు బృహద్బలుఁ డను శైలూషు నిదివఱకే పూఁటకాఁపుగ నియోగించియుంటిమి

విచిత్రరాఘవము.

గదా! మరల నీ తొందఱ యేల? ఆ మహామాయఁ డచ్చము కలహంసుని వలెనే వేసము వేయఁ గాక. మన మేనల్లుని విద్యయే యాతనిఁ బట్టి యీయఁ గలదు.

నటి:—అయిన మీ'వచ్చె'నను మాట కర్థ మేమి?

సూత్ర:—అదృష్టమును గూర్చి మన మింతకుముందు మాటలాడుకొన్న దానినిఁ బట్టి యది యిప్పుడు కలసివచ్చుటచే నీకు సమాధానముగ 'వచ్చె'నంటిని. (సభ్యులనుజూపును)

నటి:—మఱి యే నాటకమును నిశ్చయించితివి?

సూత్ర:—(నవ్వి) ఒక క్షణము ముందు నీ వాడిన నాటకమునే!

నటి:—మీ పరిహాసముల కేమి లెండు. అది యెద్దియో చెప్పరాదా?

సూత్ర:—అప్పుడే మఱపువచ్చినదా విచిత్రరాఘవము?

నటి:—ఏది? మన వెంకటపార్థసారథికవులచే వ్రాయఁబడినదే గాదూ!

సూత్ర:—మొదట తెలియదుగాని కొంచెము 'నూ'యన్న నల్లుకొనఁ బోఁగలవు. ఊఁ! చెప్పు మింకనుఁ దత్కృతినాయకుఁడు—

సీ॥ కీర్త్యంగనామణి క్రీఁగంటి చూపుల
నెలమితోఁ దూఁగుటుయ్యెలల నూప;
భాగ్యకామిని తన బాహువల్లరుల బం
ధించి సౌఖ్యములఁ దేలించుచుండ;
విద్యావిలాసిని వేడ్కమై వలపుటు
ద్యానంబునందు వింతలను జూప;
దానసుందరి తన తారుణ్యసామ్రాజ్య
మునకుఁ బట్టముఁ గట్టి మురియుచుండఁ;
గీ॥ బట్టినది యెల్ల బంగరు ముట్టినయది
ముత్యమునుఁ గాగ నర్సరాట్పురజమీను
దారు కులరాజ వేంకట నారసింహ
రావు బహదరు భూపాలరత్న మలరు.

నటి:—మీరు చెప్పనే చెప్పితిరి గదా! ఇది శ్రీసామ్రాజ్యము. మాకు వారి సతీతిలకము మహాసాధ్వి - ఉన్నదని మీ రెఱుంగరా?

సీ॥ ఈ దిన మెవ్వారికేని సాయము సేయఁ
గలనో? లేనో? యంచుఁ గాంచుచుండుఁ;

ప్రస్తావన.

గాంచి వచ్చినవారిఁ గన్నతల్లియుఁ బోలె
నాదరించి ధనంబు లర్థి నిచ్చు;
నిచ్చియుఁ దగినంత యిచ్చితినో? లేదో?
యని యిష్టసఖుల నెయ్యమున నడుగు;
నడిగి నేఁటికిఁ జరితార్థత్వమందు పు
ణ్యము గల్గె నంచుఁ బ్రియంబు నెందు;
గీ॥ నీదృశాసమదాతృతాధీనచిత్త
మమర రేపూడిగుడ్డిగూడెముల నేలు
నట్టి సాధ్వి లక్ష్మీ వెంకయమ్మ రావు
బహదరు జమీనుదారిణి వరలుచుండు.

సూత్ర:—తద్గర్భశుక్తిముక్తాఫలము నెంతని పొగడవచ్చును?

చ॥ అలఘుతరంబుగా నిజకృపామృతవృష్టులచేత నాశ్రితా
వళుల యభీష్టసస్యములు పండి సుభిక్షముగాఁ దలిర్ప ని
ర్మలయశ మందుచుండును గుమారుఁడు వేంకటరామకృష్ణకొం
డల నరపాలమౌళి సుగుణంబుల కెల్లను జన్మభూమియై.

నటి:—ఔను. రత్నము లన్నియు నొక్కచోట. రాళ్లొకచోట. వారి కుమార్తె
లిర్వురు మాత్రము? తల్లిదండ్రుల సుగుణముల నన్నిటిని బుణికిపుచ్చుకున్న
వారే?

గీ॥ తనదు సద్గుణలతిక సౌందర్య మాల
వాలముగ నొప్పఁ గీర్తిపుష్పములఁ బూచి
రాజసము వెల్లిగొల్ప మా రాజ్యలక్ష్మి
తేజరిల్లు రెండవ రతీదేవి యనఁగ.

గీ॥ పుట్టినింటికిఁ దన మాట ముత్తియంబు
మెట్టినింటికిఁ దన పేరు మేల్మి పసిఁడి
గాగ దీనుల కొంగుబంగార మగుచు
మహముఁ గనె మా యలర్మేలు మంగమాంబ.

సూత్రి:—ఇఁక నేమి? అన్నియు సమకూడినవి. నీ యంగీకారమే యవశిష్టము.

నటి:—ఏమో? నేఁడు నే నాఁడు దలఁచుకొనలేదు. ప్రేక్షకురాల నయ్యెదను.

విచిత్ర రాఘవము.

సూత్రి:—మొన్నఁ జూచుచుఁ గూర్చుండు మన "గాదు కాదు, నాకు నాటక మాడ వలెననియున్న"దంటివి. మఱల నిప్పు డిది యొకటియా?

నటి:—మరి నన్నేమి చేయు మనెదరు? ఇది నాటకము తప్పు గాని నా తప్పు గాదు. ఏమైనను మీ మాట కెదురాడి బ్రతుకఁగూడనా?

సూత్ర:—ఆఁ! అట్లు దారికి రమ్ము. ఇపుడు స్త్రీసామ్రాజ్య మేమైనదో? దాని నటించుము.

చ॥ పరిషదమా బుధాకర మవారితకీర్తికు లిక్కవీశ్వరుల్;
నరపతులందు మేటి కృతినాథుఁడు; వృత్తము రామచంద్రస
చ్చరితము; ఇంక ముఖ్యమగు సంగతి నీవు ప్రసన్నవైతి వీ
వరుసగ నన్నియుం గలిసివచ్చెను నాదగు భాగ్యరేఖచేన్.

కావున నీ వసంతఋతువునుఁగూర్చి యొక్కసారి గానమొనరింపుము.

నటి:—

గీ॥ సొగసి రతికేళి నదియేమి ముగుదతనమొ?
చెలులు వాతాయనాగతశిశిరపవను
సేవఁ జేతురు తమ చిఱుచెమటముత్తి
యముల దొంగిలు టెఱుఁగ రేమనఁగవచ్చు?

మరియు—(అర్థోక్తిలో భయము నటించును.)

సూత్ర:—నీ గానామృతముచే నీ సభాసదు లందఱుఁ జిత్తరువు లైరి. గర్వింపఁదగిన యీ సమయమున భయమునకుఁ జోటొసంగెద వేల?

నటి:—చూచుటలేదా? ఆ రాక్షసుఁడిటే వచ్చుచున్నాఁడు. ఎట్లు భయపడకుందును?

సూత్ర:—సఖీ! భయపడకుము భయపడకుము రావణుని యనుచరుఁ డగు సారణుని భూమిక ధరించి మా బావ రంగస్థలమునఁ బ్రవేశించుచున్నాఁడు మనము ననంతరకరణీయములకై సంసిద్ధుల మగుదము రమ్ము.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది ప్రస్తావన.

శ్రీరస్తు.

విచిత్రరాఘవము

ప్రథమాంకము.

[దృశ్యము : ఒక రాజమార్గము. అంతట సారణుఁడు ప్రవేశించును.]

సార:—మిథిలా వృత్తాంతములఁ దెలిసికొనుట కేగిన శుకుఁ డేలకో తామసించెను. అతఁడు రానిదే నేను వెళ్ళి ప్రయోజన మేమి? (పరిక్రమించును.)

శుక:—(ప్రవేశించి) ఓహో! సారణుఁడా?

సార:—మిత్రమా! నూఱేండ్లు. అనుకొనుచుండఁగనే వచ్చితివి.

శుక:—దాని కేమి గాని విశేషము లేమి?

సార:—ఏమైన నున్న నీవే చెప్పవలయును.

శుక:—అది యొక గాథ, సరే కాని నీ వెచటికో ప్రయాణము కట్టినట్లున్నది?

సార:—జగదేకసుందరి యగు సీతను దనకిచ్చి పెండ్లిచేయవలసినదిగా జనకు నడిగి రమ్మని మన మహారాజుగారి యాజ్ఞ. అందుచే మిథిలకుఁ బోవుచున్నాను

శుక:—తక్కిన దేవతాస్త్రీలను బలె సీతను బలాత్కారముగ నెత్తుకొని వచ్చుటకు మన మహారాజున కడ్డుపడుచున్నది శైవాభిమానమే గదా?

సార:—కావచ్చును.

శుక:—కాని,

చ॥ అవనిజ రాముని న్వలచె నా జనకుండు దశాస్యు భీతిచే
నవు ననఁగా దనం బెదవి యాడక చల్లఁగ గోడ మీఁది పి
ల్లివలె నటించె నంత నవలీలగఁ దాఁ బ్రతిసృష్టి సేయు ప్రా
భవము గలట్టి కౌశికుఁడు వారికిఁ దోడ్పడెఁ బూఁటకాఁపుగన్.

సార:—గేదెయు దూడయు నుండఁగా గుంజ గింజుకున్నదన్నట్లు మధ్యనీతఁ డెవ్వఁడు?

శుక:—ఇప్పు డీ మంత్రాంగమున కంతటికి నీతఁడే సూత్రధారి.

సార:—[వేడనవ్వుతో] ఏమీ కాలవైపరీత్యము? మన మహారాజు నెడ ఋజువృత్తి యు జనకు నెడఁ గౌటిల్యమునా?

శుక:—ఇప్పు డమ్మునిమ్రుచ్చు యజ్ఞమను మిషచే దశరథునిఁ గుటుంబ సహితముగఁ దీసుకొనివచ్చుట కయోధ్యకు వెళ్ళెను. జనకుఁడునుఁ దన తమ్ముఁడగు కుశధ్వజుని మిథిలలోనుండ నియమించి యజ్ఞముఁ జూచుటకను నెపమున జానకి తోఁగూడఁ గౌశికాశ్రమముఁ జేరెను.

సార:—సరే! ఇంక జెప్పునదేమి? ఈమిషచే సీతారాముల పాణిగ్రహణము నిర్వర్తింపఁ బడునన్నమాట. జనకుఁడు వట్టి వెఱ్ఱివాఁడుగ నున్నాఁడే! మనమహారాజంత వాఁడు తనంతట వచ్చి పిల్ల నడుగుచుండ నెదురాడఁ దగునా?

శుక:—ఐనను జనకుఁడు తన ముద్దులకుమార్తె కోరిక కాదనునా?

సార:—ఔను. త్రాగలేని పిల్లి బోర్లబోసికొనునఁట! సీతమాత్రము చిన్నదా? చితుకదా? ఎఱుఁగదా? మనమహారాజు వైభవము. (నిట్టూర్చి) ఎట్లైననేమి? ముందుగా జానకిచూపుల్లు రామునినుండి తప్పించి మన మహారాజు మీఁదికి మఱలింపవలయును.

శుక:—ఐన నుపాయ మేమి?

సార:—[ఆలోచించి సంతోషముతో] దాని కొక్కటే యుపాయ మున్నది.

చ॥ చలమున రామవేషమున జానకి నెట్టులొ పెండ్లియాడఁ గా
వలె మన రాజు పై నతని వైభవముం గని రోజురోజుకా
పొలఁతియె రామునిన్ మఱచిపోయి తనంతన రాక్షసేశుపై
నెలకొనఁ జేయుఁ బ్రేమమును నెమ్మదినెమ్మది నందుఁ దండ్రియున్.

నేను లక్ష్మణవేషమును, విద్యుజ్జిహ్వుఁడు విశ్వామిత్రవేషమును వేయుదుము. ఇఁక నడ్డంకి యేమి? వెంటనే జనకుఁడు తనపుత్రినిచ్చి పెండ్లిసేయఁగలఁడు.

శుక:—బాగుబాగు! చక్కని యుపాయము!! కాని యయోధ్యకువెళ్ళిన యా క్షత్రియబ్రాహ్మణుని యాగమనమును ముందుగా నిరోధింపవలయును.

సార:—లెస్సఁ బల్కితివి. మనలో తాటకతప్ప నీ కార్యమును సాధింపఁగల మేటి యెవరు? కర్ణము చాలక యొకవేళఁ బట్టువడినను స్త్రీ కావున వారు చంపక విడచిపుత్తురు.

శుక:—అయ్యో! ఇంతకుముందే చూచితినే? విశ్వామిత్రున కొక బాదరాయణ సంబంధియు శైవుఁడు నగు పరశురాముని ప్రార్థన నంగీకరించి మన మహారాజు పంపఁగా యజ్ఞవిఘ్నము చేయవలదని పుత్రుని మారీచుని హెచ్చరించుట కామె వెళ్లుచుండె నఁట!

సార:—ఆహా! ఈ గోచిపాతరాయుఁడు సామాన్యుఁడుకాఁడు. తన పనుల కడ్డురాకుండ మహారాజును ముందే బుట్టలో పెట్టుకున్నాఁడు. (ఆలోచించి) ఐనను మించినదేమి? నీవు త్వరితముగ నేగి ఈ విషయ మామె చెవినివేసి కార్యసాధనకుఁ గడఁగుము. నేనును మహారాజును బయలుదేరదీయుదును.

[ఇరువురు నిష్క్రమింతురు.]

ఇది విష్కంభము.

దృశ్యము : కౌశికాశ్రమోపవనము.

[అంతట విద్యుజ్జిహ్వ సారణులతో రావణుఁడు ప్రవేశించును.]

రావ:—సీత నా రాక్షసరూపము నేవగించుకొను నని నేను నరవేషము వేయవలెనా?

మ॥ ఎఱుఁగం జాలియుఁ దీసివేసినటు లిట్లేలా వచింపన్? సురా
సుర సందోహ శిరః కిరీట ఘటితానర్ఘ ప్రభా భృన్మణీ
కర నీరాజిత పాదపంకజుఁడ, వీక్షామాత్ర నిర్భిన్నహృ
త్పరిపంథి ప్రబలుండ నా భుజబలావష్టంభ మల్పం బొకో.

విద్యు:—దేవా! తమ బలంబెఱుంగక కాదు. ఎదిరికి జంకియుఁగాదు. పిచ్చుకపై బ్రహ్మాస్త్ర మేల యని.

సార:—బాగుగనే యున్నది. పెండ్లియైనఁగాని పిచ్చికుదురదు. పిచ్చికుదిరినఁగాని పెండ్లికాదు.

చ॥ నలుగురి నోళ్ళలోఁ బడుదునా యనియా? తమ కింత చింత, యిం
దుల మడిఁ గట్టుకొన్న విబుధుం డెవఁ డీ మన దారి పూర్వమే
యల దమయంతి పెండ్లి సమయమ్మున దిక్పతిపాళి చేత బల్
నలుగుడుసెంది యున్నది సలక్షణమై యిఁక వేయు నేటికిన్.

విద్యు:—(ఒడలు పులకింపఁ దనలో) దిక్పాలురకు దమయంతివలె మహారాజునకును జానకి యలభ్యయే యగునా యేమి?

రావ:—సారణా! నీ వెన్ని చెప్పినను సరేకాని మానంబుఁ బోనాడి యపకీర్తిపాలు కాఁజాలను. నేనిప్పుడ చని మదీయనిర్వక్రపరాక్రమంబున నజ్జనకుని గర్వంబు సర్వంబు ఖర్వంబుఁ గావించి చెచ్చెర నమ్మెచ్చెకంటిం దెచ్చికొనియెద. మునినో—రామునినో—యెవనిని శరణు వేఁడుకొనునో చూచెద.

(పోఁబోవును.)

సార:—(నిరోధించి) దేవా!

గీ॥ జగతి విధి బీజము వివేక జలము వలనఁ
జిలువలకుఁ బల్వలై కార్య ఫలము నిచ్చు
నంతె కాని పిడుగునకు బియ్యమున కొక్క
మంత్రమే యందు రెట్లు? నా మాట వినుఁడు.

విద్యు:—ఐనను మఱియొక సంగతి.

ఉ॥ కోరికలూర రంభ నలకూబరుఁ గూడఁగ నేఁగుచో బలా
త్కారము సేయ నాపెయు నిఁకం బర భామల నంటఁ జూచినన్
భోరుసెలంగ నీదు శిరముల్ పది పక్కన నూరు వ్రయ్యలై
తీరు నటంచు శాపమిడదే? యది జ్ఞప్తికిఁ దప్పిపోయెనే.

సార:—ఓ నది విచారణీయమే!

రావ:—(బొమముడిపాటుతో) ఎట్లయిననేమి? రావణుఁడు వేసము వేయును. సరేనా? (లజ్జతో) చూడుఁడు. దుర్బలునివలెఁ జోరవృత్తి నవలంబించిన యీ మానహీనుని—దశాననునిఁ గని యివ్విహంగములు సైత మపహసించుచున్నవి.

సార:—అది సరికాదు. కాఁబోవు జానకీ రావణుల వివాహమహోత్సవమున కాంగికముగ శుకబాలిక లమందానందనాందీనినాదంబుల నందడించుచున్నారు.

[తెరలో]

చిత్రలేఖన సంభారములఁ దెచ్చుటకుఁ బ్రియసఖి శీలవతియు, శిశిరోపచారములకై నళినీపత్రములఁ గొనిరా సుచరితయుఁ బోయిన యీసందుఁ గనిపెట్టి మన్మథుఁ డొంటరిదాననగు నాపైఁ దన చావుతెలివిఁ జూపుచున్నాఁడు. అబ్బా! ఇఁక నేమి సేయుదును?

రావ:—(వినుట నటించి)

గీ॥ పసిక్రొమ్మావి చివురుల యసరు మెసవి
సరళి గొంతెత్తి పంచమస్వరము గదుర
నలరువిలుకాని జయగీతికలను గాడ
మొదలువెట్టెడుఁ గోయిల ముద్దరాలు.

సార:—మహారాజా! అవ్యక్తమధురమధురంబగు నియ్యది కోకిలస్వనంబైయుండదు. శారికావ్యాహారము కాఁబోవు!

[మరలఁ దెరలో]

దేవా! కుసుమాయుధ! ఒక్కసారియైన చిత్రలిఖితుఁడగు మనోహరునిఁ గన్నుల కఱవుదీరఁ జూడనిమ్ము. తరువాత నీయిచ్చవచ్చినట్లొనర్చుదుగాని—

రావ:—(విని) ఇచ్చట నెవరో విరహపరవశయగు నొక తపస్విని విలపించుచున్నది. (నలువంకలు బరికింతురు.)

సార:—అట్లు విలపించిన యామె యెందును గానరాదే?

రావ:—(ఆశ్చర్యముతో) ఇచ్చట నెవరునులేరు. ఆహా! ఇది చాల నద్భుతముగా నున్నదే?

[మరలఁ దెరలో]

గీ॥ అల్లనాఁడొక్క పసిముద్దు నప్పుఁగొంటి
విచ్చకము లాడి యది జ్ఞప్తి దెచ్చుకొనుము
వలపు జెలికాఁడ! పోనిమ్ము వడ్డి నడుగ
నసలయినఁ దీర్చుకొను మంటి నదియు వినవ?

సార:—ఓహో! మఱల నీయాకాశపంచాంగము బయలుదేరినదే?

రావ:—ఏమీ మబ్బులేని సుధావర్షము?

విద్యు:—తాపసుల యాశ్రమవ్యాపారము లచింత్యములు నజ్ఞేయములుఁ గదా!

[మరలఁ దెరలో]

ఇఁక గతి యేమి? విషమా?—

రావ:—మన కదృశ్య యగు నొకానొక యుత్కంఠిత విలపించుచున్న దనుట నిక్కము.

విద్యు:—(ముందునకుఁ జూచి తొందఱతో) సారణా! ఆమె యెవ్వతెయో యిటే వచ్చుచున్నది. మన మిక్కడనున్న నపాయము కలుగవచ్చును. కావున నీ పొదరింటిలోని కేగుదము రండు.

సార:—ఓయీ! వెఱ్ఱివాఁడా! మనము తిరస్కరిణీవిద్యచేఁ దిరోహితులమై యుంటిమి గదా! ఆ విద్యాప్రభావ మేమనుకొంటివి? ఇతరులు మనకుఁ గనుపట్టెదరు గాని మన మితరులకుఁ గనుపింపము. అట్లే మాటలును.

[సుచరిత తామరాకులతోఁ బ్రవేశించును.]

సుచ:—నెచ్చెలీ! కుడిచి కూర్చుండక యేల యమంగళము లాడుకొందువు?

[అంతఁ గిసలయశయనోపవిష్టయగు సీత ప్రవేశించును.]

సీత:—మనోహర ముఖచంద్ర దర్శన సుఖమా? (మూర్ఛిల్లును.)

సుచ:—చెలీ! ఊఱడిల్లు మూఱడిల్లుము. (తామరాకుచే విసరును)

రావ:—ఈ సుందరినిఁ గనుఁగొను భాగ్యము నాకు లేదాయెఁ గదా!

సార:—చెలికత్తెమాత్రము కాన్పించుచున్నది. ఆమె కనఁబడుటలేదు. ఇది మఱియు వింతగా నున్నది.

సుశ:—పాపము! ఈమె సంతాప మంతకంతకు మితిమీఱుచున్నది. ఈచందన పల్లవ రసము నీమెపైఁ జిలుకరించెద. (అట్లు చేయును.)

రావ:—

గీ॥ కడఁగి విరహాగ్ని మొదలంటఁ గాల్చుచుండఁ
దదుపశాంతికినై విరుద్ధముగఁ దనదు
ప్రాణముల గడ్డిపోచల వలె నొనర్చె
నద్దిరా! యీమె యెంతటి ముద్దరాలు!

సుచ:—సఖీ! ఈ చందనరస నిషేకము నీకు హాళిఁగొలుపఁగలదు.

సీత:—(ఇంచుక యీఁజడిల్లి) ఎంతకాల మిట్లు సఖుల నాయాసపెట్టుదునో గదా?

సుచ:—సఖీ! చింతింపకుము. నీ మనోహరుఁడు తప్పక వచ్చును.

సార:—ఈమె మనోహరుఁ డెవరో?

రావ—ఎవఁడో పెట్టిపుట్టినవాఁడు.

సీత:—నెచ్చెలీ! ఏల యీవెఱ్ఱిమాటలు? నేఁడొకటి జీవించినఁ గదా? రేపటిమాట.

సుచ:—చిత్రలిఖితుఁడగు ప్రియునిఁ జూచుకొని నేఁ డెట్లో కన్నులుమూసికొని వెళ్ళింపుము.

[అంతటఁ జిత్రలేఖన సంభారములతో శీలవతి ప్రవేశించును.]

శీల:—చెలీ! ఇదిగో! చిత్రఫలకము. ఇవే లేఖనోపకరణములు. (ఇచ్చును.)

సుచ:—జానకీ! ఇంచుక మనస్సును చిక్కఁబట్టి చిత్రమును వ్రాయుము

సీత:—(చిత్రఫలకము గ్రహించి గాత్రస్తంభ మభినయించును.)

శీల:—చెలీ! ఏమాలోచించుచున్నావు?

సుచ:—శీలవతీ! ఎఱుఁగన ట్లడిగెదవేమి? స్వప్నమున మన్మథునిచేఁ జూపఁబడిన యా మహానుభావునిఁ గూర్చియే.

సార:—మహారాజా! అదృష్టవంతుఁడవు. ముల్లోకములందును నీవు దక్క వేఱు మహానుభావుఁ డెవరు?

రావ:—నాకు నట్లే తోఁచుచున్నది. ఇంకనుఁ బరికింతము.

సీత:—(ఎట్లో కొంతవ్రాసి) సుచరితా! అందనిమ్రానిపండ్లకై యఱ్ఱులుసాచిన లాభ మేమని లజ్జించుచున్నాను. (కన్నీరు విడచును.)

సుచ:—సీతా! చింతింపకుము. అతఁడు మనకు సులభసాధ్యుఁడేగదా!

సీత:—(కన్నీరు తుడుచుకొని మరల లిఖించును.)

సుచ:—(జనాంతికముగా) శీలవతీ! అతనియెడ నీమెకుఁ గల ప్రేమ యింతంతయని చెప్పఁదరముకానిది. చూడుము. వలపుచే లేఁజెక్కులు జాజులగ్రుమ్మరింప నతని రూపరేఖలఁ దలంచుకొని క్రమముగాఁ దన చివురుఁవ్రేళులు కంపింపఁ జిత్రము రచించుచున్నది.

శీల:—(జనాంతికముగా) అచ్చముఁ దాను కలలోఁ జూచినవిధమున వ్రాయవలె నని యీమె యభిలాష.

రావ:—[తనలో] హృదయమా! ఏల యీ యస్థానచాపల్యము?

సీత:—[చిత్రముఁ బూర్తిఁజేసి యందలి నాయకునిఁ గని ప్రేమతో]

మ॥ కలలోఁ గన్పడి వింతవింతకళలం గల్పించి నా వాలుజూ
ఫులలో నుయ్యేల లూఁగి నా వలపుసొమ్ముం గొల్లఁగా దోచి యా
కలతోఁబాటుగఁ బారిపోయితివి దొంగా! చిక్కినా విందుఁ; గూ
కలువేయింతును జూడు నీ చిలిపిపోకల్ చెప్పి యమ్మారుతోఁ.

మనోహరా! ఏదియో దారితప్పి వచ్చినట్లున్నది. (అర్ధోక్తిలోఁ దనలో) చిత్రగతుఁడగు నాథునిఁగని యెదుటనున్న వానినివలె నుపాలంభింప మొదలిడితిని? ఇది ఎంతటి వేలతనము? (సిగ్గుపడును.)

రావ:—[చిత్రమునుఁ జూచి తనలో] ఈచిత్ర మన్యథా వర్తించుచున్నట్లున్నదే?

శీల:—[నవ్వి] జానకీ! నోటిలోనిమాట నోటిలోనే మ్రింగివేసితివి?

సీత:—[సిగ్గుతో] ఏమియు లేదు. చిత్రమును ముగించితిని.

[సుచరితా శీలవతులు చిత్రమును దీసికొని చూతురు.]

శీల:—సుచరితా! చిత్రగతుఁడగు నీతని యాకృతివలెనే యితనియం దీమెకుఁ గల యభినివేశమును నుచితమని తలంతును.

సుచ:—ఇంతటి మధురమూర్తి దొరకెనసిదప జానకకి మనము కనఁబడుదుమా శీలవతీ!

సార:—[చూచి యాశ్చర్యముతో]

గీ॥ కల జగంబుల రూపరేఖావిలాస
సుభగు లగు వారి నెందఱఁ జూడలేదు?
పురుషులను సైతి మిాఁగతి మోహపెట్టు
నిట్టి రూపంబుఁ జూడలే దింతవఱకు.

రావ:—[తనలో]

గీ॥ నల్లగల్వలకునుఁ దమ నల్లఁదనము
వడ్డికిచ్చెడు నీ తనుప్రభలు శౌత్ర

పులకునై నఁ గన్నులపండువుగఁ దనర్చి
శేముషీయుక్తిఁ జెప్పక చెప్పుచుండె.

[ప్రకాశముగా] విద్యుజ్జిహ్వా! చిత్రమునుఁ జూచితివా?

విద్యు:—చూచితిని.

సీ॥ చెలు వెలయించుఁ గ్రొందళుకు మీసపు మొల్క-
నవనవాంకుర యౌవనంబుఁ దెలుపఁ
జెంపకుఁ జేరెడ్డి చెలువారు గందోయి
వితత మహానుభావతను జాటఁ
జెలుత జన్నిదమునఁ జెన్నారు నజినంబు
వడుక పెండ్లికొడుకు బెడఁగుఁ జూపఁ
మోకాళ్ల నంటఁగాఁ బోవు హస్తంబులు
ఘనత ధీరోదాత్తతనుస్ఫువచింప

గీ॥ ధనువుఁ జేఁబూని నిజశూరతావిశేష
ముట్టిపడ రాజసం బెల్ల నొకటఁ గఱఁగి
పోఁతపోసిన చందాన ముద్దుఁగొలుపు
నితనిఁ గనుగొన్న కోలఁదినిఁ గుతుక మొదవు.

సీత:—సుచరితా! చిత్రముం జూచితివి గదా?

సుచ:—(నవ్వి) నేను చూచిన లాభమేమి? నీ మనోహరుఁడు చూచినచో నీచేతకుఁ బారితోషికముగా రత్నకంకణములఁ దొడుగును.

రావ:—సుచరిత నిజము చెప్పినది.

శీల:—సుచరితా! భర్తయొసంగుననుకే మోగాని జానకీ రక్షణార్థము కౌశికుఁడొసంగిన రాక్షసాంధకంకరణమణిఘటితకటకముల నామెకు ముందుగా నీవే తొడిగితివి గదా?

(రావణసారణ విద్యుజ్జిహ్వులు విని యొండొరుల మొగములఁ జూచుకొందురు.)

విద్యు:—వినఁదగినది వింటిమి. కనఁదగినది కంటిమి. ఇఁక నేమి? మన కేదృశ్యయగు నీమె సీత. చిత్రలిఖితుఁడగు నతఁడు రాముఁడు.

రావ:—ఏమీ? ఇతఁడే నా నైదేహీ ప్రణయాపహార దుర్లలితుఁడగు రామహతకుఁడు! (రోషముతో) ఓరీ! దురాత్మా!

ఉ॥ "ఆ చపలాక్షి సీత ప్రణయాపణ మందున విల్చి యప్పుడే
పూఁచిన తళ్కుగందోవల ముద్దుగ నన్ను బహూకరించు, నే

డోచెదఁ దన్మనం"బనుచు ధూర్తత నుబ్బుచునుంటి వేమొ? మా
రీచఫణీంద్ర మిప్పుడె హరీ! యనిపించును నిన్ను దారిలో.

సార:—మహారాజా! ఆకౌశికుని యవినయమునుఁ జూడుము. ఈమె కీ కంకణముల నిచ్చి రాక్షసుల కదృశ్యయగున ట్లొనర్చినాఁడు. అందుచే నామె కనఁబడు చున్నను మనము చూడఁజాలకున్నాము.

విద్యు:—ఔ నట్లే! ఆ క్షత్రియ బ్రాహ్మణుఁడు కడు నేర్పరి.

రావ:—[క్రోధముతో] ఓరోరీ! కౌశికాపశద!

సీ॥ సృష్టికిం బ్రతిసృష్టి సేయఁజాలితిఁగాని
మారీచు నెదిరించి మనుట కల్ల;
రంభా విజృంభ ణారంభ మాపితిగాని
తాటక నాఁగుట బూటకంబు;
పూని త్రిశంకునిఁ బ్రోవఁ గల్గితిగాని
యల రాఘవునిఁ గాచు టది పలుశక్కి;
బ్రహ్మ విజ్ఞానంబుఁ బడయ నోచితిగాని
యస్మత్ప్రయోగమ్ము నరయు టరిది;
ఆ. వె. నిన్నుఁ గట్టఁ ద్రాడు నీవయి కొని తెచ్చు
కొంటి వేమనందు తంటమాట
లాడి నాకు విప్రియంబునుఁ గల్పించి
చావ నిశ్చయించినావె చెపుమ!

సార:—అఁ! ఏమంటిరి? చావనిశ్చయించుకొనుట కతఁ డెవఁడు? చచ్చినట్లే.

రావ:—(ఉత్కంఠతో) ఓయీ సారణా! అది యట్లుండనిమ్ము. జానకిం గనుఁగొన నుపాయ మాలోచింపుము.

సార:—ఆలోచించియే యుంటిని.

రావ:—(ఉత్సాహముతో) ఎట్లు?

సార:—(చెవిలోఁ జెప్పును.)

రావ:—లెస్సఁగ నుపక్రమించితివి. కటకములఁ దెచ్చుటకై యిప్పుడే యాయోధ్యక మునీశ్వరుఁడవు కమ్ము.

సార:—చిత్తము. (సారణుఁడు మునిగా మారును.)

ముని:—[పరిక్రమించి యాయాసము నటించి] ఎవరక్కడ! అయోధ్యనుండి కడు

దప్పువచ్చుటచేతఁ గాళ్ళు పడిపోయినవి. అబ్బా! (క్రిందఁ గూలఁబడును.) ఇట నన్నాదరించు దయామయు లెవ్వరును లేరా? (మూర్ఛిల్లును.)

సీత:—(సంభ్రమములో) సుచరితా! అయోధ్యనుండి వచ్చినవాఁడ ననుచున్నాఁడు. ఆతనిం బరామర్శింపుము.

సుచ:—(మునిని దగ్గఱించి) విప్రోత్తమా! విశ్రమింపుము. (తామరాకుతో విసరును.)

ముని:—(కన్నులు తెరచి) అకారణ కారుణికురాలవగు నీచే బ్రతికింపఁబడితిని.

సుచ:—(తనలో) దైవవశమున నీ పాఱుఁడు బ్రతికినాఁడు. (ప్రకా) స్వామీ! తా మెవ్వరు? ఎచ్చట కేగుచున్నారు?

ముని:—కలఁడుగదా, దాశరథి!

సీత:—(సంభ్రమముతో) అతని కేమో!

రావ:—(అసూయతో) తాటకా మారీచు లాతని మటుమాయమును చేసిరి.

సుచ:—ఎఱుఁగుదు మాతనిని—

ముని:—(వేదన నభినయించి) అయ్యో! నా నాలుక యెండిపోవుచున్నది.

రావ:—(నవ్వి) విపత్కథనంబునకా?

సీత:—(ఆవేగముతో) ఈతఁ డప్రియము చెప్పఁదలఁచిన ట్లున్నది.

శీల:—సుచరితా! ఇతనికిఁ ద్రాగుటకుఁ గొంచెము మంచినీ రిమ్ము. ప్రక్కనది యందను.

సుచ:—(దొన్నెతో నీరుఁ దెచ్చి యీయఁ బోవును.)

ముని:—అమ్మలారా! ఆఁడువాండ్రిచ్చు నీటినిఁ ద్రాగను.

విద్యు:—దేవా! సాగరుని కౌశల్యముఁ జూడుఁడు.

సీత:—(కన్నీటితో) నిజముగ నీ బ్రాహ్మణుఁడు విషణ్ణుఁడై జలపానవిముఖుఁ డగుచున్నాఁడు! నాథున కెద్దియేని నావద వాటిల్లియుండదు గదా?

ముని:—(తనలో) కేవల మాతనికే కాదు. తదభిమానియగు కౌశికునకును. (ప్రకా) సుందరులారా! తొందఱపడవలదు.

సుచ:—మునీంద్రా! ఇంచుక యుపశమిల్లి పై సంగతి చెప్పుము.

సీత:—ఇపుడు నా హృదయ మగ్నియందుఁగాని, యమృతమునందుఁగాని పడఁబోవు చున్నది.

ముని:—నిజముగా నా యీ స్థితిని జూచినచో నా తలిదండ్రులునుఁ బ్రియపుత్రులు నెంతగ దుఃఖింతురో!

విద్యు:—(సోపహాసముగా) వారే గాదు. విరుద్ధవేషగ్రహణముచే రాక్షసజాతి యంతయు.

సీత:—చెలి! ఊఱకుండక చెట్టుఁ గొట్టి పైన వేసికొంటివే.

శీల:—నిజముగా నీతఁడు రాక్షసుఁడే. ప్రియసఖి యావేగ మతిశయపఱచి తరువాత వార్తఁ జెప్పకున్నాఁడు.

ముని:—(భయముతోఁ దనలో) ఈ తొత్తుకూఁతురు నన్నెఱింగెనా యేమి! (విమర్శించి) అది యసంభవము. (ప్రకా) నేను రామభద్రుని ప్రియసఖుఁడను.

రావ:—(నవ్వి) సందేహమేమి? అతనిఁ జంపుటకు ముందంజ వేసినవాఁడవు గనుక!

సీత:—ఇంతమాత్రముచే వ్యథితనగు నాకేమి యూఱట కలుగును?

సుచ:—మునీంద్రా! చెప్పుము. మిమ్మిటకుఁ దోడ్తెచ్చిన పని యేది?

ముని:—అమ్మలారా! మీ కంతయుఁ బూస గ్రుచ్చినటు లెఱుక పఱచెద గాని మీరు దశగ్రీవపక్షపాతినులు కారుగదా?

విద్యు:—దేవా! సారణుని టక్కులు వారి నెట్లాడించుచున్నవో చూచితిరా!

సీత:—(తనలో) ఇట్లనుటచేఁ నీతఁడు నిజముగాఁ బ్రియుని ప్రాణమిత్రుఁడే కావచ్చును.

శీల:—సుచరితా! ఈ దశగ్రీవనామకుఁ డెవ్వఁడు?

రావ:—ఓసీ తొత్తుకూఁతురా! త్రైలోక్య విజయుని నన్నెఱుంగవా?

ముని:—

మ॥ హరశైలం బొక గడ్డిపోచగ నితం డాడించిన ట్లాడె; నా
హరిచక్రంబును వీని గాయపడఁజేయ న్మొక్కవోయెన్; సురా
సురు లెల్లా రడిగాపులై కొలుతు రీ శూరోత్తమున్; రాక్షసే
శ్వరు గాథల్ విననట్టివారుఁ గలరే సర్వంసహామండలిన్.

సీత:—మన కా దుర్మార్గుని గుణములతోఁ బనియేమి. అతఁడు లోకకంటకుఁ డని వాడుక.

రావ:—(ముఖభంగముతో) విద్యుజ్జిహ్వా! వినఁ దగినది వింటిమి.

విద్యు:—కనుకనే యీమెను వశపఱచుకొనుటకు రామభద్రుని వేషము వేయుట దక్క వేఱొం డుపాయముఁ గనలేకుంటిమి.

రావ:—

ఉ॥ రాముని పాత్ర వేయవలె రావణుఁ డంచును బట్టువట్టె యే
మేమియొ మీకుఁ దోఁచునటు లీగతి నాడుచు నున్నవా రిసీ!
కామమునే నడంచుకొనఁ గల్గుదుఁ గా కిటు చోరవృత్తిచే
నా మహనీయజీవితము నవ్వులపా లొనరించు కొందునే?

విద్యు:—(తనలో) వ్యవహారము మఱల మొదటికి వచ్చినది. (ప్రకా) దేవా! ఏల యీ యసమయ వైమనస్యము? మనకు వంచనరయే గదా కులధర్మము!

సుచ:—శీలవతీ! ఎఱుఁగనే యెఱుఁగవా? ఆ లంకేశ్వరునిఁ దమ ప్రియ మిత్రునిగ నెన్నుచుందురు గదా మహారాజుగారు.

రావ:—కనుకనే యీ రావణుఁడు జానకిని బలాత్కారముగ నెత్తుకొని పోఁజాలకున్నాఁడు.

శీల:—విప్రోత్తమా! రావణుఁడు జ్ఞప్తికి వచ్చినాఁడు. మే మాతని పక్షము వారము గాము. (నిరూపించుచు) ఈమె జానకి. ఈమెయు నేనును నామె చెలికత్తెలము

ముని:—(తనలో) ఆహా! ఈమె జానకి యని లెస్సఁగా పట్టి నేలను జూపుచున్నది.

సుచ:—ఇఁక మమ్ము నమ్మి నీవు నీ వృత్తాంతముఁ జెప్ప వచ్చును.

శీల:—ఆర్యా! క్షేమ వార్త నెఱింగించిన పక్షమున మా జానకి తన రత్న కంకణముల నీకుఁ బారితోషికముగ నొసఁగఁ గలదు.

ముని:—(తనలో) నా యీ దొంగవేష మంతయుఁగూడ నందులకే. (ప్రకా) అమ్మలారా! ఏమి చెప్పుదును?

సీత:—(ఆవేగముతో) ఆఁ! ఎట్లు!! మధ్యమలోకాలంకార మస్తమించెనా యేమి? (మూర్ఛిల్లును.)

సఖులు:—హా! జానకీ! నీ ప్రాణమే మా ప్రాణముగా నీసౌఖ్యమే మా సౌఖ్యముగాఁ గంటికిఁ గన్నకు తెఱంగున ని న్నింతకాల మనువర్తించినందుల కిదిదేనా ఫలితము? కడకు మమ్ము విడనాడి యచిరపరిచితుఁ డగు మనోహరు ననుగమించు చుంటివి?

ముని:—ఏల యీ యకాండతాండవము? తుదిముట్ట నాపలుకు లాలింపుఁడు.

సుచ:—నెచ్చెలీ! ఊఱడిల్లు మూఱడిల్లుము. తక్కినదిగూడ విందము.

సీత:—(ఊఱడిల్లి మునివంకకుఁ జూచుచుండును.)

ముని:—ముగ్ధలారా? సంతోషించుటకుమాఱుగా నేల దుఃఖించెదరు? మన్మథమన్మథుం డగు మా రామభద్రుఁడు లక్ష్మణకౌశికులతో ఈపాటి కీయెడకుఁ దప్పక వచ్చును.

రావ:—(నవ్వి) ఓయీ! సారణమునీంద్రా! నీవు నబద్ధము లాడుచుంటివా? దశగ్రీవుఁడు సారణవిద్యుజ్జిహ్వులతోడ ననిగదా చెప్పవలసినది.

సుచ:—జానకీ! ఇఁక నేమి? నీ రొట్టె విఱిగి నేతిలోఁ బడినది. సంకల్పసిద్ధురాలవమ్మా

(సీత హర్ష సంభ్రమములతో లేచి సారణునకుఁ గంకణముల నిచ్చును. సీత రాక్షసులకు నైత మగపడును.)!

రావ:—(విస్మయముతో)

చ॥ కలయొకొ? కాదు; మేల్కొనియెగాదొకొ యుంటిని? మానసంబునన్
గలవర మున్నె? నమ్మెదున? నమ్మకయుందున? కన్నుదోయి నన్
దలపడి మోసపుచ్చెదుగదా? యది యెట్లగు? మిన్ను వీడి చం
చలమగు చంచలాలతిక స్థాయిగ నిక్కడ నిల్చె మాయురే!

గీ॥ మాయకంకణములు చూడనీయ వపుడు
నిద్దపు నిగారములు చూడనీయ విపుడు
చూడనప్పుడు మఱియునుఁ జూచినప్పు
డొక్కతీరయ్యె; చక్కని చుక్క యీమె!

[తెరలో]

కౌశికయజ్ఞ దర్శనార్థ మనసూయతోఁగూడ నత్రిమహాముని తదాశ్రమము
నకు దయచేసెను. వారికి నమస్కరించుటకు రావలసినదిగాఁ
గుమారి జానకిని జనకు లాజ్ఞాపించుచున్నారు.

సుచ:—భాగ్యవశమునఁ బ్రియసఖి కుత్తరోత్తర ప్రియంబు గాన్పించు చున్నది. భగవతి యనసూయ చిరకాలపురంధ్రియుఁ బుణ్యదర్శనియుఁ గదా?

సీత:—(ప్రీతితో) ఔను. పోవుదము రండు. (చెలులతో నిష్క్రమించును.)

రావ:—ఆహా! జానకి కనుచూపు మేఱ దాటి పోయినదే! (విచారించి) విద్యుజ్జిహ్వా! ఈమె నెట్లన సాధింప వలయును.

విద్యు:—రామవేషము ధరించిన నిది యెంతటిపని?

[ముని యథాప్రకారము సారణుఁ డగును.]

సార:—మహర్షు లచింత్యమహిమలు గదా?

గీ॥ ఇచ్చె నామెయు నేనును బుచ్చుకొంటి
ననెడు మాటయెగాని యిచ్చినదొ? లేదొ?
తెలియఁజాల నీ కంకణమ్ముల ధరింప
నా శరీరము నాకె గన్పడకయుండె.

(సమీపించి) దేవా? ఇవే యీ కంకణములు. ఇదే యీ చిత్రపటము. (ఇచ్చును)

రావ:—(అందుకొని) ఈ చిత్రము నెట్లు సంపాదించితివి?

సార:—దేవా? బంధుజన విలోకన కుతూహలంబున వారేఁగు నా సందడిలో నిది యక్కడ విడువఁ బడినది. నేను దీనిని సంగ్రహించుకొని వచ్చితిని.

విద్యు:—రాజేంద్రా! మన సారణుఁ డిప్పుడు కాన్పించు చున్నాఁడు. ఆ కంకణములు దేవర హస్తమం దుండుటచే మీరు కాన్పించుట లేదు.

రావ:—విద్యుజ్జిహ్వా! వీనిని విమానమం దుంచి లంకఁ జేరిన పిదప నీ యొద్ద గుప్తపఱచి యుండ నిమ్ము. సమయమున కక్కఱకు రావచ్చును.

(విద్యుజ్జిహ్వుఁడు నిష్క్రమించి మరలఁ బ్రవేశించును.)

సార:—దేవా? అభిమత రూప గ్రహణంబునకై తొందరపడుడు.

రావ:—అయ్యది నా కనభిమతంబు యైనను జగన్మంగళదీపిక యగు జానకికై నే నిపుడు కుహనారాముఁడ నగుచున్నాను. మీరును లక్ష్మణకౌశిక వేషముల ధరింపుఁడు.

సార:—
విద్యు:— } చిత్తము.

(మువ్వురు రామ లక్ష్మణ కౌశిక వేషముల నిలతురు.)

రావ:—మిత్రులారా? ఇఁక నాలస్య మేల?

గీ॥ స్నేహితుఁడ నైన జనకు వంచింప వలయు;
మనుజవేషం బనర్హ మైనను ధరింప
వలయు; నిఁక జానకీ రావణుల వివాహ
మంగళము త్వరగ జరిగితీరంగవలయు!

కావున జనకునొద్ది కేఁగుదము రండు.

[అందఱు నిష్క్రమింతురు.]

ఇది శ్రీ వెంకట పార్థసారధి కవి ప్రణీతం బయిన విచిత్ర రాఘవమునఁ బ్రథమాంకము.

విచిత్రరాఘవము

ద్వితీయాంకము

దృశ్యము:—వనములో నొకభాగము :

[అంతట మారీచుఁడు ప్రవేశించును.]

మారీ:—(సానుస్మరణముగా) ఆహా! ఆ క్షత్రియార్భకుఁ డెంతటి పరాక్రమశాలి!

మ॥ జవవిస్ఫారిత రామబాణ పటు ఝంఝావాతమం దొక్కఁ పో
చవలెం గోగుపుఁ బల్లటీలఁ గొనుచుం జక్రభ్రమిన్యాయర
త్నవిశేషంబును వల్లెవేసితి నహో! నాకన్న నేవారు లె
క్కువ నేర్పెంగద మానవార్భకుఁ డిసీ! క్షోభించుఁ జిత్తంబి టన్.

(శోకముతో) హా తల్లీ! తాటకా! హా కుమారవత్సలా! హా నాగసహస్ర బల శాలినీ! నీకును రాముని చేతి చావు కలిగెనుగా! దైవ దుర్విపాకము! హా సోదరా! సుబాహూ! ఆ దుర్మార్గుని బాణపు టగ్గిని బుగ్గియైతివిగదా! (క్రోధముతో) ఓరీ రామహతకా! నీ క్రొన్నెత్తుటితోఁ గాని నా కడుపుమంట చల్లారదు. చల్లారదు. కసిఁ దీర్చుకొనకపోను. (చింతతో) కరాఖుఁ డుండెనో, చచ్చెనో! గూడ దెలియకున్నది.

[అంతట కరాఖుఁడు ప్రవేశించును.]

కరా:—హోచంతటి యాయువుపట్టుండుటచే బ్రతుకుజీవుఁడాయని రణరంగమునుండి పలాయన మొనరించితిని గాని లేనిచో నీపాటికి నాకట్టె యెక్కఁడ పడియుండెడిదో (ఇందుక పరిక్రమించి) పాపము! మారీచుఁ డేమయ్యెనో? (ముందునకుఁ జూచి) ఏమిది? మారీచుఁడు చావు దప్పి కన్నులొట్టపోయి యెట్లో యిచ్చటికిఁ జేరుకున్నాఁడే! (సమీపించును.)

మారీ:—(కరాఖునిఁ జూచి విస్మయముతో) కరాఖా! జీవించియే యున్నావా? (నన్నొక్కపరి బిగియారఁ గౌఁగిలించుకొనును.)

కరా:—(కౌఁగిలించుకొని) భాగ్యవశమున రామబాణమును దప్పించుకొంటివి.

మారీ:—నాయనా! ఏమి చెప్పుదును? రామబాణమున నట్టె యాకసమున కెగసి పోయి పోయి సముద్రమునఁ బడితిని. రావణుని వలని భీతిచే నేమి, సహజ దయాతిరేకముచే నేమి సముద్రుఁడు నన్నెట్లో తీరమునకుఁ జేర్చెను.

కరా:—సాగరా! బాగుబాగు. నిజముగా మహారాజ దశాననునివలని భీతిచేఁ దదనుచరుఁడగు మారీచుని రక్షించితివి.

మారీ.—స్వజనవినిపాతమునందలి యౌదాసీన్యముచే నిజముగా నీ మారీచుఁడు మహారాజున కెంతయు నపకీర్తిఁ గలిగించెను.

కరా:—దీనికై చింతయేల? మాయాబలముచే నిప్పుడే యా క్షత్త్రియవటుని మట్టుపెట్టుదము.

మారీ:—ఐన నుపాయమేమి?

కరా:—నీ ప్రజ్ఞాచక్షువున కగోచరమగు నుపాయముఁ గలదా?

మారీ:—(ఆలోచన నటించును.)

[తెరలో]

మార్గాయాసమున బడలి శయనించిన తండ్రిగారికి విన్నవింపక రాముఁ డేకాకియై పోరాని యీ కానలోనికి వేఁట తమకమున వెడలినాఁడఁట! ఏ భాగమున నుండెనో వెదకెదఁగాక!

కరా:—రామభద్రుని ప్రియసఖుఁడగు పింగళుని పల్కులవలె నున్నవే? కావున దశరథుని స్కంధావార మీ చుట్టుపట్టుల నెందే నుండనోపు.

మారీ:—(సంతోషముతో) మన యుపాయమునకు శత్రువులే దారిఁ జూపుచున్నారు. పింగళుఁడు రామునిఁ గలిసికొనకముందే నీవు పింగళవేషమునఁ బోయి వనగజముచేతఁ జిక్కితినని యార్తనాదముఁ జేసి నిన్ను రక్షింపవచ్చెడు రామభద్రుని వనములోఁ జాల దవ్వుఁగొనిపొమ్ము. నేనును విశ్వామిత్రుని శిష్యుఁడగు కాశ్యపుని వేషమున వచ్చి మాయచే విరహవిధుర యగు సీతను గల్పించి యథామనోరథముగాఁ బని నెఱవేర్చెద? చాల మెలఁకువతో మెలఁగవలె సుమా!

కరా:—తాతకు దగ్గులు నేర్పవలెనా? పోవుదము రమ్ము. (నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

దృశ్యము:— వనములో నొక రమణీయప్రదేశము.

[అంతట శరచాపహస్తుఁడగు రాముఁడు ప్రవేశించును.]

రాము:—ఆహా! ఏమి యీ యారామరామణీయకము!

సీ॥ తీవెకన్నియలకుఁ దీరుతీరు రకాల
పువ్వుల జడలను బొందుపఱచి;
కుసుమకాంతలప్రేమ కోపముల్ సడలింప
సొలపుఁ గౌఁగింట నుయ్యెలల నూపి;
గుడుగుంచముల నాడుకొనుచుఁ గొమ్మల యెండు
టాకు రైకల మెల్ల నపహరించి;
కాసారనవతరంగములందుఁ బద్మినీ
స్త్రీలతోడుత జలక్రీడ లాడి;
గీ॥ వనవిలాసినితో ముద్దువగలుమీఱ
సరససల్లాపముల వెల్లి విరియఁజేసి;
తనదు దక్షిణనాయకత్వము జగానఁ
జాటుకొనుచుంటె నదిగో! వసంతుఁ డహాహా!

(తెరలో)

హా సఖా! రామభద్రా! హతోఽస్మి, హతోఽస్మి.

రాము:—(విని సంభ్రమముతో) ఏమిది? ఈ విజనంబగు వనంబున నన్ను, గూర్చి యొక యార్తనాదము వినిపించుచున్నది.

(మరలఁ దెరలో)

అబ్బా! ఈ మాయదారి యేనుఁగు నన్నుఁ బిశాచమువలెఁ బట్టి చంపుచున్నది.

రాము:— ప్రియసఖుఁడగు పింగళుని పలుకులవలె నున్నవే? (త్రొట్రుపడును.)

(మరలఁ దెరలో)

హా తండ్రీ! హతోఽస్మి. హతోఽస్మి. హా తల్లీ! మందభాగినీ! మృత్యువున కొప్పఁ జెప్పుటకే నన్నుఁ గంటివా? హా! సఖా! రామభద్రా! నీ స్నేహ మీపాటి దేనా?

రాము:— (కరుణతో) మిత్రమా! భయపడకుము. భయపడకుము. ఇదే నేను రానే వచ్చితిని. (సమీపించి ధనుష్టంకారముఁ జేసి) ఏమిది? ఇంతలోనే

యేనుఁగు కాలికి బుద్ధిచెప్పినది. ఎట్లెట్లో ప్రాణముల దక్కించుకొని పాప మా శిలాతలమున మూర్ఛిల్లిపడియున్నాఁడు పింగళుఁడు.

(అంతట యథానిర్దిష్టముగఁ బింగళివేషమునఁ గరాళుఁడు ప్రవేశించును.)

రాము:—(దగ్గఱించి) మిత్రమా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

చ॥ ప్రణయనవాంబుదంబునఁ దొఱంగిన కోరిక లేమెఱుంగు లే
యనఘుని పల్కుముత్యముల నాస్థమెయిన్ దొలిముద్దువెట్టి లి
ప్పనుఁగొని సాగుచుండు నటువంటి సుహృద్వరుఁ డిట్లు మూర్ఛలో
మునిఁగి తపించుచుండె నెటుఁబోవుదు? నేమియొనర్తు? దైవమా!

కరా:—(తనలో) దశాననున కేది యిష్టమగునో దానిని. (ఇంచుక కన్నులు తెఱచి ప్రకాశముగా) ఓహో! ప్రియసఖుఁడు రామభద్రుఁడా? దొంగలు పడిన యాఱునెలలకుఁ గుక్కలు మొఱిగిన వఁట!

రాము:—మిత్రమా! సమయమునకు రానేవచ్చితినిగదా? ఏల యీ నాగవల్లి నిష్ఠురము.

కరా:—(లేచికూర్చుండి) రామభద్రా! అబ్బా! ఏమని చెప్పుదును నా యవస్థ? మృగయావినోదతత్పరుఁడవగు నిన్ను వెదకికొనుచు వచ్చుచుండఁగా మధ్య దారిలో—అది యేమి యేనుఁగో గాని నాయనా! తలఁచుకొనిన గుండెలు బ్రద్దలగును—బ్రతికియుండఁగనే యమయాతన ననుభవింపఁ జేసినది.

రాము:—ఇంతకు మనము లేచిన వేళ మంచిది. పాప మెంతగ జడిసియుంటివో? ప్రచ్ఛాయశీతలంబగు నీ పొగడచెట్టుక్రింద నించుక విశ్రమింపుము.

కరా:—వేటయొత్తిడిచే మిగుల డస్సియున్నావు. నీవును విశ్రమింపుము.

రాము:—సరే! పరిజనులు వచ్చువఱ కిచ్చటనే ప్రొద్దుపుచ్చుకొందము. (కూర్చుండును.)

కరా:—(తనలో) మారీచుఁడు వచ్చునంతవఱ కని చెప్పుము.

రాము:—నిన్నుఁ గుశలముగఁ జూడఁగలుగుట నాభాగ్యము చేతనే సుమా!

చ॥ ప్రకటగుణుండ వీ వెపుడుఁ బజ్జఁ జెలంగుటచేతఁ గాదె? కో
టికిఁ బడగెత్తఁ బ్రేముడి తటిల్లతికోపమదేహయైన జా
నకిని వివాహమాడునని నా మది నుబ్బుచునుందు, నీవె మి
త్రికి నెఱయైన నా తలఁపుఁ దీవెకుఁ గ్లున దంటకోఁతయే?

కరా:—అట్లని నీవు పరాఙ్ముఖుఁడవైనచో జానకి జీవించుటెట్లు?

రాము:—మిత్రమా! నీవు నాతోఁ జెప్పుచుందువే?—

చ॥ తలఁపులచూలి స్వప్నమునఁ దాఁ గనుపట్టఁగఁ జేయుటాది నిర్
దలఁపున నిల్పి నెమ్మదిని దాపము పట్టి పలార్చ నా సతీ
తిలకము చెల్మికత్తియల తేఁకువమాటల కించుకెట్టటో
మలయుటమాని ప్రాణములమాత్రము నిల్పుకయుండె నో సఖా!
అనిన యాకాశ్యపునిమాట సత్యమే యగునా?

కరా:—(విసమినటించితనలో) ఎంతసేపైనను మారీచుని జాడ కాన్పింపకున్నది.

రాము:—(వెనుకటిదానినే మఱల నడుగును.)

కరా:—(పరాకులో) కాశ్యపుఁ డెవఁడు?

రాము:—మిత్రమా! చదువవేసిన నున్న మతియుఁ బోయినచే? అతఁడు కౌశికశిష్యుఁ డని నీవే నాకుఁ జెప్పితివిగదా?

కరా:—(తనలో) ఓహో! ప్రమాదము. మారీచుని మీది ధ్యానచేఁ బ్రస్తుత విరుద్ధము సైతముఁ బ్రశ్నించితినిగదా? (ప్రకా) అతని మఱచిన దెవ్వరు? పులిబాకి విడచినవాఁడ నగుటచేఁ దొందఱగ జ్ఞప్తికి వచ్చినది గాదు. కాశ్యపుని మాట లసత్యము లగునా?

రాము:—వయస్యా! పరిహాసములకుఁ బుట్టినిండ్లుగదా నీ మాటలు?

కరా:—నా మాట యేల? కాశ్యపుఁడే యిట్లు చెప్పెను.

గీ॥ తావకీన కథా దివ్య భావగీత
మంచితమ్ముగఁ జేతోవిపంచి నాల
పించి నీవు కౌగింట బంధించి నటుల
దలఁచుకొని మైమఱచుచుండు వలపు మిగిలి.

రాము:—(మేను పులకింపఁ దనలో)

మ॥ కలలోనైనను జాగ్రమందయిన నక్కాంతామణిం జూపలే
దల సూనేషుఁడు, కాని తాదృశదశాప్రాగ్భారవైధుర్య నా
వెలఁదిన్ లోఁదలపెట్టినంతటనె హృద్వీథిన్ బ్రపాసాధ్వసా
కులకౌతూహలసమ్మదాద్భుతము లంకూరించు నొక్కుమ్మడిన్.

కరా:—మిత్రమా! ఏలకో మిన్నకుంటివి?

రాము:—(సిగ్గులో) ఆమె విషయము మనకెందుకు లెమ్ము.

కరా:—(నవ్వి) ఓయీ!

ఉ॥ ఆమెచరిత్రఁ జెప్పుమని యాదిని నీవయి పృచ్ఛ జేసి, యా
పై మెయిఁ బుల్కలెత్త విని వారని ప్రేమరసంబు జాల్కొనన్,
"నామదిఁ బర్వలెత్తెడు ఘనంబగు కోర్కులు నీ వెఱుంగునో
యేమొ?" యటంచు నెంచియొ వచించెద వీగతి నడ్డుపుల్లలన్?

రాము:—(సిగ్గుతోఁ దనలో) నా చిత్త చాంచల్యము నీతఁ డెట్లెఱింగెనో? (ప్రకా) ప్రియవయస్యా! నీ కెఱుంగరానిదని యొకటికలదా? ఆమె నాకు లభింపదేమోయని యాందోళనపడుచున్నాను.

కరా:—(తనలో) ఏమి! ఆమెయెడ నీతనికిఁగల యభిలాష! (ప్రకా) మిత్రమా! నీ కీ చింతయేల? కౌశికమహర్షియే దానిని సంఘటింపఁ గలఁడు.

రాము:—(తనలో) పింగళుఁ డేలకో జరుగని విషయముఁ జెప్పుచున్నాఁడు? (ప్రకా) దాని నెట్లు తెలిసికొంటివి?

కరా:—(తనలో) ఈతని కది తెలియనే తెలియదా? (ప్రకా) అంతయుఁ గాశ్యపుఁడే చెప్పెను.

(తెరలో)

జెలీ! ఇవే తామరతూండ్లు.

కరా:—(తనలో) మారీచుని మాయానాటకమున కప్పటి కప్పుడే నాంది బయలుదేరిన ట్లున్నది:

(అంతట మాయానిగూఢుఁడగు మారీచుఁడు ప్రవేశించును.)

మారీ:—

చ॥ బలువడి సీత నామె పరివారము వారల వారివారి సే
తల నిట నచ్చుగ్రుద్దినవిధాన రచించితి స్వీయమాయచే
నల జనకుండు వచ్చెనని యాయమ నగ్నిఁ బ్రవేశపెట్టినన్
దెలియఁగలేక చిచ్చుఱికితీగుఁ దనంతన రాముఁ డప్పుడే!

దీనిచేఁ దాటకా వధ ప్రతీకారమును, లంకేశ్వర మనోరథమును ముప్పాతిక మూఁడు వీసములు నిర్వర్తింపఁ బడినట్లే. (ముందునకుఁ జూచి) అల్లదే పొగడ చెట్టుక్రింద మాయాపింగళుఁడగు కరాళునిఁ గూడి రాముఁ డిచ్చటనే యున్నాఁడు.

రాము:—పూజ్యుఁడగు కాశ్యపుఁడా? ఏమో! యజ్ఞనిమిత్తము మిమ్ముఁ బిలుచుటకుఁ గౌశికుఁడు రాఁగలఁడని మాత్రమే చెప్పెను.

మారీ:—(శంకతో) ఏమీ యితఁడు కాశ్యపుఁడా? కాకున్నఁ బూజ్యుఁడగు కాశ్య

వుఁడాయని యేల సంబోధించును? అతనికి పింగళవేషగ్రహణమునఁ బ్రయోజన మేమో?

కరా:—(తనలో) యజ్ఞమునకుఁ బిలుచుటకు మాత్రమే కౌశికుఁడు వచ్చెనని యీతని యభిప్రాయము. కాని పెండ్లి పిలుపులకని యెఱుంగఁడు (ప్రకా) అది సరి గాదు. కౌశికుని పన్నుగడ మాత్రమే.

మారీ:—(విని భయముతో) ఇఁక నేమి? అంతయుఁ దెల్ల మైనది. ఇతఁడు నిశ్చయముగఁ గాశ్యపుఁడే. తా నీ పింగళవేషము వేయుటయే కౌశికుని పన్నుగడయగుటచేఁ గాశ్యపపద ప్రయోగ మీతనిచే నిషేధింపఁబడినది. కావునఁ గాశ్యప వేషమునఁ దమ కన్నులలో దుమ్ముగొట్టఁ దలఁచిన నన్నెఱుంగుటకిది విశ్వామిత్రుఁడు పన్నిన దుస్తంత్రమగుట నిశ్చయము.

(ధ్యానము నటించును.)

(మఱలఁ దెరలో)

సీ॥ ప్రియుఁడ! నీ యాగడముఁ బచ్చవిల్తుతోడఁ
జెప్పితిని, నిన్నుఁ బ్రణయంపు శృంఖలములఁ
దగిలిచి మదీయ బాహుమధ్యమున ఖైదు
సేయునఁట! చూతు నింకెట్లు చిక్కుఁ బోవొ?

రాము:—దక్షిణమునుండి యేవో మాటలు వినుపించుచున్నవి. అవి యెవరివో?

కరా:—(అంతటఁ గలయం జూచి తనలో) ఇప్పటికైననుఁ గాశ్యపవేషమున మారీచుఁడు రంగస్థలమునఁ బ్రవేశింప లేదు. కావున నిది మాయా ప్రయోగము కాదు. (ప్రకా) వనదేవతలు విహరించుచుండిరేమో!

మారీ:—నిజముగా నీతఁడు కాశ్యపుఁడే. నా మాయ నెఱిఁగిన కరాళుఁడే యైనచో వీరిని జానకీపరిజనులని యేల పలుకఁడు? (ఆలోచించి) ఒకవేళఁ బింగళాకృతి నేతెంచుఁ గరాళునిఁ గౌశికాజ్ఞచేత లక్ష్మణుఁడు చంపి యుండఁడు గదా? కాని మిమ్ము రామ కాశ్యపుల నిర్వురనుఁ గూడ నా మాయచే నిగ్రహింతును. ఇదియే సుబాహునకువలెఁ గరాళున కాత్మశాంతికరము కాఁగలదు.

రాము:—మిత్రమా! గుబురుకొనియున్న యీలతానికుంజమునందు గూఢముగా నుండి చూతము. (శరచాపపాణియై లేచి పరిక్రమించును. కరాళుఁడు వెంబడించును.)

మారీ:—ఆహా! ఏమీ రఘురాముని గాంభీర్యము! చూచినంత మాత్రముననే గుండెలవిసి పోవుచున్నవి. కాని మిమ్మిట్లాడించి చూచెద. (ధ్యానమునటించును.)

రాము:—(ముందునకుఁ జూచి విస్మయముతో) ఈ ప్రవాళాస్తర మిచటఁ బడియున్నది. ఎవరిదై యుండునో?

కరా:—మనమాటల సవ్వడిని విని సిగ్గుపడిన యొకానొక యుత్కంఠిత దీనిని విడచి యుండనోపు!

(మరలఁ దెరలో)

అక్కటా! ఈమె సంతాప మంతకంతకు మితిమీఱుచున్నది.

చ॥ అనతిగ నిద్రవచ్చినను హాయిగఁ గాలము వెళ్ళు నేమనం
గను కలవచ్చు, నందు నిజకాంతుఁడు గన్పడు, మెల్లమెల్లఁగా
నను దరియంగవచ్చు, 'లలనామణి! దాసుఁడ'నంచుఁ బైఁటకొం
గునుగొని యేమియేమొ తళుకుల్ పచరించుఁ గరంబు లంటుచున్.

రాము:—వయస్యా! నీ యూహ సరియైనదే.

కరా:—(దుఃఖముతోఁ దనలో) మారీచుఁడు వచ్చుజాడ కాన్పింపదు. ఒకవేళఁ గాశ్యపవేషధారియగు నతని నెఱింగి కౌశికుఁడు లక్ష్మణునిచేఁ జంపించి యుండడుగదా! కానిమ్ము. రోటిలోఁ దలఁదూర్చి రోకఁటిపోటునకు వెఱువనేల? (ప్రకా) చెలికాఁడా! మనకీపరనారీవిలోకనముతో నేమిపని? పోవుదమురమ్ము. పరిజను లీపాటికి మనల వెదకి వేసరుచుందురు.

మారీ:—(శోకముతో) రామభద్రుని విముఖుని జేయుచున్నాఁడితఁడు నిశ్చయముగాఁ గాశ్యపుఁడే! వీరి మనస్సును వేఱొకచోటికి మఱల్చెద. (ధ్యానము నటించును.)

రాము:—ఆహా! అరవింద మరంద మత్తమిళింద ఝుంకార సంగీతభంగీతరంగమ్ములు మిన్నుముట్ట, శుక పిక శారికా భూసురాశీర్వాద పురస్సరంబుగ నల్లదే! విపాకమధుర ఫల భార నమిత రాజరంభాస్తంభ సంభావితంబగు మాధవీ మంటపమున నూతన వధూవరులగు వనీవసంతులు పూలసేసలు చల్లుకొనుచున్నారు.

కరా:—ఈ సంవిధానము చూడఁ జూడ రమణీయ మగుచున్నది.

మారీ:—(పండ్లు పటపటఁగొఱుకుచు) ఓరీ కాశ్యపా! ఈ మారీచునిచేతిలో నీకుఁ జావు మూడినది. (ధ్యానము నటించును.)

(మరలఁ దెరలో)

చెలీ! ఈ చందనరసము నీమె శరీరముపైఁ జిలుకరించుము.

కరా:—(తనలో) వీరి పలుకులెంత ముద్దు గొలుపుచున్నవి? సమీపించి చూతునా? ఏ మొగముపెట్టుకొని చూతును? మారీచుఁ డుండెనో—ఊడెనో తెలియక కొట్టుమిట్టాడు నాకు ధైర్యమెక్కడ?

రాము:—(డగ్గఱించి) సమాన రూపరేఖా వయో విలాసినులగు వీ రెవ్వరో?

(అంతటఁ గినలయ శయనోపవిష్టయగు మాయాసీతయు, నామె చెలికత్తెలునుఁ బ్రవేశింతురు.)

1. చెలి:—సఖీ! ఇంతటి యావేగము పనికిరాదు.

2. చెలి:—ఒక్కింత ధైర్యము వహింపుము.

కరా:—(చూచి తనలో) ఆహా! అసాధారణరూపలావణ్యవతియగు నా విలాసిని యెవతియో జానకీశరీరముతో మదనవికారము ననుభవించుచున్నది. కావున నిది మారీచుని మాయాప్రయోగమే కావచ్చును. ఎటుపోయి యెటువచ్చునో? కాని మ్మింకనుఁ బరికింతును. (ప్రకా) వీ రచ్చర మచ్చకంటు లేమో?

రాము:—వీరందఱునడుమఁ జుక్కలలోఁ జంద్రునివలెనున్న యామెఁ గంటివా?

ఉ॥ ఈవనసీమ లేయెద నటింపులు ప్రాయెడి తీయకోర్కె పూఁ
దీవెల మోదువార్చికొని తేటఁ దొలంగి విషాదగీతికల్
జీవిత మాధురిన్ మఱుఁగుసేయఁ గృశించెడు నీ మనోజ్ఞ లీ
లావతి—ఈ సుధాప్రణయలక్ష్మి యెవర్తుకయో సుహృద్వరా!

కరా:—(తనలో) ఇది నిజముగా మారీచుని మాయాప్రయోగమే? (ప్రకా) రామభద్రా! కౌశికాశ్రమ మిచ్చటి కనతిదూరమం దుండుటం జేసి యీయామె జానకియే గావచ్చును.

మారీ:— (సంతోషముతో) ఇప్పటికి రాముఁడు కాశ్యపునిచేతనే మారీచమాయా వాగురం దవులు కొనినాఁడు. వంటయింటకుందే శ్రీవి యెందుఁబోఁగలవు?

రాము:—(తనలో)ఇదినిజమే యైయుండును. జానకి విరహవేదన నిట్లేవర్ణించెనుగదా కాశ్యపుఁడు? (ప్రకా) ఏల యీ శుష్కప్రియములును శూన్యహస్తములును.

(అంతటఁ గాశ్యపుఁడు ప్రవేశించును.)

కాశ్య:—మృగయావినోదతత్పరుఁడగు రామభద్రుఁ డింకను వచ్చుజాడ కాన్పింపదు. పింగళుఁ డొకింత నాతో వెదకినట్లే వెదకి యెందేగెనో తెలియదు. కాని మ్మీమామిడితోపులోఁ గూడ వెదకెద. (పరిక్రమించును.)

కరా:—(కాశ్యపునిఁ జూచి తనలో) అదే కాశ్యపవేషధారియైన మారీచుఁడు రాముని కన్నులఁ గప్పుటకు వచ్చుచున్నాఁడు. (ప్రకా) వయస్యా! పోనిమ్ము. నావి వట్టి శుష్కప్రియములే యగుఁగాకేమి. సీతా వృత్తాంత వేదియగు కాశ్యపుఁడు మన మిటనున్న సంగతి నెఱుంగక కాఁబోలు! అటెటో పోవుచున్నాఁడు. నే నేగి యాతని వెంటఁ బెట్టుకొని వచ్చెద. సర్వమునతఁడే చెప్పఁగల్గఁడు. (వెళ్లును.)

మారీ:—ఏలకో రాముని వీడి పింగళ వేషియగు కాశ్యపుఁడు చాలద వ్వరిగెను. కావున యథా సంకల్పితముగా వీని నొక యాటాడించెద.(ధ్యానము నటించును.)

సీత:—

గీ॥ విరహతాపము నెమ్మది వేఁచుచుండ
నిట్టి శిశిరోపచారము లేమిసేయ
నేర్చు? దివసంబునఁ గొలంకు నీటిచేతఁ
గలువకన్నెకు సౌఖ్యంబు గలుగునెట్లు?

(వేదన నభినయించును.)

మారీ:—(కాశ్యప వేషమును ధరించి) పింగళ వేషధారియగు కాశ్యపుఁడు దాపున లేమిం జేసి మదీయ మాయాబలంబున రాము నాకర్షించుటకే యడ్డంకియు లేదు. (పరిక్రమించును).

రాము:—ఆహా! ఏమి యీమె సౌందర్యము!

చ॥ ఇది కడు సౌష్ఠవంబు మఱి యియ్యది సౌష్ఠవహీనమం చనం
బొదలక నెల్లయంగములు ముద్దులుమూటలుగట్టు మాయురే!
ముదిమది దప్పినట్టి విధి పోఁడిమి నీమె సృజించునెట్లు ల
మ్మదనుఁడె స్వీయశస్త్రములనూర్చి యిటుల్ రచియింపఁబోలెడిన్.

మారీ:—(నవ్వి తనలో) మారీచ కృతమనిన బాగుగ నుండును.

రాము:—మారీచునిఁ జూచి తనలో) కాశ్యపుఁ డిదే వచ్చెను. ఇతనిం జూచుటతో నా మనంబు సిగ్గు వడుచున్నది. (తల వంచుకొనును.)

మారీ:—మా రామభద్రునకు విజయము.

రాము:—(మోమెత్తి) కాశ్యపుఁడేనా?

మారీ:—(శంకతోఁ దనలో) ఏమిది? ఇతఁడు నా కపట మెఱింగెనా యేమి? (విమర్శించి) అది యసంభవము. నిజముగ కాశ్యపుఁడ నని తలంచి పింగళ వేషము నుజ్జగించి స్వీయ వేషమును ధరించుట యందలి భావమును బ్రశ్నించు చున్నాఁడు. (ప్రకా) నేను నిజముగా మహర్షి శిష్యుఁడనే.

రాము:—(తనలో) నిశ్చయముగ నీతఁడే పింగళునిచేఁ జూడఁ బడినవాఁడు (ప్రకా) మిత్రమా! ఈమెయేనా సీత?

మారీ:—(తనలో) ఆ పింగళ వేషధారి కాశ్యపుఁడు కాఁడు. కనుకనే నీవు నిక్కముగఁ గాశ్యపుఁడవే యైనచో బింగళుం డెందేగెనని ప్రశ్నింప కున్నాఁడు. (ప్రకా) ఔ నీమెయే సీత.

రాము:—(హర్షముతోఁ దనలో) హృదయమా! ధన్యురాలవు. ధన్యురాలవు. (ప్రకా) వయస్యా! ఈమెనుగుఱించి పింగళుఁడన్నదంతయు సత్యమన్నమాటయే!

మారీ:—(దుఃఖముతోఁ దనలో) అతఁడు నిజముగఁ బింగళుఁడే. కరాళుఁడు లక్ష్మణునిని వాతఁ బడనట్లే. (ప్రకా) ఏడీ పింగళుఁడు ?

రాము:—(తనలో) పింగళుఁ డితనిఁ గలిసికొననేలేదా? (ప్రకా) నీవు వచ్చుచుంటివని చెప్పి యాతఁ డిటే పోయియుండెను. వెనుకటివలెనే వనగజమునకుఁ జిక్కియుండఁడుగదా?

మారీ:—(సంతోషముతోఁ దనలో) కరాళుఁడే పింగళరూపమున రాము నాకర్షించినది. నే ననవసరముగఁ ద్రాటినిజూచి పామనుకొంటిని. (ప్రకా) ఏమో! నా కాతఁ డెందును గాన్పింపలేదు.

కాశ్య:—(ముందునకుఁజూచి) ఏమిది! కిసలయశయనోపవిష్టయై జానకి మదనవేదన ననుభవించుచున్నది. ఈ ప్రదేశము కౌశికాశ్రమమున కఱయామడపైనున్నది. ఇచ్చట నిది యెట్లు సంభవించును? మనుజులఁబోలిన మనుజులుందురు. ఈమె మఱి యెవ్వతెయైనఁ గాఁగూడదా? (వేఱొకవైపునకుఁజూచి భయముతో) ఆ కనుపించు పాషాణమునకు సమీపమున హవ్యవాహనుఁడు పరాక్రమించుచున్నాఁడే! విరహజ్వరావేగము సహింపలేక యీమె యిందుఱికి ప్రాణముల వీడునని తోఁచుచున్నది. కానిమ్మిచ్చటఁగూర్చుండి పరికించెద. ఈలోపలఁ బింగళుఁడుగాని రాముఁడుగాని రాకుందురా? (కూర్చుండును.)

(అంతటఁ బింగళుఁడు ప్రవేశించును.)

పింగ:—ఆహా! మృగయాప్రవృత్తుండగు రామభద్రుఁ డెందేగెనోగదా! కాలికి బలపముఁగట్టుకొని వనమంతయు గాలింపుగంగవలెఁ దిరిగితిని. కాని లాభము లేకపోయెను. కాశ్యపుఁ డొకింతనాతో వచ్చినట్లవచ్చి యేమాయెనో తెలియదు. కానిమ్మింకను బరిశీలించెద. (ముందునకుఁజూచి) రాముఁడు కాశ్యపునిఁగూడి యిచ్చటనే యున్నాఁడు. సమీపించెద. (పరిక్రమించును).

మారీ:—(చూచి తనలో) పింగళవేషియగు కరాళుఁడే వచ్చుచున్నాఁడు. (ప్రకా) వయస్యా! అనుకొనుచుండఁగనే పింగళుఁడును వచ్చెను.

రాము:—పింగళా! ఇప్పటికి నీమాట నమ్మికకు వచ్చినది.

పింగ:—(తనలో) ఏమిది? అసమయమున నితఁ డిట్లనుచున్నాఁడు (ప్రకా) మిత్రమా! నీ మాట యేమో నా కంతుపట్టుటలేదు.

మారీ:—(పింగళునిఁ గాఁగిలించుకొని జనాంతికముగా) కరాళా! భ్రమపడకుము. అదృష్టవశమున నీవు జీవించియుండఁ జూచితిని. ఇంతసేపటివఱకుఁ గాశ్యపుఁడు పింగళవేషము వేసెననియు, నీవు లక్ష్మణబాణపాతమున కెఱయైతివనియు, శంకించుకొని మిగుల క్షోభిల్లుచుంటిని.

పింగ:—(తనలో) కాశ్యపుఁడుకూడ నసంబద్ధప్రలాపముల నేకరువుపెట్టుచున్నాఁడు? (ప్రకా) ఏదీ నీవుచెప్పినది మరల నొక్కసారి చెప్పుము.

మారీ:—(భయముతోఁ జూచుచుండును.)

రాము:—మిత్రమా! ఈ సుందరీమణులఁ గూర్చియే నేను చెప్పుచున్నది. (కనుసన్న చేతఁజూపును.)

పింగ:—(తనలో) ఉత్కంఠితయగు సీత సఖులతో నా చెట్లచాటునఁ గనుపించుచున్నది. కనుకనే 'యీమె యిట్టి యవస్థలో నున్నది' అని వెనుక నేను చెప్పినదానినే యిప్పుడితఁడు జ్ఞప్తికిఁ దెచ్చుచున్నాఁడు. (విమర్శతో) ఇదియెట్లు సంభవించును? కౌశికాశ్రమ మిచ్చోటి కఱయామడపైననున్నదే?

మారీ:—(తనలో) ఇతఁడు కరాళుఁడు కాఁడు. నిజముగ పింగళుఁడే. అయ్యో! కరాళుఁడనునోని గుట్టంతయు బయటఁబెట్టుకొంటినే? కాలుజారినఁ దీసుకొనవచ్చును గాని నోరుజారినఁ దీసుకొనుట కష్టము. కరాళుఁ డెటుబోయెనో గదా? కానిమ్ము. శోకమున కిది సమయముగాదు. మాయచే రామభద్రుని కథకు భరతవాక్యము పలుకవలయును (ధ్యానము నటించును.)

1. చెలి:—కలువజవరాలికివలెనే యీ కలువకంటి కీ శిశిరోపచారము లేమి హాళిఁ గొల్పఁగలవు? రామచంద్రుని ప్రేమపరిరంభములఁ దక్క నీమెకు వేఱుగ సౌఖ్యము కలుగదు.

రాము:—ఈ చెలిమికత్తె పలుకులకు నా యొడలు పులకించుచున్నది. ఆగడపల క్రొన్నీటచేతఁ గడిమిచెట్లు పుష్పించును గదా?

పింగ:—(శంకతోఁ దనలో) ఈతఁడు కాశ్యపుఁడు కాఁడు. తాటక చావును మనస్సునఁ బెట్టుకొని కసిఁ దీర్చుకొనుటకై కొండొక రాక్షసుఁడు స్వీయమాయచే జానకిం గల్పించి రాము నీ విధమునఁ జెవులుపట్టి యాడించుచున్నాఁడు. కనుకనే యేమేమో తబ్బిబ్బులాడి తిరిగిఁ బ్రశ్నింప నాలుక కఱచుకొని తెల్లమొగము వేసినాఁడు. (ప్రకా) రామభద్రా! ఈమె జానకి కాదు. వారు పరిజనులును గారు. ఈ ఘోరాటవి నది యెట్లు సంభవించును?

రాము:—(తనలో) ఏమి వీని పూర్వాపర విరుద్ధ వచనములు! ఇతఁడే గదా యీమె జానకయని చెప్పి తద్వృత్తాంత వేదియగు కాశ్యపుని దోడ్కొని వచ్చెద నని వెళ్ళియుండెను. ఇంతలో నీ మార్పేమి! ప్రియజన పరివృతయగు నీమె మాయయా జానకి యెట్లగును? (ప్రకా) కాశ్యపుఁడీ మాటలు వినెనుగదా!

మారీ:—(రామునితో జనాంతికముగా) రామా! నీవు తాటకం జంపుటంజేసి కొండొక రాక్షసుఁడు నీపైఁ గసిఁ దీర్చుకొనుటకై తన మాయచే నిన్నిట్లు భ్రమపెట్టుచున్నాఁడు. (ధ్యానము నటించును.)

రాము:—ఆర్యా! నిజమాడితివి. మన మాటలకీ రాక్షసుఁడు పానకములోని పుడక యయ్యెనే!

పింగ:—(తనలో) అంతకంతకు బాకము ముదురుచున్నది. చెట్టయి వంగనిది మ్రానై వంగునా? (ప్రకా) మ్రొక్కఁబోయిన గుడివిరిగి మీఁదఁబడినట్లు నిజ

ముచెప్పఁబోవ నాపై రాక్షసుఁడను నిందపడినదే? మిత్రమా! సవిమర్శముగ మాట్లాడుము.

సీత:—మందభాగిని నగు నాకేనా యది లభించుట?

రాము:—ఏమంటివి? మదీయపరిరంభణము దుర్లభమనియా? నీకటాక్ష వీక్షణ సమ్మోహనాస్త్రములు పట్టి నీయొద్ది కాకర్షించుచుండ వానికిఁ గైవసము కానంతటి ప్రజ్ఞాశాలినా నేను?

నారి:—(తనలో) ఈతని యనురాగబీజము పాతాళము దనుక వేఱుదన్నినది. ఇఁక నాపని నెఱవేఱినట్లే (ప్రకా) ప్రియురాలి కోర్కెదీర్చుటయే వయస్యుని కర్తవ్యము.

రాము:—

చ॥ చటువుల నోర్తు గంటినఁట—(ఆశ్చర్యముతో)
ఆమెయె తజ్జనకాత్మజాతయా
నఁట; విరహజ్వరార్తయఁట—(హర్షానురాగములతో)
అయ్యదియుం గన మన్నిమిత్తమే
నఁట; ఉపశాంతి తాదృశ మహార్తికి—(రోమాంచముతో)
మత్పరిరంభణంబుచే
నఁట! ఇఁకఁ బెండ్లిగాని పడుచోట మనంబున భీతిగ్రాలెడిన్.

నారి:—(ధ్యానము నటించును.)

2. చెలి:—దుర్లభమేటు? కౌశికమహర్షి కలఁడుగదా?

1. చెలి:—సఖీ! దాని నటుంచుము. దశగ్రీవుఁడు తన్నర్థించునేమో యని యామె యాందోళనము

సీత:—(కన్నీటితో) నన్ను దశగ్రీవుఁడు నర్థించునా? శైవాభిమానంబున నన్నొకవేళ నా జనకుఁడతని కంటఁ గట్టిన మొదల విసము నైనఁ ద్రావెద. చిచ్చుననైన నుఱికెద.

రాము:—(ఆనందముతో) వేయి యేండ్లు తలక్రిందుగఁ దపస్సుఁ జేసినను నిట్టి యన్నులమిన్న లభించునా?

కాశ్య:—(కరాళునిఁ జూచి) ఓయీ పింగళా! మృగయా ప్రవృత్తుఁడగు రామచంద్రునిఁ గలిసి కొంటివా?

కరా:—కలిసి కొనుటయే కాదు. నీవు చెప్పిన చొప్పున నాతనిఁ జాల దవ్వు రప్పించితిని. ఇదె వచ్చెద వదె వచ్చెద వని నోరు తెఱచుకొని నీ రాకకై చూచి చూచి కన్నులు కాయలు కాచినవి. కాని నీ వెంతకును రాకుండుటచే

లక్ష్మణుని వాతఁ బడితివేమో యని భయ పడితిని. కాని దైవ వశమున మరల నిన్నుఁ జూడఁ గలిగితిని.

కాశ్య:—(ఆశ్చర్యముతోఁ దనలో) లక్ష్మణుని శత్రువులలోఁ బింగళుఁ డను వాఁ డొకఁ డుండుటేమి? తన్మిత్రుఁడ నగు నన్నుఁ దన వానిఁగాఁ జూచు కొనుటేమి? (అంతటఁ గలయం జూచి) అల్లదే! అచ్చట నా రూపమున నున్న దెవరు? కానిమ్ము. నిజము నిలుకడ మీఁదఁ గాని తెలదు. (ప్రకా) ఇప్పుడు రామభద్రుఁ డెచ్చట నున్నాఁడు?

కరా:—(తనలో) ఈతని మన స్సంతయు రామభద్రునిపై నుండుటచే నేను జేసిన యీ ఘన కార్యమునకు నన్ను మెచ్చుకొన లేదు. (ప్రకా) సీతను జూచుచు నా మామిడి చెట్టు దరి నున్నాఁడు.

కాశ్య:—ఆమె సీతయే యని నీ వెట్లు తెలిసికొంటివి?

కరా:—(నవ్వి) మొదట నీ వన్నట్టే శంకించియుఁ గ్రమముగా నీ మాయా విలాస మని తెలిసికొంటిని. తాటకా కుమారుండ వగు నీవు మా యందఱకన్న మిన్నవు గదా?

కాశ్య:—(ఉద్వేగముతోఁ దనలో) ఇప్పు డంతయుఁ దేలినది. ఇతఁ డెవఁడో మారీచుని యనుచరుఁడు. మారీచుఁడు నా రూపము ధరించి రాముని చెంతఁ నాటక మాడుచున్నాఁడు. వచ్చి వచ్చి యీ పెద్దపులి నోటఁ బడితినే? హా! ఇఁక బ్రతుకు తెరు వెయ్యది? (భయముచే మూర్ఛిల్లును.)

కరా:— ఊఱడిల్లు మూఱడిల్లుము. తాటకం దలంచుకొని యిట్లు దుఃఖించిన లాభమేమి? ఆ రాజ పుత్రునికిఁ బ్రతీకారము సేయవలెను

కాశ్య:—(లేచి యంజలి బంధించి) అయ్యా! నాజోలికి మాత్రము రాకుము. నేను మారీచుఁడనుగాను. నన్ను రక్షించి పుణ్యము గట్టుకొనుము. నాయనా! నీ కొక నమస్కారము.

కరా:—ఇతఁడు విప్రవటువే నా? ఇతఁడే మారీచుఁడనుకొని విషయమంతయు వెళ్ళఁ గ్రక్కితినే? పెదవిదాటినఁ బృథ్వి దాటునుగదా? (శోకముతో) హా! మారీచా! హా వివిధమాయా సంప్రదాయగురూ!—(అర్థోక్తిలో) ఈ వ్యర్థప్రలాపము లతోఁ బనియేమి? (కోపముతో) ఓరీ సుమిత్రాగర్భవిప్లోషణా! (విమర్శతో) వీనిచే లాభము లేకపోవుటట్లుండ నాచావునకు నాయంతట నేనే త్రోవతీసు కొన్నట్లగును. ముందుగా నీ బ్రహ్మచారిని మట్టుబెట్టెదను. చచ్చినవాని పెండ్లికి వచ్చినంతయే కట్నము. (కాశ్యపునిగొంతు పట్టుకొనును.)

కాశ్య:—(పెనుగులాడుచు)

గీ॥ రాఁగదే రామ! రక్షింపరాఁగదయ్య
చంపుచుండె మారీచానుచరుఁడు నన్ను

అందఱకు నేను లోకువయైన నాకు
నంబికొండాయి లోకువన్ పగిదిఁ గడఁగి.

(తప్పించుకొని రామునివంకకుఁ బరుగెత్తును.)

రాము:—ఏమిది? కాశ్యపుని పలుకులవలె నున్నవే? వయస్యా! భయపడకుము. భయపడకుము.—(అర్ధోక్తితో)

మారీ:—కాశ్యపుని నీప్రక్క నుంచుకొనియే యేమేమో పలుకుచున్నావు?

కరా:—(కాశ్యపు నతిక్రమించి కాశ్యపుఁడు చదివిన పద్యమును జదువుచు వచ్చి రామునిఁ గౌఁగిలించుకొనును.)

రాము:—కాశ్యపా! పింగళు డిదే వచ్చెను.

మారీ:—(హర్షముతోఁ దనలో) ఇతఁడే కరాళుఁడు. కాశ్యపునిఁ గూడివచ్చినాఁడు. (ప్రకా) మిత్రమా! నారూపమునుధరించిన మారీచునిఁ జూడుము (కాశ్యపునిఁ జూపును)

కాశ్య:—రామభద్రా! మారీచుఁడో నారూపము ధరించి నీప్రక్కనఁజేరి యీామె సీతయని నిన్ను దుద్దువెట్టుచున్నాఁడు.

కరా:—(సంతోషముతోఁ దనలో) దైవవశమున మారీచుఁడు బ్రతికియున్నాఁడు. (ప్రకా) నారూపము ధరించిన యితఁడెవ్వఁడు? గ్రుడ్లు మిటకరించుకొని చూచుచున్నాఁడు.

పింగ:—ఓరీ! త్రుళ్ళకుము ఇల్లలికినంతనే పండువగాదు. నీమొగముననే ప్రొద్దుపొడువ లేదు.

మారీ:—అతనితో నేమి? రాముఁ డాతని నీవఱకే రాక్షసునిఁగ నిర్ణయించెను.

పింగ:—కాశ్యపా! నన్ను మొదటఁ 'గరాళా!'యని సంబోధించి యంతటితోఁ దోఁకముడుచుకొన్న త్వద్రూపధారి యగు నీతఁడు మారీచుఁడు. కావున నా రూపము ధరించిన యీాతఁడు కరాళుఁడు కావచ్చును.

రాము:—ఈతఁడేలకో కాశ్యపుని మారీచుఁడనియు, సీతను మాయయనియుఁ, బింగళునిఁ గరాళుఁడనియుఁ జెప్పుచున్నాఁడు. (నల్వురనుజూచి) ఆశ్చర్య మాశ్చర్యము!

కం. ఇరువురు పింగళులును మఱి
నిరువురు కాశ్యపులు నొకటనే కూడిరి, యిం
దిరువురు ప్రియమిత్రులు మఱి
నిరువురు రక్కసులు నెట్టు లెఱుఁగుదు వీరిన్.

మారీ:—(పింగళ కాళ్యపులఁ జూపుచు)

గీ॥ బిత్తరులు వీరు రాక్షసుల్ వేషధరులు
వేగిరింపుము వీరల పీచమడఁప—

రాము:—(క్రోధముతో శరము సంధింప నుద్యుక్తుఁడగును.)

కాళ్య:—

గీ॥ ప్రియవయస్యుఁడ! ఇది మారీచు మాయ
వలయు సువిమర్శ వేగిరపాటు వలదు.

రాము:—ఎట్టిది?

ఉ॥ ప్రేయసియందు రాయము వీరలు, వారది రాక్షసప్రశ
స్మాయయటందు రందులకు మానస మీరసమందు నైన నా
చేయది రాదుచంపుటకుఁ జిత్రము వీరలఁ జూడ వెన్కకున్
బోయిన సాయి ముందునకుఁబోయిన గోయియునయ్యె నిత్తఱిన్.

మారీ:—ఏల యీ సందిగ్ధావస్థయందును శరమును విడువకుంటివి? (ధ్యానము నటించును.)

(ఒక చెలికత్తె పరాక్షేపమున సంభ్రమముతోఁ బ్రవేశించును)

3 చెలి:—హా! హా!! ఇఁక నేమిగతి?

(అందఱు విని భయముతోఁ జూచుచుందురు.)

1 చెలి:—సఖీ! చెప్పుము చెప్పుము. ఏల యీ సంభ్రమము?

సీత:—(ఉద్వేగముతో) చెప్పుము. చెప్ప నేమి జరిగినదో? నా హృదయము తలుగ కొనిపోవు చున్నది.

3. చెలి:—అయ్యో! కొంప మునిఁగినది. అప్రియము నెట్లుచెప్పుదును?

సీత
1. చెలి
2. చెలి
}:—తొందఱగాఁ జెప్పుము విని కర్తవ్య మాలోచింతము.

3. చెలి:—ఏమిచెప్పుదును? (కన్నీరు విడుచుచు) ఎంతగఁ బ్రార్థించినను సీత నిచ్చుట కొప్పుకొనకుండుటచే జనకులపై దశగ్రీవుఁడు కోపించి—

సీత:—తండ్రిగారి కే యాపదయు గలుగలేదుగదా?

3. చెలి:—వారి శిరస్సును దునిమి మన ప్రియసఖిని ఎత్తుకొనఁ బోవుటకే వచ్చుచున్నాఁడు.

సీత:—(దుఃఖముతో) ఏమి చేయుదమేమి చేయుదము !! (నిలచును.)

చెలులు:—హా! హా!! అత్యాహిత మత్యాహితము. (సీత ననుసరింతురు.)

రాము:—(తొందఱతో సమీపించి) భయపడకుము జానకీ! భయపడకుము. ఎత్తుకొని పోవుట కతని కేమి గుండెయో చెలువా? ఈ ముక్కిడి రక్కసులను ముక్కడంప నెక్కువెట్టిన యీ బాణము చేతనే——

కరా:—(భయమున మారీచునితో జనాంతికముగా) ఈతఁ డేమి సేయునో మన కిఁక గతియేమి?

మారీ:—(జనాంతికముగా) గుమ్మడికాయల దొంగయనిన భుజములు తడుముకొననేల? ఈ దాడి మనమీఁదికిఁ గాదు. ఈ బ్రహ్మచారులఁగూర్చియే యట్లుపలికినాఁడు.

రాము:—జనకుని సంహరించిన యీ దశాననుని యుత్తమాంగము నుత్తరించెద.

కాశ్య:—ఈయనకు యమంగళము లాడ నేల? జనక దశాననులు ప్రియమిత్రులు గదా? నీ కీ యకాండతాండవ మేల?

కరా:—ఎల్లప్పుడు విరుద్ధములాడెడు నీతఁడు వధ్యుఁడు.

మారీ:—

గీ॥ బిత్తరులు వీరు రాక్షసుల్ వేషధరులు
వేగిరంపుము వీరల వీచుమిడఁప (ధ్యానము నటించును.)

కాశ్య:—

ప్రియవయస్యుఁడ! ఇద్ది మారీచు మాయ
వలయు సువిమర్శ వేగిరపాటు వలదు.

సీత:—ఈ శిల నధిరోహించి చెట్లయొఱపిడిచేఁ గలిగిన యీ దవానలంబునఁ బడి పితృశోకమును, ఆ మహాపురుషునియందలి ప్రేమచేఁ గలిగిన మదనజ్వరంబును శాంతింపఁ జేసికొనియెద. (నిష్క్రమించును.)

చెలులు:—సఖీ! జానకీ! మమ్ము విడిచిపోవుచున్నావా? అక్కటా! ఈ విశ్లేషమెట్లు భరింతుము! (నిరూపించి) జానకి యిప్పుడే యగ్నిఁ బ్రవేశించినదే. హా! సఖీ! హా విదేహకుల మంగళదీపికా! (ఒండొరులతో) ఈ యరణ్యరోదనము వలనఁ బ్రయోజన మేమి? మనమును బ్రియసఖి ననుసరింతము. (నిష్క్రమింతురు.)

రాము:—(శరసంధానము నుజ్జగించి) అయ్యో! నా మనోరథ మందారము——త్రిభువన భూషణము——పంకజాసన యశః కర్పూరము——మీన కేతన కేతనము——నేత్రోత్సవము——అంతరించెను. అంతరించెను!!! కటకటా!

ఆ॥ భూమి తనలోన నన్నుఁ గల్పుకొన దేల?
మృత్యువున కక్కటిక మేల? మిన్ను విరిగి

పైనఁ బడ దేల? యీ పాడు ప్రాణవాయు
లెగసిపో వేల? నక్కటా! ఏమిసేతు?

మారీ:— (తనలో) సమయానుకూల వచన రచనా దోహదమున సీతని యావేగము నింకను వృద్ధి పఱచెద (ప్రకా) హా సీతా! హా దేవ యజన సంభవా! హా విదేహకుల నందినీ! హా త్రిభువ నైక సౌందర్య శాలినీ! రామ మన్మైక జీవనీ! ఆ మాల దైవము నీకు నిట్టి చావుఁ గల్పించెనా? (మూర్ఛ నటించును.)

కరా:—(తనలో మారీచుఁ డనిన బాగుండును. (ప్రకా) కాశ్యపా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

పింగ:— మారీచుని చాకచక్యమే మెచ్చఁదగినది. రామునికన్న ముందే మూర్ఛ పోయినాఁడు. 'అసలు తిననమ్మ అట్లే యున్నది. ముప్పూట తిని నమ్మ మూర్ఛ పోయినదఁట.'

రాము:—

గీ॥ గరళముం ద్రావుదున? మహీంధరమునుండి
కూలుదున? సాగరమున దూకుదున? ఇంక
నెందుఁబోయెద?. . .

కరా:—(తనలో) తాటకనుగాని సుబాహువునుగాని యడుగుము.

రాము:—

ఈ వహ్నియందె చొచ్చి
కలిసికొందున నా ప్రియాంగనకు దివిని?

మారీ:—(తనలో) అట్లేచేయుము. మా కోరికయు నదియే. (ప్రకా) వయస్యా! జానకీ ప్రేమభరమున కిది యేపాటిది?

కాశ్య:—అయ్యో! అయ్యో!! వీరి మిథ్యాచరిత్రము లంతకంతకు విస్మయమునుఁ గొల్పుచున్నవి!!!

రాము:—ఇఁక నాకీ లోకములో నేమిపని? ఈపాషాణము నెక్కి యథామనోరథముగ జానకి ననుసరింతును. ఆలసించినఁ జాలదూరము పోవునేమో?

(రాతి నెక్కును.)

పింగ:—ఆహా! రాక్షసులచేతఁ బూర్తిగ వంచింపఁబడితిమి. కౌశికున కీ వృత్తాంత మెట్లు తెలియును? చెలిమిచేతఁ జేదుమేపింప వచ్చునుగాని బల్మిని పాలు త్రాగింపలేము. ఇఁక నేమిగతి?

మారీ:—(హర్షపారవశ్యములో) అమ్మయ్య! నా మనోరథము కొనసాగినది.

గీ॥ తివిరి కన్నుండఁ గనుపాపఁ దీయు శక్తి
కలుగువాఁడను నా చేతిబలిమి రామ
భద్రు నదె తాటకావధ పాతకంబు
కట్టి కుడుపుచునున్నది, కను కరాళ!

కరా:—(భామముడిపాటుతో హుంకరించి వలదని కన్నుగీటును.)

పింగ:—(కాళ్యపునిచేయిఁ జఱచి నవ్వుచున్నాఁడు.)

కాశ్య:—రామభద్రా! వింటివి గదా? నీ కాశ్యపుని మాటలు.

రాము:—(శంకతో) ఆఁ! ఏమి!! (మఱలఁ దన స్థానమునకు వచ్చుచున్నాఁడు.)

మారీ:—(కరాళునితో జనాంతికముగ) హర్షపారవశ్యముచే నా పాపిష్ఠినోరిచ్చ వచ్చినట్లు వాగినది. ఇఁకేఁ గర్తవ్యమేమి?

కరా:—ఇంతకన్నఁ గర్తవ్యమేమి? కాలికి బుద్ధిఁజెప్పుదము. (పాఱిపోవుదురు.)

రాము:— తుంటరులారా! నిలువుఁడు నిలువుఁడు. (శరము విడుచును.)

కాశ్య:—రామబాణము తగిలియుఁ దగులక మునుపే కరాళుఁ డొక కొండవలె నేలఁ గూలినాఁడు. మాయావి యగు మారీచుఁ డదృశ్యుఁడై తప్పుకొనినాఁడు.

పింగ:—(రాతివంకఁజూచి) రామపాదస్పర్శచే నా రాయి యొక స్త్రీరూపము నొందినది. ఆశ్చర్య మాశ్చర్యము!!

(అంతట నహల్య ప్రవేశించును.)

అహ:—జయము జయము రామచంద్రా! జయము జయము.

రాము:—అమ్మగారు కౌసల్యవలె నీమె యెవరో నన్నుఁ బిలచుచున్నది.

అహ:—దేవాదిదేవా! రామచంద్రా!

ఉ॥ ఏ నిట నాథుఁ డల్క శపియింప శిలాకృతి నెండ కెండుచున్
వానకు వాడుచున్ వనమునం బడియుంటిని దిక్కులేక దే
వా! ననుఁ దావకీనపదపాంసువునం బరిపూతఁ జేసితౌ
మా నన లెల్లఁ దీరె మునిమానససారసరాజహంసమా!

రాము:—(తనలో) ఈమె విషయ మప్పుడప్పుడు కౌశికుఁడు చెప్పుచుండును. (ప్రకా) భగవతీ! దాశరథి యిదే నమస్కరించుచున్నాఁడు.

అహ:—చిరంజీవ!

పింగ } భగవతీ! శతానంద జననీ! నమస్కారము.
కాశ్య }

అహ:—అభీష్టసిద్ధిరస్తు. రామచంద్రా! భర్తగారు నాకొఱ కెదురుచూచుచుందురు. పోయివచ్చెద నా కనుజ్ఞ నిమ్ము. (నిష్క్రమించును.)

రాము:—(సిగ్గుతో) మిత్రులారా! మీ మొగముల నెట్లు చూతును?

పింగ:—వయస్యా! ఎంతమాటంటివి? అది యంతయు మారీచుని మాయావిలాసము లెమ్ము.

రాము:—(అంతటనుఁ గలయఁ జూచి) దినయావసానారంభము విజృంభించుచున్నది. కావున స్కంధావారమునకుఁ బోవుదము రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ వెంకటపార్థసారథి కవి ప్రణీతం బయిన విచిత్రరాఘవమున ద్వితీయాంకము.

శ్రీ ర స్తు.

విచిత్రరాఘవము

తృతీయాంకము

దృశ్యము:—లంకాపట్టణములో నొక రాజవీధి.

(అంత నొక గంధర్వుఁడు ప్రవేశించును.)

గంధ:— తనవా రందఱుఁ బడిపోవుట చూచి లంకేశ్వరుఁ డేమి చేయుచుండెనో తెలిసికొని రమ్మని నిఖిల సుర చక్ర చూడామణి కిరణ పుంజ కింజల్కిత చరణారవిందుఁ డగు దేవేంద్రుఁ డాజ్ఞాపించెను. రాక్షస వేషమున నుండుటచే నన్యదుష్కరం బగు నీ రాజధానిం బ్రవేశింపఁ గల్గితిని. (ముందునకుఁ జూచి) ఆ రక్కసి యెవ్వతెయో యిటే వచ్చుచున్నట్లున్నది.

రాక్ష:— (ప్రవేశించి చూచి) ఈతఁడు కరాళుఁడే యగునా యేమి చెపుమా? (సమీపించి) అయ్యా! నీవు కరాళుఁడవేనా?

గంధ:—(తనలో) సంభాషణమున కీమెయే స్వయముగా దారిఁ జూపుచున్నది. (ప్రకా) ఔను. కరాళుఁడనే.

రాక్ష:—ఏమయ్యా, నీవు మనిషివా? పాషాణమవా? నీ భార్య గృధ్రముఖి నీవు రాముని చేతిలో మరణించితి వని ఱొమ్ము బాదుకొనుచు నేడ్చుచున్నది.

గంధ:—(తనలో) కరాళుని భార్యయా! సరే. (ప్రకా) ఆమె కీవార్త నెవరు చెప్పిరి.

రాక్ష:—మొన్న మారీచుఁ డిచటికి వచ్చి లంకేశ్వరులు కనఁబడకుండుటచే ప్రహస్తుఁడు మొదలగు మంత్రులతోఁ దాటకాసుబాహుకరాళుల చావును చెప్పి విచారముతో గోకర్ణక్షేత్రమునఁ దపస్సు చేసికొనుటకు వెళ్లెను.

గంధ:—లంకేశ్వరులు పట్టణమున లేరా?

రాక్ష:—లేరు. లేరు అందుచేతనే విద్యుజ్జిహ్వుని యింటికివెళ్ళి సంగతిఁ దెలిసికొని రమ్మని మండోదరి పంపుటచే వెళ్ళి వచ్చుచున్నాను. తీరా అక్కడికి వెళ్ళుసరికి విద్యుజ్జిహ్వుఁ డింట లేఁడు. అతనిభార్య యేమేమో సోది వెళ్ళఁబోసినది.

గంధ:—ఆమె యేమని చెప్పినది?

రాక్ష:—అది యొక రహస్య విషయము లెమ్ము. (ఇంచుక యాగి) ఐనను నిచ్చట జనకపక్షపాతు లెవరున్నారు? చెప్పెద వినుము. సీతను పెండ్లియాడుటకై

మన మహారాజు రామవేషమున మిథిలా నగరమునకు దయచేసెను. విద్యుజ్జిహ్వుఁడు కౌశిక వేషమును సారణుఁడు లక్ష్మణ వేషమును వేసిరఁట! మఱల నెక్కడనైనఁ జెప్పెదవు సుమా! కొంప లంటుకొనును.

గంధ:—(తనలో) మెడకాయ మీఁద తలకాయ కలవారలకుఁ దప్ప నితరులకుఁ జెప్పను. (ప్రకా) చక్కని పని చేసినారు. సీతకు రామునియందుఁ బ్రేమ యని యందఱకుఁ దెలిసినదే.

రాక్ష:—నీవు కరాళుఁడవే కాదూ? (సంతోషముతో) నేను ముందుగా వెళ్ళి నీ భార్య కీ సంతోషవార్త చెప్పి పారితోషికము గ్రహించెద.

గంధ:—ఓసి వెఱ్ఱిదానా! నీ వేదో కరాళుఁడవా యని యడుగుటచేఁ గాదను టేల యని యా నంటిని. అంతియేకాని నేను కరాళుఁడను కాను.

రాక్ష:—ఐనచోఁ గరాళునిగతి నే నన్నంత యైనట్లేనా?

గంధ:—అందులో సందేహ మేమి?

రాక్ష:—నా కోర్కి వ్యర్థమైనది. ఎందుకు నా కీ తడిపిలేని బేరము? మండోదరి యొద్ది కేగెద. (వెళ్ళును.)

గంధ:—నేనును ముందుగా నీ వృత్తాంతము జనకున కెఱింగించి పిదప దేవేంద్రుని యొద్దికిఁ బోయెదను.

(నిష్క్రమించును.)

ఇది విష్కంభము.

దృశ్యము: — విశ్వామిత్రుని యాశ్రమములో జనకసభాస్థానము:
(అంతట జనకశతానందులు ప్రవేశింతురు.)

జనకుఁడు:—ఆర్యా! శతానందా!

చ॥ తెలిసిన రావణుం డడిగితీరును; రెండవకంటివానికిం
దెలియకయుండఁ గార్యమును దీరిచి యెట్టులొ యొడ్డు కెక్కఁగా
వలయును; పైనఁ గౌశికుఁడు పట్టుగనుండెనుగాని యేలకో
బలితపుభీతి చేరి నను బట్టి పలార్చుచునున్న దక్కటా!

శతా:—రాజా! విచారింపకుము. కౌశికుని ప్రభావము నీ వెఱుంగనిదా?

జన:—సరే! ఏదో విధమున మనము సీతారాముల పాణిగ్రహణము నిర్వర్తించెద మనుకొనుఁడు ఇప్పుడు కాకపోయినఁ గొంత కాలమునకైన నీ సంగతి దశాననుని చెవిం బడకుండునా? అప్పుడైన నీ ప్రేమదంపతులను పొట్టను బెట్టుకొనకుండ నాతఁడు నిద్రపోవునా?

శతా:—మీ రన్నట్లే జరిగినయెడల నిఁకఁ గౌశికుని ప్రతిభ యేమి కనుపడును? అతఁడు రామభద్రునకు జృంభకాది మహాస్త్రముల నొసంగి దుర్ధర్ష వీర్య ప్రకర్షునిగ నొనర్చును. (అంతటఁ గౌశిక లక్ష్మణ వేషముల విద్యుజ్జిహ్వుఁడును సారణుఁడును వెంట వచ్చుచుండ రామ వేషమున రావణుఁడు ప్రవేశించును.)

రావ:—సారణా! ఇదే జనకసభాస్థానము సమీపించితిమి.

గీ॥ సొగసు లీనెడు బంగరు మొగిలిరేకు
వడువున విలాసముల జాలఁ బరిమళించు
జానకినిఁ జూచి యిచట నేఁడైనఁ దృప్తి
నొందవచ్చు నిర్వదికన్ను లున్నఫలము!

సార:—కేవలముఁ జూడఁ గలుగుటయే కాదు.

ఉ॥ రామునిబోలి యచ్చముగ రాణ జెలంగగ నీలనీరద
శ్యాముఁడవౌచునున్న నిను నారసినంతనె యల్ల నిక్కమా
రాముఁడెయంచుఁ బ్రేమ జలరాశి విలాస తరంగమాలలం
దా మదిరాక్షి యూముగుద హాయిగ నుయ్యేల లూపకుండునే?

(పరిక్రమింతురు.)

ప్రతీహారి:—(ప్రవేశించి) జయము జయము మహారాజుగారికి! పూజ్యులగు విశ్వామిత్రులు రామలక్ష్మణులతో దయచేయుచున్నారు.

జన:—(సంతోషముతో) మహాత్మా! మన మెదురేగి యానుషంగిక త్రైశంకవలోక నూతన పరమేష్టి యగు విశ్వామిత్రునిఁ గాకుత్స్థకులతిలకాయమాను లగు నా రామలక్ష్మణులతో నిచ్చటికిఁ దోడ్కొని వత్తము.

శతా:—చిత్తము. (ఆసనములనుండి యిరువురును దిగుదురు.)

జన:—దేవా! సీరధ్వజుఁడను నమస్కరించుచున్నాను.

విద్యు:—మహారాజా! నీకు శుభమగుఁ గాక!

సార:—(జనాంతికముగా) దేవా! తమవంటి మహానుభావు లల్లుఁ డగుచుండ శుభముల కేమి కొదువ?

రావ:—(సంతోషముతో) ఓ నట్లే!

(విద్యుజ్జిహ్వుఁడు జనకునకు నమస్కరింపు మని కనుసన్న జేయును.)

రావ:—(జనాంతికముగా) సారణా!

ఉ॥ నా దయఁగోరి యెప్పుడుఁ బ్రణామముసల్పఁగ నిల్చియుందు రిం
ద్రాదులు, నింతయేల? ప్రణయవ్యసనంబున నుండికూడ మం
దోదరికైన మ్రొక్కఁడనహో! ఇఁక నియ్యెడ నెవ్విధంబునన్
వాదుకు లొంగి వీని కభివాదనముం బొనరింతుఁ జెప్పుమా!

సార:—(తనలో) ఇంతటి దురహంకారికి జానకీలాభ మెట్లు కలుగును? (ప్రకా) దేవా! ప్రస్తుతవిరుద్ధము నాచరింపఁ దగదు.

రావ:—తండ్రీ! దాశరథిని నేను నమస్కరించుచున్నాను.

సార:—(అట్లే చెప్పును.)

జన:—కుఱ్ఱలారా! దీర్ఘాయుష్మంతులు కండు. తాపసోత్తమా! ఈ యాసన మలంకరింపుఁడు. రామ లక్ష్మణులారా! మీరు నుపవిష్టులు కండు (అందఱుఁ గూర్చుండుదురు).

శతా:—దేవా! ఒడ్డుపొడుగులందును, చేష్టితములందు నొకరి కొకరు సమానముగ నున్న వీరిలో రాముఁ డెవఁడు? లక్ష్మణుఁ డెవ్వడు?

విద్యు:—(తనలో) ఒక్కఁడునుఁ గాఁడు. (ప్రకా) నవాంబుద శ్యామల కోమలుం డగు నీతఁడు రామచంద్రుఁడు. ఆతని ప్రక్క బదిమాఱుప వన్నె బంగరుం బురుడించు మేను గల యాతఁడు లక్ష్మణుఁడు.

రావ:—(జనాంతికముగా) సారణా! సీతను బిలిపించుటకు జనకుఁ డింకను నాలస్యము చేయుచున్నాఁ డేమి?

సార:—(తనలో) మూర్ఖ జన మూర్ధన్యుఁ డగు నీతని కేమి యీ తొందఱ? జనకుని దర్శించి క్షణమైననుఁ గాలేదే? (జనాంతికముగా) ఒక్క నిమిష మోపికపట్టుము.

శతా:—పాపము! పుత్రులకొఱ కెంత కలవరించెను దశరథుఁడు.

జన:—

చ॥ అఱువదివేల వత్సరము లైనవి పుత్రుల చేతిమీఁదుగాఁ
బరమపదంబుఁ బోవఁగల భాగ్యములే దని కుందువాఁడు పం
క్తిరథుఁ డనారతం, బతనికిన్ జనియించిరి, నేఁటి కీ సుతుల్
సరసులు, సత్యవిక్రములు, సానలఁదీరిన జాతిరత్నముల్.

విద్యు:—ఔ నట్లె.

రావ:—(జనాంతికముగా) సారణా! జానకినిఁ బరిణయ మాడుదునని చంకలు కొట్టుచున్నాము గాని తాటక మొదలగువారు కౌశికుని యాగమనమును నిరోధింపఁజాలిరో లేదో యని భయం బొదవుచున్నది.

సార:—అట్లెన్నటికిని సంభవింపదు.

జన:—కుశికనందనా!

ఉ॥ వీనులవిందుగాఁగ మును వింటిని పంక్తిరథుండు వీరలన్
సూనులఁగాంచెనం; చిపుడు చూచితిఁ; గన్నులపండువయ్యె; మా
జానకి రామభద్రున కొసంగితినేని గృహంబు నిత్యక
ళ్యాణము పచ్చతోరణమునై విలసిల్లు నికం బవిత్రమై.

విద్యు:—మహారాజా! అదృష్టమనిన నీదే యదృష్టము. అనుమానించిన ప్రాణగొడ్డములన్నియుఁ దప్పి నిర్విఘ్నముగా వివాహము నెఱవేర్చుకొన నుంటివి.

జన:—అంతయు దేవరవారి ప్రభావమే. ఈ వివాహమున దాతయుఁ బ్రతిగృహీతయు మీరేకదా? కావున నిఁక నాలస్యమేల? "శుభస్యశీఘ్ర"మ్మని మీరు యజ్ఞదీక్ష నూనుడు. మేమును వివాహమంగళార్థముల నారంభింతుము.

విద్యు:—(తనలో) ఇది యొక పుట్టిమునుక వచ్చినదే! కానిమ్ము. విశ్వామిత్రుఁడు నిశాచరులకుఁ జిక్కినచో మావని నిమ్మకాయవాటమే. లేకున్నఁ దిరస్కరిణీవిద్యచే నంతర్ధానము నందెదము.

శతా:—రాజా! మన యూర్మిళనుగూడ లక్ష్మణున కిచ్చిన బాగుండును.

విద్యు:—(జనాంతికముగా) సారణా! నీవదో నక్కను ద్రొక్కియేవచ్చితివి. నా రాకయే నిష్ఫలము.

సార:—(జనాంతికముగా) కాదు కాదు. కౌశికుని సుతులతోను, శిష్యులతోను, ఆవుల తోడనుఁ గూడుకొని జరుపు నీయజ్ఞమం దాతని గృహిణియే నీకు భార్య గాఁ గలదు.

విద్యు:—(జనాంతికముగా) సారణా! ఒక ముసలిముండకు మగనిజేసి న న్నాటలు పట్టించుచున్నావా?

జన:— గౌతమనందనా! అంతియేగాదు, నా తమ్ముఁడగు కుశధ్వజుని కుమార్తెలను మా మాండవీశ్రుతకీర్తులనుగూడ భరతశత్రుఘ్నుల కిచ్చెదము.

రావ:—(జనాంతికముగా) సారణా! భరతశత్రుఘ్నుల వేషములలో నింక నిర్వురను వెంటఁబెట్టుకొని రావలసినది. చాల పొరపాటు చేసితిమి.

సార:—(జనాంతికముగా) నేను ముందే చెప్పితిని విశ్వామిత్రుఁడు దశరథుని సపుత్రదారముగాఁ దీసికొనివచ్చుటకు వెళ్ళెనని. విద్యుజ్జిహ్వుఁడు మాత్ర మీపని చేసినవాఁడు కాఁడు.

రావ:—(జనాంతికముగా) రానిమ్ము. ఈ మూర్ఖుఁడు జానకి నెంతసేపటికినిఁ బిలిపింప కున్నాఁడు.

విద్యు:—జనకా! దశరథుఁడు సపరివారముగ మధ్యేమార్గమున విడిసియున్నవాఁడు.

జన:—ఎవఁడురా అక్కడ?

ప్రతీహారి—(ప్రవేశించి) దేవా! ఏమి యాజ్ఞ?

జన:—పూజ్యులగు కౌశికులకు నమస్కరింపఁ గన్యాజనముం దోడ్కొనిరమ్ము.

ప్రతీ:—చిత్తము. (నిష్క్రమించును.)

రావ:—దైవమే నాయందుఁ బక్షపాతముఁ జూపెను.

గీ॥ తీరుగా సాగి నను సిగ్గుతెరల నడుమ
నడఁగుచు మఱింత వింత యొయ్యార మంది
తళుకు లీ చు ముందు బర్వులనువెట్టు
వాలుఁజూపుల ననుఁ దృప్తిపఱచు సీత!

(తెరలో)

మ॥ ఒనరంగాఁ గుశికాత్మజుండటుల విద్యుజ్జిహ్వుఁ డేతేర; ల
క్ష్మణవేషంబున సారణుం డనుసరింపంగా; న దేరీతి రా
మునిపాత్రన్ ధరియించి రావణుఁడు మిమ్ముం బుట్టలోఁబెట్టి సీ
తను గొంపోవఁగవచ్చు; హెచ్చరికతోఁ దథ్యంబుఁ బాలింపుఁడీ!

రావ:—(జనాంతికముగా) ఎవరది, మన వృత్తాంతమును జనకునకు నివేదించుచున్నారు? మన సంగతి రెండవ కంటివానికిఁ దెలియదుగదా!

సార:—(జనాంతికముగా) ఏమో! ఇది చాల నాశ్చర్యముగా నున్నది.

విద్యు:—(తనలో) ఈ వృత్తాంతము నా భార్యకుఁ దక్క నెవ్వరికినిఁ దెలియఁ గూడదే? ఈ సంగతి వెళ్ళఁబెట్టితినా నీ నోటిలో నువుగింజయైన దాగదని వీరిద్దరు నన్నుఁ దలవాచునట్లు చీవాట్లు పెట్టెదరు

సార:—ఆర్యా! శతానంద! ఇట్లు పలుకుచున్న యీ దుర్గదు నవశ్యము విచారింప వలెను.

శతా:—(తనలో) ఏమిది! రావణసారణవిద్యుజ్జిహ్వులు రామలక్ష్మణకౌశికవేషముల నిచ్చటికి వచ్చిరా? (ప్రకా) లక్ష్మణా! విచారించెదము.

జన:—(విచారములోఁ దనలో)

ఉ॥ జానకివాంఛితంబు గొనసాగఁగ జేయఁగవచ్చుఁ గౌశికుం
డే నిఁకఁ గొండనెక్కినటులే యనుకొంటిని గాని యింతలో
మానవిపుట్టి మున్క నను మావునటంచుఁ దలంపనైతి సీ!
తా నొకటిం దలంచుకొన దైవము వేఱొకటిం దలంచెడిన్॥

(ప్రకా) ఎవఁడురా అక్కడ?

ప్రతీహారి:—(ప్రవేశించి) దేవా! ఏమిసెలవు?

జన:—ఇట్లు పలికినయాతఁడెవ్వఁడో విచారింపుము.

ప్రతీ:—దేవా! ఇంకను విచారించు టెందులకు? ఒక దివ్యపురుషుం డెవ్వఁడో యాకసమున నిల్చి యీ వాక్యములు పలికి యదృశ్యుఁడైనాఁడు. అపరరామ లక్ష్మణులతో నింకొక కౌశికుఁ డల్లంత వచ్చుచున్నాఁడు.

జన:—శతానందా! ఎట్టిది? చాలవింతగా నున్నదే?

శతా:—(జనాంతికముగా) ఇంద్రదూతయే యిట్లు చెప్పియుండవచ్చును. కావున వచ్చినవారిని రాఁబోవువారినిఁ బరిశీలించి క్రమముగా స్వరూపనిర్ధారణము చేయుదము. (ప్రకా) కుశికనందనా? ఎట్టిది?

విద్యు:—(తనలో) దొంగలు గస్తీవానికింబలె మేము కౌశికునకుఁ జిక్కిపోయితిమి. (ప్రకా) మావేషముల ధరించిన రాక్షసులను రానిండు. మేము వేఱొకచోటి కేగుదుము.

రావ.—(జనాంతికముగా) సారణా! ఆ క్షత్రియార్భకుఁడు తాటకాదుల నందఱఁ జంపివైచెనా?

సార:—(జనాంతికముగా) అట్లెన్నటికిని జరిగియుండదు. ఇది నిజమేయైనచో రామునిముందు మన శక్తి యెంతమాత్రముఁ బనిచేయదు.

విద్యు:—(తనలో) తేలుకుట్టిన దొంగలవలె మిన్నకుండక వీరిరువు రేమేమో గుజగుజలు వోవుచున్నారు.

రావ:—(జనాంతికముగా) విద్యుజ్జిహ్వా! మన మిప్పుడు చేయవలసినపని యేమి?

విద్యు:—(జనాంతికముగా) తిరస్కరిణీ విద్యచేఁ దిరోహితులమైయుండి సమయాను సారముగఁ బ్రవర్తింతము.

రావ:—(జనాంతికముగా) లెస్సఁ బల్కితివి.

జన:—(జనాంతికముగా) శతానందా! ఆకులపాటుం జెందిన వారివలె వీరు పరస్పరము మంత్రించుకొనుచున్నారు. వీరే రాక్షసులేమో?

శతా:—(జనాంతికముగా) నేను నట్లే తలఁచుచున్నాను.

విద్యు:—జనకరాజా! దీనికింత విచారణం బేల? మేము వేఱొకచోటి కేగెదమని చెప్పియేయుంటిమి గాదా?

జన:—కానిండు (లేచి మార్గము చూపును.)

(రావణుఁడు మొదలగువారు నిష్క్రమించి తిరస్కరిణీ తిరోహితులై నాతి దూరమునఁ బ్రవేశింతురు. రామలక్ష్మణవిశ్వామిత్రులునుఁ బ్రవేశింతురు)

కౌశి:—రామలక్ష్మణులారా! జనకమహారాజునుసమీపించుచున్నాము. ఈతఁడు సామాన్యుఁడు కాఁడు. ఉపనిషద్గురుండగు యాజ్ఞవల్క్యునిప్రియశిష్యుఁడు. పెద్దలగు యోగీంద్రులచేఁగూడఁ బూజింపఁ బడువాఁడు.

లక్ష్మ:—మహాత్మా! ఈతని యొద్ద నాఁగటి చాలున యజ్ఞభూమినుండి పుట్టిన సీత యను కన్యక యున్నదఁట కాదా?

కౌశి:—ఔను.

రాము:—(తనలో)

చ॥ జనకజ నాఁడుచిచ్చుటికి చచ్చుటయంతయు వట్టిమాయగాఁ
గనులకుఁ గట్టినట్టులుగ గన్పడుచున్న నకారణంబుగా
మనమున నప్పుడప్పు డనుమానపుజాడ్యము గల్గుచున్న దీ
దినమున జానకిం గఱవుతీఱఁగఁ జూచుకొనంగనౌ నిటన్॥

(ప్రకా) ఇంకొక చిత్రము వినుచుందుము. సకలసురాసురులకును దురారోపమగు శివధను స్సీతని యింట నెల్లప్పుడుఁ బూజింపఁబడు చుండునఁట!

కౌశి:—(నవ్వుచు) అదియునుఁ గలదు.

శతా:—కౌశిక మునీంద్రుఁడు రామలక్ష్మణులతో దయచేయుచున్నాఁడు.

జన:—నేఁడు సుదినము.

(యథోచితముగా వారల నెదుర్కొని యాసనాసీనులం జేయును.)

శతా:—(తనలో) వీరు రాక్షసులే యగుదురుగాక! ఇట్లు పలికెద. (ప్రకా) అదృష్ట

వశమున రామలక్ష్మణులతోఁగూడఁ గౌశికులు సురక్షితముగ వచ్చి యున్నారు

జన:—(తనలో) నేనును శతానందు ననుసరించి పలుకు చుండెద. (ప్రకా) మహాత్మా! క్షేమమునఁ బోయి లాభమున వచ్చితిరి.

ఉ॥ మావలెఁ బుత్రశోకమున మగ్గుదుగా కని మౌని తిట్టఁగా
నీవిధినైననుం గొడుకు లేర్పడవచ్చు నటంచుఁ జాల మో
దావృతుఁడయ్యెఁ బంక్తిరథుఁ డాతనికిన్ జనియించినార లీ
పావనమూర్తులైన పసిపాపలు నల్వురు వీరు నేఁటికిన్॥

రావ:—ఇతఁడు వీరిని నిజమగు వారనియే యెంచి యిట్లనుచున్నాఁడా యేమి?

సార:—మనలఁ గూడ నిట్లేయడిగి యుండెను గదా?

కౌశి:—అది యట్లుండుఁగాక! ఇది వినుఁడు.

రావ:—దురాత్ముఁడగు కౌశికుఁ డేమి చెప్పునో?

విద్యు:—బహుశః, దారిలో నడ్డగించిన మనవారినిఁ గూర్చియే!

సార:—వారిని నిగ్రహించియుండని దీతఁ డిమ్మెడ కెట్లు రాఁగలుగును?

కౌశి:—నే నొక యజ్ఞము చేయఁబోవుచుంటి నని దశరథుని సపుత్రదారముగఁ బ్రయాణము చేసి తీసికొని వచ్చుచుండ మార్గమధ్యమునఁ దాటక తన కనుల నెత్తురుటేరుల బారించుచు మమ్ము నడ్డగించెను.

రావ:—(సంతోషముతో) మంచిపని జరిగినది.

విద్యు:—పైసంగతిఁగూడ విని మాట్లాడుఁడు.

రావ:—హర్షపారవశ్యముచే వీరి రాకనే మఱచిపోయితిని.

కౌశి:—

ఉ॥ ఆఁడుదియాటచే దశరథాత్మజుఁ డాయమ నుక్కడంపఁ జే
యాడక మిన్నకుండె నటులైనను చేతిశరంబె చాపమున్
వీడి తనంత నామెపయి బట్టుఱికెం గదుఁ జిత్రమయ్యె న
ప్పోఁడిమి నామె మస్తకము భూమిపయింబడెఁ దక్షణంబునన్.

రావ:—ఈ మునిముచ్చు క్షత్రియార్భకునియందు లేని మాహాత్మ్యము నారోపించి గోరంతలు కొండంతలు చేయుచున్నాఁడు.

సార:—హా తాటకా! అబలయని యెఱింగియు నీతఁడు నిన్ను విడువఁడాయెఁగా!

జన—(జనాంతికముగా) శతానందా! తాము ధరించిన వేషములను దృఢతరముగాఁ జేసికొనుట కీ రక్కసుఁ డిట్టి యభూతకల్పన నల్లుచున్నాఁడు.

శతా:—(జనాంతికముగా) తక్కినదిగూడ విందము.

జన:—ఆర్యా! ముక్కుపచ్చలారని యీ పసికూన యెక్కడ! వేయి యేనుఁగుల బలముగల యా తాటక యెక్కడ?

రావ:—జనకుఁడు బాగుగ నధిక్షేపించెను.

శతా:—దైవయోగముచే నెవ్వరికిని దుష్కరమనునది యుండదు. మహాపర్వత మొక చిన్న యుద్ధమున నిముడుటలేదా?

విద్యు:—ఈ శతానందహతకుఁడు దానిని సమర్థించుచున్నాఁడు.

రావ:—ఆమె యనుచరు లేమైరో!

జన:—తరువాతఁ దరువాత.

కౌశి:—పిమ్మట సుబాహుప్రభృతులు రామునిధాటి కాగలేకపోయిరి.

రావ:—వారు తాటకావధను సహించి మిన్నకుండిరా?

సార:—వారలకు నా మొగతిరయే పట్టియుండును.

కౌశి:—రాముఁ డాగ్నేయాస్త్రముం బ్రయోగించియుఁ బ్రయోగించకమునుపే సుబాహుఁడు కృతాంతనితాంతమున కతిథియయ్యెను.

శతా:—(జనాంతికముగా) ఇట్లుండగా వీరి నేమిజేయుదము?

జన:—(జనాంతికముగా) వీర్యశుల్కము నొకదాని నేర్పాటు చేయుదము.

శతా:—(జనాంతికముగా) ఏమని?

జన:—(జనాంతికముగా) శివధనుస్సు నెక్కిడుటయే!

శతా:—(నవ్వి జనాంతికముగా) కైలాసపర్వతమును గడ్డిపోచగ నాడించిన రావణునకీ శివచాపము నెక్కువెట్టుట యొక లెక్కయా?

జన:—(జనాంతికముగా) సిద్ధ చారణ గంధర్వ దేవ దానవులయం దెవ్వరికి నీ చాపము నెక్కువెట్ట సాధ్యము గాదు. ఇది నిజము.

శతా:—(జనాంతికముగా) అట్లైన సరే.

విద్యు:—ఏమిది! కౌశికుఁ డందఱి చావును చల్లఁగఁ జెప్పివైచినాఁడే!

సార:—మారీచుని మాయాకౌశల్య మే మంటలో ప్రగ్గిపోయినదో!

కౌశి:—వాయువ్యాస్త్రముచే మారీచుఁడు పైకిఁ జెండువలె నెగిరి పోయెను. చచ్చెనో బ్రతికెనో మాత్రము తెలియ లేదు.

రావ:—(పండ్లు పటపటఁ గొఱుకుచు) ఇంక నీ క్షత్రియబ్రహ్మచారిని క్షమింప రాదు.

గీ॥ అస్మదీయ మహోగ్ర కోపానలమున
భస్మ మొనరించివైతు దుర్భరుని వీని

నరయ మొల్ల త్రాడు గట్టిన పురుషులెవ్వ
రడ్డువత్తురో! చూచెద నదియుఁగూడ! (పోఁబోవును.)

విద్యు:—(నివారించి) ఒక్క గోటిపోటు చేతనే మరణించు నీ మానవార్భకునిపై నింత సంరంభమేల?

శతా:—రఘుకుమారుఁడు మహాప్రతిభావంతుఁడు.

లక్ష్మ:—కనుకనే పూజ్యులగు కౌశికులు జృంభకాద్యస్త్రముల ననుగ్రహించిరి.

విద్యు:—మహారాజా! లక్ష్మణుని పలుకులు వింటివా?

రావ:—అగుఁగాక! మనకేమి భయము?

సార:—మొదటినుండియుఁ గౌశికుఁడే మనదారియందు సర్పమువలె నున్నాఁడు.

కౌశి:—(తనలో) ఈ జనకశతానందు లేలొకో మమ్ము వేరువిధముగఁ దలంచి యూరకనీళ్లు నములుచు మాటాడుచున్నారు. మాయావులగు రక్కసులు వీరిని మునుముగనే వంచించి యుండరుగదా! (ప్రకా) జనకా! శతానందా! మీరేదో చెప్పఁదలంచినట్లున్నది.

(జనకుఁడు శతానందునకు సంజ్ఞచేయును.)

శతా:—

ఉ॥ మే మొక బాసఁ జేసితిమి, మీరునుఁ జూడుడు; రాజపుత్రులం
దే మహనీయుఁ డెక్కిడునొ యీ గిరిజాధిపువిల్లు వాని మా
భూమిజ పెండ్లియాడును ప్రమోదము వెల్లిగొనంగ దాన మా
కామితమున్ ఫలించు సముఖంబున నేటికి రాయబారముల్?

కౌశి:—(నవ్వి) మాయందును మీకు విశ్వాసము లేదా? ఎక్కువెట్టుటకు శంకరశరాసనముం దెప్పింపుఁడు.

జన:—శతానందా! మీరేగి యా శివధనుస్సును పట్టించుకొని రండు.

శతా:—చిత్తము. (నిష్క్రమించును.)

రావ:—కైలాసపర్వతము నుక్కుఁ బ్రేల నెత్తిన నాకే సాధ్యపడని యీ శివధనుస్సు నీ బాలుఁ డెక్కువెట్టునా?

విద్యు:—ఈ మూర్ఖజనకుఁడు ముందువెనుక లాలోచింపకయే యిట్టి ఘోరప్రతిజ్ఞను జేసినాఁడే! ఈ ధనుస్సు నెక్కువెట్టు సామర్థ్యముగలవార లీ ముల్లోకములందును లేరు.

రావ:—హా వరాక్షీ! జానకీ!

ఉ॥ మిత్రుని కూఁతు రంచు బలిమిం గొనిపోవను; చూడ లేవు నా
పాత్రత మానవార్భకునిపైనిఁ బ్రియంపడి; వేసినాఁడఁ ద

త్స్వాత్రయము నైన శుల్క మిది దారుణమయ్యెను నాకె; ఇంక నీ
క్షత్రియబాలు రేమిటికి? కామిని! కన్నెగ నిల్చిపోదువా?

శతా:—(ప్రవేశించి) మహారాజా! శివధనుస్సు నిదే తెచ్చియున్నారు.

కౌశి:— రామభద్రా! దీనినిఁ జూడుము.

రాము:—గురుజనుల యాజ్ఞ. (లేచి శరాసనము సమీపించును.)

రావ:—ఏమిది? ఇతఁడేమాత్రము జంకు లేక యీ చాపము సమీపించుచున్నాఁడు!

విద్యు:—జానకి నీతఁడే పరిణయ మాడునేమో!

(అంతట సీత, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి ప్రవేశింతురు.)

సీత:—వత్సలారా! పూజ్యు లగు కౌశికులు వచ్చియున్నవా రఁట!

రాము:—(తనలో)

గీ॥ శారికాలాప మేమొ? నా శ్రవణ పుటము
నం దమృతధారలను నించు నదియుఁగాక
నిద్ర మరునకు నను బట్టియిచ్చుచుండె
బళిర! నా జానకీముగ్ధవచన మేమొ?

(సీతారాము లొండొరులఁ జూచుకొందురు.)

రాము:—(తనలో) ఆహా! ఈమెయే జానకి!

గీ॥ నేను జూడని యప్పుడు తాను జూచు
నేను జూచిన యప్పుడు మోని వైచు
నీ రమణి యేమియేమిటొ నోరులేని
ప్రేమవార్తల నాకుఁ బంపించుచుండె.

ఈమెను గలవుతీఁ గౌఁగిలించుకొందునా? (విచారించి) శంకరశరాసనము నెక్కుపెట్టినఁగాని యియ్యది సాధ్యపడదు. (ధనుస్సును సమీపించును.)

సీత:—(తనలో)

మ॥ కనుపించుం బ్రియుఁ డల్లదే! కల యొకో! కా దిప్పు నిక్కంబుగాఁ
గనుచుంటిన్; సమయం బిదే; త్వరగ నా కౌఁగింట బంధించి వై
తున? నమ్మంజన దీతనిన్; వెనుకటుల్ తూలించితాఁ బారిపో
వునో యేమో గద! పాడుసిగ్గిపుడె యేపుం జూపుచుండెం గటా!

ఊర్మిళ:—మాండవీ! జానకి యే మనుచున్నదో వింటివా?

మాండ:—అక్కా! కౌశికమహర్షివెంట నిరువురు రాజపుత్రులు గూడ వచ్చిరట కాదా?

సీత:—ఔను.

మాండ:—వారిలో నొకఁడు మన కన్యాజనమం దొక్కతెను బెండ్లాడునని వింటిని.

సీత:—(అసూయతో) మాండవీ! నాతో మాటాడకుము. (చెక్కిలిపైఁ గొట్టును.)

ఊర్మి:—(నవ్వి) సీతా! మాండవి చెప్పిన దానిని నీపైననే పెట్టుకొందు వేల? గుమ్మడికాయల దొంగ యన్న బుజములు తడుముకొన్నాఁడట!

సీత:—ఊర్మిళా! దూరముగ నుండుము. నీ వెప్పుడు నేవో యసంబద్ధవాక్యముల నాడుచుందువు.

శ్రుత:—జానకీ! మా కందఱకు రాని కోపము నీకే వచ్చు టెందులకు? ఏదీచెప్పుము స్వప్నమందు మన్మథమన్మథుం డగు నొకానొక రాకొమరుం జూచి వేసంగిని సెలయేరు వలె దినదినముఁ గృశించుచున్న ముగుద యెవ్వతెయో? మనోహరుఁ డగు వసంతునితో సయ్యాటలాడుచున్న పూఁదోటయందుఁ, గుచభారనమిత యగు కోమలియుం బోలెఁ బండిన ఫలములచే వంగుచున్న లేతమామిడిచెట్ల చాటున, బ్రియుని సందిటఁ రహించెడు విలాసినియుం బలె నరఁటిచెట్లచేఁ జుట్టఁబడి సొగసు లీనెడు మాధవీమంటపమున, నొంటిపాటునఁ బూలసెజ్జపైఁ దీరని విరహవేదనచే నసురుసురగుచుఁ జెలిమికత్తియల యూరడింపులచే నిన్ని దినములు వెళ్ళించిన కామిని యెవ్వతెయో? నీ సంగతి యంతయు నేఁటి యుదయమున నొక చెలికత్తె చెప్పినది లెమ్ము.

ఊర్మి:—చెల్లీ! చెప్పుము చెప్పుము, చెలికత్తె యేమని చెప్పినది?

సీత:—చెలికత్తె లేదు గిలికత్తెలేదు. ఇవి శ్రుతకీర్తిమాటలే.

శ్రుత:—మన సీతకు రాముఁ డను వన్నెకాఁ డొకఁడు కలలోఁ గనుపించి యేమేమో యచ్చికబుచ్చికలు చేసినాఁడఁట! అప్పటినుండియు జానకి పై విధమున నాతనికై కలవరించుచున్నదఁట!

ఊర్మి:—ఇదియా కథ!

మాండవి:—జానకీ! ఎంతటి నంగనాచివే?

సీత:—(సిగ్గుతోఁ దనలో) వీరికి నా గుట్టంతయుఁ దెలిసినది. ఇప్పు డేది దారి? (ప్రకా) సోదరీమణులారా! ఊరక నన్ను నిందింతు రేల? పరిహాసములకుఁ బుట్టినిల్లగు మా శీలవతి శ్రుతకీర్తి చిన్నపిల్ల గదా యని "సీత ఇట్లున్నది యట్లున్నది" యని యేమోమో నేరములు చెప్పి యుండవచ్చును.

మాండ:—(ముందునకుఁ జూచి) యేమిది! మనము నిత్యముఁ బూజింపుచున్న శివధను స్సిచ్చటి కెందులకు వచ్చినదో? దాని సమీపముననే నిజశరీర

చ్ఛాయచేఁ బగఁటివేళయందే యప్పటికప్పుడు వికసించిన నల్లగల్వల నెల్ల యెడల వెదజల్లుచు నిల్చియున్న యీ రాకుమారుఁ డెవ్వఁడో!

కౌశి:—రామభద్రా! ఇంకను ఆలసించెద వేల? ఈ హరచాపము నెక్కువెట్టి జనకుని ముద్దు చెల్లింపుము.

సీత:—(ఆయాసముతోఁ దనలో) శంకరశరాసన మెక్కువెట్టిన గాని యీతఁడు లభింపఁడుగా! (ఇంచుకయాగి) రామా! కొంచెము తాళుము. రెండుమూఁడు నిముసము లోపికపట్టుము! సాహసింపకుము. తప్పిపోవుదు వేమో కదా! నీ చెలిమిఁ బోగొట్టుకొందును! కొంచెము తాళుము. నిన్నుఁ బోఁగొట్టుకొన నని ప్రేమగాదు—మ ఱేదియో నాకుఁ జెప్పుచున్నది. అనిష్టత యిట్లు బోధింప దని నీకునుఁ దెలియును. నా యభిప్రాయము నీకుఁ దెలియవచ్చినదో లేదో! అబ్బా! ప్రేమవిషయమున నబలల కూహ యుండును గాని నాలుక యుండదు. శివధనుస్సు నెత్తు మార్గముఁ జెప్పనిమ్ము. మార్గ మేమున్న దని చెప్పుదును? అయ్యో! నీవు నా కింక దక్కవా? మనోహరా! ఇటు చూడుము. నీ వాలుజూపులు నన్నుఁ జైకొని రెండుగా భాగించి వైచినవి. ఒక యర్థభాగము నీది. రెండవది - నాది - నీయదియే! నా యర్థభాగము - నాది యైనచో నీయదియే! కనుక నంతయు నీదే! ఈ మాయదారికాలము యజమానులకును వారి స్వత్వములకును మధ్య నడ్డుతగులు చున్నది. కావున నీది యైనప్పటికిని-నీదికాదు-నీది యని రుజువుపఱచుకొనుము. దూషింపఁదగినది యదృష్టము. నేను కాదు. (ఇంచుక యాగి) అక్కటా! జనకు లెట్టి కట్టడి చేసిరి.

గీ॥ కమఠపృష్ఠకఠోర మీ కార్ముకంబు
మధురమూర్తి యితండు నా హృదయచోరుఁ
డెక్కువెట్టుట యెట్టులో యెఱుఁగ నన్ను
నితని కియరు గాఁబోలు నేది దారి?

శతా:—మహారాజా! రఘుకుమారుని గాంభీర్యముఁ జూడుము.

కౌశి:—శివధనస్సును దనదివలెనే యనాయాసముగ గ్రహించుచున్నాఁడు మా రాముఁడు.

లక్ష్మ:—గ్రహించుటయే గాదు. నారిని లాగుచునేయున్నాఁడు.

జన:—ఎక్కువెట్టుచునే యున్నాఁడు.

శతా:—(జనాంతికముగా) సీరధ్వజా! ఇంకను సందేహ మేల? ఈతఁడే కౌశికుఁడు. వీరలే రామలక్ష్మణులు. ముందు వచ్చినవారే రక్కసులు.

జన:—(జనాంతికముగా) ఔ నట్లే తోఁచుచున్నది.

శతా:—(జనాంతికముగా) అదృష్టవశమున మాయార్ణవమునుండి యైనను మనోరథార్ణవమునుండి వలె నుత్తీర్ణుల మైతిమి.

జన:—(ఆశ్చర్యముతో) శంకరశరాసనము భగ్నమౌచున్నట్లున్నది.

విద్యు:—క్షత్రియకుమారుఁడు పరాక్రమశాలి!

సార:—విద్యుజ్జిహ్వా! ఏమి వర్ణించెదవు? ఈ కోదండముతోఁబాటు మన మహారాజు కోర్కులును భగ్నము లైనవి.

రావ:—ఇందు విద్యుజ్జిహ్వుని తప్పేమి?

ఉ॥ రాముఁడు రాని వచ్చె సుకరంబుగ విల్లును ద్రుంచె జానకీ
కామము నిండెఁ గౌశికుని కష్టములెల్ల ఫలించె నేను నా
రామునిపాత్ర వేసితిఁ, బరాభవ మయ్యె, ననర్ఘమా యశ
శ్శ్రీ మురువారె నీ! వ్రతము చెడ్డను సౌఖ్యము కల్గదాయెఁగా!

గీ॥ తేలు కుట్టిన దొంగ నై తిని భవత్ప్ర
భాషితమ్ముల విని బుద్ధివచ్చె నింకఁ
జాలుఁజాలును పీరలఁ జంపి సీతఁ
గైకొనెద నెట్టు లడ్డునో కౌశికుండు?

(పోఁబోవును.)

విద్యు:—(అడ్డుపడి) దేవా! సాహసం బెప్పుడు నభ్యుదయకారణము కానేరదు. నామాట వినుఁడు. మన మిప్పటి కేగి జానకి లభించు నుపాయము మాల్యవత్ప్రముఖులతో నాలోచించి యట్లు నడుచుకొనుట మంచిది.

రావ:—సరే! మనము తిరిగి విమాన మెక్కి లంకకుఁ జేరుదము రండు. సీతాదర్శన కుతూహల మిఁకఁ జాలును. ఈమెను బలాత్కారముగ నెత్తికొనిపోవుటకు నిర్ధరించితిమి గదా! (రాక్షసులతో నిష్క్రమించును.)

జన:—రామభద్రా! రమ్ము రమ్ము.

గీ॥ వేడ్క మా సీత కోర్కి తీవియలఁ బ్రణయ
వృష్టిఁ జూపించి మఱి ఫలింపించి తీవు!
ఒప్పఁజెప్పుచు నుంటి నీ కిప్పుడిపుడె
వలచి వలపించుకొనుము నీ భార్య ఇంక.

రాము:—(తనలో) గురుజను లేమనుకొందురో యను ననుమానమున నెంత నిలువరించినను నిలువక నా చూపుఁదుమ్మెదలు జానకి మోముఁదమ్మిపై వ్రాలి మఱులుకున్నవి.

గీ॥ కలవు బంధమ్ము లెన్నొ లక్షలకొలంది
ప్రేమబంధమ్మునకు నీడు లేదు నిజము
దారువును వ్రచ్చు తుమ్మెద తమ్మికన్నె
కౌఁగిలింతల దాటి పోఁగలుగు నొక్కొ!

ప్రతీ:—మహారాజా! కన్యాజనము వచ్చియున్నది.

సీత:—(తనలో) సాధ్వసముచే ముందడుగు వేయలేకున్నాను.

చ॥ బలితపుఁ బ్రేమచేతఁ గచభారము జారెను; దాని దిద్దఁబో
జిలుగు పయంట జారె; నొక చే సవరించెడులోన జెప్పకో
వలువని జారుపాటు లిఁక బాటిలునేమొ! విధాత రెండు చే
తులె యిడె, నేమి సేయుటకుఁ దోపదు; చెల్లెలిచాటు కేగెదన్.

(మాండవి చాటునకు వెళ్ళును.)

జన:—అమ్మలారా! రండు కౌశికమహర్షికి నమస్కరింపుఁడు.

(అందఱు విశ్వామిత్రునకు నమస్కరింతురు.)

కౌశి:—వత్సలారా! మీ మనోరథములు ఫలించునుఁగాక! సీరధ్వజా! ఇప్పటికి నా మాట దక్కినది. నీవును నీ మాటను జెల్లించుకొనుము.

జన:—(సీత చేతిని రాముని చేతిలో నుంచి)

గీ॥ ఈ ముగుద సీత నా తొలినోముపంట;
నీదు సహధర్మచారిణి; నీడ పోల్కి
నిన్ను వెన్నంటి యుండు; నీ వన్నెలాడి
కరముఁ గరమున గ్రహియింపఁగదవె రామ!

(పుష్పవృష్టి కురియును)

కౌశి:— గీ॥ చెలిమిబేరాల వచ్చిన వలపుసొమ్ముఁ
జెరిసగము పంచుకొనుచు విస్తృతవిలాస
జలధిఁ బయనించు నీ నూత్నదంపతులకు
నాయురారోగ్యభాగ్యంబు లలరుఁ గాక!

శతా:—తథాస్తు

కౌశి:—దశరథుఁడు సపరివారముగ మధ్యమార్గమున విడిసియున్నాఁడు, వారి నెదుర్కొని యథావిధిగ నీ వివాహమహోత్సవము జరుపుదము. రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ వెంకట పార్థసారథి కవి ప్రణీతంబైన విచిత్రరాఘవమ్మున తృతీయాంకము.

విచిత్రరాఘవము

చతుర్థాంకము.

దృశ్యము:—వనము:

[అంతట విరాధుఁడు ప్రవేశించును.]

విరా:—రక్కసుల నెల్లర నుక్కడంచి జనస్థానమందలి ఋషిలోకమును రక్షింప రాముఁడు కంకణముఁ గట్టుకొనెనఁట! అది విని ఖరుఁడు ప్రియసఖుఁడనగు నన్నాతనిఁ జంపఁ బురికొల్పినాఁడు. కాని యతనిఁ జూచుటతోడనే గుండె లవిసిపోవుచున్నవి. ఖరున కేమి? అతిథిచేఁ బామును జంపించినట్లు నన్ను వీనిపై కంపినాఁడు. కుడిచికూర్చుండక నా కీయుద్ధపు గోల యేల? సౌందర్యసరసి యగు జానకిం జూచినదాదిగ మన్మనోహరిణము మన్మథకిరాతవాగురం దగిలినది. రామవేషమున నామె నొంటిపాటునఁ గొనిపోయి యెందేని విహరించెదఁగాక! (పరిక్రమించుచుండును)

(అంతట శూర్పణఖ ప్రవేశించును.)

శూర్ప:—పంచవటీకుటీరమం దగు రామభద్రుని భార్య యగు జానకిని నిన్నే యపహరింపవలసినదిగా మహారాజు లంకేశ్వరుఁ డాజ్ఞాపించెను. నిన్నటిఁ జూచితినిగదా, ఆమె యెల్లప్పుడు భర్తృపార్శ్వమందే సంచరించును! ఆమె నెట్లపహరింపఁగలను? ఐనను, నీలమేఘశ్యామలాకారుఁడగు నా రాముని గనినంతనే యేలొకో నా హృదయము కామవికారమునకు లోనైనది. కావున జానకీరూపమున నొంటిపాటున రాముని కన్నుగప్పి చాలదవ్వు గొనిపోయి యథేచ్ఛగా విహరించెద.

విరా:—(శూర్పణఖను జూచి) అక్కడి కాలుఁ దీసి యిక్కడఁ బెట్టినఁ గరిగిపోవు గాని యిటు రమ్ము.

శూర్ప:—ఓహో విరాధుఁడా! (సమీపించును.)

విరా:—మహారాజునకు సేమమా?

శూర్ప:—నిర్విచారుఁడై యున్నచో సేమమే.

విరా:—(తనలో) అతనికి విచార మెందుకో! (ప్రకా) రాముని ప్రతిజ్ఞ మహారాజు చెవింబడెనా యేమి?

శూర్ప:—వినుటయే కాదు. మంత్రులతో నాలోచించి దాని భారమంతయు ఖరునిపై నుంచెను.

విరా:—(తనలో) కనుకనే ఖరుఁడు సబహుమానముగ నాహ్వానించి నన్నిటకంపె. (ప్రకా) ఈ రాజకుమారులుఁ రాక్షసుల శిక్షించుటకే యీ జనస్థానమునకు వచ్చిన ట్లున్నది.

శూర్ప:—వారి ననవలసిన పని యేమి? మన బంగారము మంచిది కానప్పుడు కమసాలివాఁ డేమి సేయును? మహారాజే లేనిపోని జలవంతపు తద్దినముకు తెచ్చిపెట్టుకొనెను.

విరా:—ఎట్లెట్లు? సవిస్తరముగఁ జెప్పుము.

శూర్ప:—జనకు నెఱుంగుదువు గదా! అతని కుమార్తె యగు సీత రామానురక్తయగుటచే మహారాజు రామవేషమున నామెను వివాహమాడ నేగెను.

విరా:—(తనలో) నాకు నామెపైఁ గన్నుపడినది. (ప్రకా) తరువాత.

శూర్ప:—అంత జనకుఁడు శంకరశరాసనము నెక్కుపెట్టినవానికిఁ బిల్ల నిచ్చెద నని ప్రతినపట్టెను.

విరా:—సరే! రాక్షసుఁ డగుటచే మన మహారాజున కది సాధ్యపడదు.

శూర్ప:—కనుకనే రాముఁడు సీతను పెండ్లియాడఁ గలిగెను. అంత మహారాజు భార్గవరామును రామునిపైకిఁ బురికొలిపెను. కాని యతఁడును హరిచాపముతోఁ గూడ వీగిపోయెను.

విరా:—(విస్మయాద్భుతములతో) పరశురాముఁడు నైత మోడిపోయెనా?

శూర్ప:—అంత మహారాజు నాజ్ఞచే విద్యుజ్జిహ్వుఁడు మొదలగువారు మంథరాకైకేయీదశరథుల నావేశించిరి. మంథరయుఁ బూర్వ మొసంగఁబడిన వరద్వయముచే రామునకు వనవాసమును భరతునకు రాజ్యాధికారమును సాధింపఁ గైకేయికిఁ బుల్లవెట్టెను.

విరా:—ఇఁకఁ జెప్పున దేమి? ముద్దులపెండ్లము కోరకకోరెఁ గదా యని వృద్ధరాజందుల కియ్యకొనెను.

శూర్ప:—సీతారామలక్ష్మణులు వనవాసమునకు వచ్చిరి. పిదప నా వృద్ధరాజు రాక్షసావేశవిముక్తదేహుఁడై పుత్రస్నేహమునఁ బ్రాణములు వదలెను. భరతుఁడు కనిష్ఠునకు రాజ్య మనుచిత మని యెంత వేడినను రాముఁడు వినకుండుటచే నాతని పాదుకలను సింహాసనమున నుంచి తాను ప్రతినిధియై రాజ్యమును సాగించుచున్నాఁడు.

విరా:—అంతయుఁ దెలిసినది. ఐన నిపు డనర్థక మేమి? వనాగతుఁ డగుటచేఁ బ్రభుశక్తి రాముని వీడిపోయినది. సరే కాని నీ వెచ్చటికో బయలుదేరితివి?

శూర్ప:—జానకి నపహరించవలసిన దని మహారాజాజ్ఞాపించుటచేతఁ బర్ణశాలకుఁ బోవుచున్నాను.

విరా:—(తనలో) ఆమె నీ విరాధుఁడు గ్రహింప నెంచెను గదా! (ప్రకా) నీ కిది యశక్య మని తలంతును.

శూర్ప:—(తనలో) జానకీవేషమ్మున రాముని గొనిపోయి విహరింపవలె నని గదా నా కోరిక! కావున ని ట్లనియెదను. (ప్రకా) కనుకనే లంకకుఁ బోవుచున్నాను.

విరా:—(తనలో) ప్రకృతకార్యమున నా కొక యాటంకము తొలఁగిపోయినది.

శూర్ప:—నీ వేలకో రామాశ్రమసమీపమునఁ దారట్లాడుచున్నావు?

విరా:—రాముని జంపవలసినదిగా ఖరుఁ డాజ్ఞాపించెను.

శూర్ప:—(తనలో) నా మనోహరుఁ జంపుటకా నీ రాక? (ప్రకా) నీ కయ్యది శక్యము గాదు.

విరా:—(తనలో) అతనితో నేమి? రామవేషమున జానకిని దాటించుకొని పోఁ దలంచితిని గదా? (ప్రకా) కనుకనే తిరిగి పోవుచున్నాను.

శూర్ప:—(తనలో) ప్రకృతకార్యమున నా కొక యాటంకము తీరిపోయినది. (ప్రకా) సరే! నీ పనిమీఁద నీ విఁకఁ బొమ్ము.

(ఇరువురుఁ జెరియొకదారిని నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

దృశ్యము:—వనములో నొక పర్వతము.

[సీతారాములు పర్వతశిఖరముపైఁ గూర్చుండియుందురు.]

రాము:—ప్రేయసీ! జానకీ!

మ॥ అల రాత్రించర కృత్తిలక్షణవిచిత్రాతీత మాయాంబుధిన్
దలపూ వాడకయుండ నీది హరకోదండంబు ఖండించి యా
వల నా భార్గవు గెల్చి మారుని దయాభాగ్యంబుఁ బ్రాపించి కో
మలి! నిన్నుం జెమటోడ్చి యెట్టెటులో సంపాదించుకొంటిన్ దుదిన్.

సీత:—(చిఱునవ్వుతో మిన్నకుండును.)

రాము:—

గీ॥ పలుకుపల్కున నమృతంబు తొలకరింప
ముచ్చటాడవు; నీదు నెమ్మోముఁ దమ్మి
నేతిబీరకాయయె గాక నేర్పు కెక్కు
భ్రమరజాతీయ భావగీతము లవేవి?

సీత:—(ప్రేమతో) ఆర్యపుత్రా! అన్యదుష్కరము లగు భర్గచాపఖండనమును భార్గవగర్వభంగమునుఁ దలపునకు వచ్చి యించుక విస్మయపడితిని. క్షమింపుము.

రాము:—ఏమంటివి? క్షమించుటయా? నా కించుకంతయుఁ గోపకారణము లేదే?

ఉ॥ చేదని వీడుకొంటి నఱచేతికి వచ్చిన రాజ్యసంపదన్
గాఁదగు గుర్వాజ్ఞ యని కాపుర ముంటి నరణ్యమందు నా
పైఁ దమకంబునన్ మృతికిఁ బాల్పడెఁ దండ్రియు నేడ్చియేడ్చి నే
నీదగు సాహచర్యముననే మది నెమ్మదిఁ గందు సుందరీ!

సీత:—నాథా! అది యేమియో గాని నీ సన్నిధానమాత్రమున నరణ్యమైనను రాజాంతఃపురమునకన్న వేయిరెట్లు మిన్నగ సౌఖ్యము గొలుపుచున్నది.

రాము:—ప్రియా! ప్రేమతోఁ దులతూఁగు వస్తువులేదు. ప్రేమయే గదా, వలపుదంపతుల ననురాగంపుటుయ్యేలల జోకొట్టుచుండును! ప్రేమయే గదా, వారి లేయెడందలకుఁ బరస్పర మప్రయత్నముగ—అనాలోచితముగ—అయాచితముగ—దీయని ముద్దుల సంఘటించుచుండును! ఇంతయేల? నవశిరీషకుసుమసుకుమారివగు నిన్ను నాతోఁ గూడ నీ దుష్ట విపినభూముల కాకర్షించిన దీ ప్రేమయే గదా!

సీత:—స్వార్థపరుల విధమిట్లే యుండును. చెట్టువేయున దొకరు ఫల మనుభవించు నది వేఱొకరు. చూడుము తేనెటీగలిట్లు చెమటోడ్చి కూర్చిన తేనెను మానవుఁ డనుభవించుచున్నాఁడు.

రాము:—(తనలో) నేను స్వార్థపరుఁడనుగా నని యీమె యూహ. (ప్రకా)

గీ॥ ఒకని వస్తువు జగతి వేఱొకని కబ్బు
తరుణి! భాగ్యవశంబునఁ; దావకీన
మధురమధురాధరాధరసుధను గొనఁడె?
రాముఁ డిందుల వైయర్థ్య మేమి గలదు?

సీత:—(తనలో)

మ॥ కలఁ గన్నట్లు, ప్రియుండు వచ్చినటు,నన్ గౌఁగింట ముద్దాడిన
ట్టులు నేనుం బాలయల్కఁ గన్నటు, లతండున్ నాదు కౌఁగిళ్లు ము
ద్దులు నాకిమ్మని బల్మిఁ గొన్నయటు లెంతో నాఁడు కల్పించుకొం
చలరుం జెందితిఁ, జెందుచుంటి నది ప్రత్యక్షంబుగా నేఁ డిటన్.

(ప్రకా) ఆర్యపుత్రా! నవాంబుదశ్యామలకోమలంబు లగు కాంతుల వెదజల్లు పుష్పగుచ్ఛములచే నలరారు నీ యతసీవృక్ష మీ ప్రదేశము నలంకరించుచున్నది. చూడుము.

రాము:—(తనలో) ఆహా! ఈమె వచోరచన యెంత చమత్కారముగనున్నది. (ప్రకా) జానకీ! చూడుచూడుము మా సరోజినీభర్త యగు కూల మెంత యనుకూలముగ నున్నను సాలావళిని నెత్తి కెక్కించుకొనె నని హంసకంఠమునఁ గూకలు వేయుచు నల్లనాఁటి నీ మణిమేఖలాకలకలమును దలపించుచున్నది.

సీత:—(తనలో) ఆర్యపుత్రుఁ డడవికిఁ బ్రయాణమైనప్పుడు "నన్నుఁ గూడఁ దీసికొని పో"మ్మని మఱలమఱల యాచించి మొదట నంగీకరింపకుండుటచే గోపగించుకొని బొమముడిపాటుతోఁ దిరిగి యంతఃపురమునకుఁ బోవుచుండ నాఁడు నా మణిమేఖల చేసిన కిలకలము నిప్పుడు నాథుఁడు తలంచుచున్నాఁడు కాని మ్నిట్లని చూచెద. (ప్రకా) రాక్షసులనుండి జనస్థాననివాసులగు ఋషుల రక్షింపఁ గంకణము గట్టుకొనిన నీ భుజదండము నాశ్రయించిన నే నీ దుర్గమారణ్యమున నిర్భయముగా నెంతెంత వింతలను జూడలేను?

రాము:—(ముందునకుఁ జూచి) రాక్షసుల పేరు నెత్తియు నెత్తక ముందే చూడుము మా కాంచనవనమున నొక రాక్షసుఁడు ప్రత్యక్షమైనాఁడు. ఈ సంగతి లక్ష్మణునకుఁ దెలియదు కాఁబోలు!

(కొండ దిగువ ప్రదేశమున లక్ష్మణుఁడు ప్రవేశించును.)

లక్ష్మ:—ఎవఁడో రాక్షసుఁ డీ కాంచనవనమునఁ బ్రవేశించుచున్నాఁడు. కానిమ్ము తని కిప్పుడే తగిన శాస్తి యొనర్చెద. (ఆయుధములతోఁ బరిక్రమించును.)

సీత:—(వేఱొకవైపు జూచి) అది కాంచనవనము కాదు. అతఁడు రాక్షసుఁడునుఁ గాఁడు. అది కర్ణికారవనము. చూడుచూడు మొక చింపిరితల చుప్పనాతి వచ్చుచున్నది.

రాము:—ప్రియా! నీ వెక్కడ చూచుచున్నావు? నేఁ జెప్పుప్రదేశ మియ్యది. (నిర్దేశించును.)

సీత:—(చూచి నవ్వుచు) రాక్షసుఁడు కాఁడు. దేవరవారే యా ప్రవేశించినది.

రాము:—(చూచి) ఆశ్చర్య మాశ్చర్యము. పునర్దర్శనమున రాక్షసుఁడు నారూపమును ధరించెను.

సీత:—(వేఱొకవైపు జూచి) కర్ణికారవనప్రవిష్ట యగు నీమెయు నా రూపము ధరించినది.

రాము:—(చూచి ఆశ్చర్యముతో) వీరి కీ రూపగ్రహణమునఁ బ్రయోజనమేమో?

సీత:—ఈ పర్వతాగ్రము దిగి పోయి చూతమా?

రాము:—అవసరము లేదు. ఇచ్చటివారి కామడదూరమందలి వస్తు వైననుఁ గన్నులకుఁ గట్టిన ట్లగుపడును.

లక్ష్మ:—(చూచి విస్మయముతో) అయ్యో! సాయుధుఁడ నగు నేను వచ్చిన పని వ్యర్థమైనది. పూజ్యులగు నన్నగారే రాక్షసవధార్థ మిచ్చటఁ బొంచియున్నారు. (ఆలోచించి) ఐన జానకి యేమయ్యె? ఇంతకుముం దిరువురునుఁ గొండపై నుండిరిగదా? ఆమె నొంటిగ నచ్చట డించి యితఁ డిచ్చటి కెట్లు వచ్చును? (పైకిఁ జూచి) సీతారాములు పర్వతశిఖరముపైననే యున్నారు. కావున నెవ్వరో రాక్షసుఁడే మా రామునివేషము ధరించినాఁడు. ఈ చెట్లమఱుగున నుండి వాని కనులబడకుండ నీ నాటకమును జూచెదను.

[అంతట విరాధుఁడు రాముని వేషమునఁ బ్రవేశించును.]

విరా:—(ముందునకుఁ జూచి) ఏమి? కర్ణికారవనమునుండి చంపకవాటి కేగుచున్నదే జానకి!

[అంతట శూర్పణఖ సీతవేషమునఁ బ్రవేశించును.]

శూర్ప:—నే నిచ్చటనే పూవులు గోయుచుండెద. రఘుకుమారుఁ డిటే రాఁగలఁడు.

విరా:—(తనలో) ఈమెయే నిరతిశయరూపలావణ్యవతి యగు జానకి!

గీ॥ గిలుకు టందెలు మురువునఁ గులుకరింపఁ
గులుకు బెళుకులు వలపులఁ గ్రుమ్మరింప

నల్లదే! సీత ప్రణయగృహాంగణమునఁ
గన్నుగల్వలఁ దోరణఁ గట్టుచుండె.

రాముఁడుగాని లక్ష్మణుఁడుగాని యిచ్చోటకు రాకముందే యీమె నెత్తుకొని పోవు నుపాయ మూహింపవలెను.

శూర్ప:—(చూచి తనలో) ఇదే నా హృదయచోరుఁడు వచ్చుచున్నాఁడు.

గీ॥ వేయి పలుకులఁ బని యేమి వీనిఁ గనఁగ
నాదు మేనెల్లఁ గన్నులైనపు డొకింత
తృప్తి యను నట్టి దదియేమొ తెలియునేమొ?
ఇతనికన్నను స్వర్గ మింకేమి గలదు?

తిమ్మిని బమ్మి జేసియో బమ్మిని తిమ్మి జేసియో వీని నెట్లయిన 'గొనిపోయి సుఖింపవలయును. (పుష్పములఁ గోయుట నటించును.)

విరా:—(సమీపించి) జనకనందినీ!

గీ॥ చంపకమ్ములు వలసిన సతి! త్వదీయ
ప్రణయ దాసానుదాసుఁడు రామభద్రుఁ
డిడుగో వీని నియోగింపు మేల నీదు
పేశలశరీరమును గష్టపెట్టుకొనెదు?

శూర్ప:—(హర్షముతోఁ దనలో) ఇతఁడు నన్ను జానకి యనియే తలంచుచున్నాఁడు. ఆహా! ఏమి వీని మంజులాలాపములు? వినినంతమాత్రముననే యొడలు పులకించుచున్నది. కాని యీతని నిశ్శంకముగా నపహరించుకొనిపోవు విధమున నిట్లనియెద. (ప్రకా) నాథా! అల్లదే! ఆ కనంబడు ప్రదేశమున సంపెంగ పువ్వులు లెక్కకు మిక్కుటముగ నున్నవి. అచ్చటి కేగి కోసికొందము.

(పరిక్రమించును.)

విరా:—(తనలో) సహజస్నేహార్ద్రము లగు నీ పలుకులు వీనుల నమృతముఁ జిలుకుచున్నవి. కాని యీమె ప్రదేశాంతరగమనమే యీమెను నిశ్శంకముగ నపహరించుకొనిపోవుటకు మార్గము కాఁగలదు. (ప్రకా) సరే నీయిష్టము.

(అనుసరించును.)

లక్ష్మ:—చంపకవనాభ్యంతరమున మా వదినె జానకి పలుకులు వినవచ్చుచున్నవి. ఇంతకుముందే యామెను గొండపైఁ జూచితిమి గదా! ఇదియు నెవ్వతెయో రాక్షసియే. వీరి వ్యాపారము జూడ నొసలు బత్తుఁడు నోరు తోడే లన్నటు లున్నది.

సీత:—ఆర్యపుత్రా! ఆ రాక్షసుని మీరే యనుకొని లక్ష్మణుఁ డనుసరించుచున్న ట్లున్నది.

రాము:—అతఁడు నిగూఢముగ వారిని వెంబడించుచుండుటచే వారల రాక్షసులని యెఱింగియే యుండు నని తోఁచుచున్నది.

విరా:—సుందరీ! ఈ వన మెంతదూరమువర కాక్రమించుకొని యున్నదో?

శూర్ప:—(తనలో) ఎచ్చట విజనంబున ని న్నెత్తుకొనిపోవుటకు శక్య మగునో యంతవరకు. (ప్రకా) ఆర్యపుత్ర! సమీపించినాము. ఇంచుక యోపిక పట్టుము.

విరా:—(తనలో) ఆహా! ఏమి యీయామె లావణ్యము?

గీ॥ పెదవి సందిట హాయిలి విడువలేక
విడువలేక యేతెంచు నా పిన్ననవ్వు
లక్షసేయును, ప్రణయలీలావిలాస
సరసిలోఁ దేలియాడెదు సమయ మెపుడొ?

రాముని యాశ్రమమునుండి చాల దవ్వు వచ్చితిమి. ఈమె నవహరించు మార్గ మాలోచింపవలెను. (ప్రకా) జానకీ! ఈ కోసికొన్న పూలు చాలు లెమ్ము. ఇది రాక్షసులు సంచరించు ప్రదేశము.

లక్ష్మ:—పాపము! ఈమెను సీత యని నమ్ముచున్నాఁ డీ రాక్షసుఁడు!

శూర్ప:—(తనలో) నేను రక్కసినిగానా? (ప్రకా) రక్కసులఁ జంపఁ బ్రతినఁ బూనిన నీవు నా యండ నుండ నా కేమి భయము?

విరా:—(తనలో) నిజముగా నే నీ ప్రతిజ్ఞను నెఱుఁగను. ఓ ముద్దరాలా! రామునిఁ జంపుటకే నేను రామవేషమున ని న్నెత్తుకొనిపోవుచున్నాను. (ప్రకా) అట్లని పాఱుడు బండ్ల కెదురుగాఁ గాళ్లు సాచెదువా రుందురా

లక్ష్మ:—(నవ్వుచు) యథార్థముగా నన్నగారివలెనే పలుకుచున్నాఁ డీ రాక్షసుఁడు.

శూర్ప:—రావణునికన్న బలవంతుఁడు గదా ఖరుఁడు? అతని యెడ నీ ప్రతిన యెట్లు చెల్లఁగలదో?

సీత:—వీ రిరువురుఁ బరస్పరము మాట్లాడుకొనుచున్న ట్లున్నది.

రాము:—ఔను. మన మింకేమేమి చిత్రములు చూడవలెనో?

విరా:—(తనలో) నేను రాము నేది యడుగవలెనొ దాని నీమె నన్నే యడుగుచున్నది. కాని మ్మిట్లనియెద. (ప్రకా) పరశురాము నోడించిన నా పరాక్రమ మెఱుఁగవా?

లక్ష్మ:—ఈ జవాబు సరియైనదే.

శూర్ప:—(తనలో)

గీ॥ కౌఁగిళులఁ గట్టుకొన్న స్వర్గమ్మునందు
వలపు వాల్చూపు దూఁగుటుయ్యేలల—ముద్దు
సెజ్జలందుఁ—జేతో విపంచికల మేళ
వించి ప్రేమగీతము లాలపించు టెపుడో!

(ప్రకా) యెఱుఁగ కేమి? నీచేఁ జెప్పించుట కట్లంటిని. (పుష్పముల గోయుచుండును.)

విరా:—(తనలో) అదృష్ట మనిన నాదే యదృష్టము. జానకీదేవి వలపుల నెల్ల గొల్లగొనుచుంటిని. (ప్రకా)

గీ॥ కామినీ! నీదు మేనెల్లఁ గందిపోయెఁ,
బాణిపల్లవములు వసివాళ్ళువారెఁ,
దళుకు చెక్కుల లేఁజెమ రలముకొనియె,
నాపు మిఁక నైన నీదు పుష్పాపచయము.

శూర్ప:—(సిగ్గుతోఁ దనలో) ఇతఁడు నన్ను జానకి యని తలంచి యీవిధముగఁ బ్రార్థించుచున్నాఁడు. ఈతని నెట్లేని మాయపుచ్చవలెను. (ప్రకా) మనోహరా! ఈ సమున్నతం బగు సంపెంగచెట్టు కొనకొమ్మల సుకుమారము లగు సుమములు మెండుగ నున్నవి. వాటి యెడ నా కభిలాష కలుగుచున్నది. నా వీఁపుపై నెక్కి వాటినిఁ గోసిపెట్టి నా ముద్దు చెల్లింపవా?

విరా:—(తనలో) ఇదే నా కవకాశము. (ప్రకా)

గీ॥ ఇంతగఁ బ్రయాసపడఁగ నీ కేల నీదు
ప్రణయదాసానుదాసుఁడు రాముఁ డిడుగొ!
వెండి వచియించు చుంటి నా వీఁపు నెక్కి
కొమ్మ! వలసిన కుసుమముల్ కోసికొమ్మ!

లక్ష్మ:—వీరి చరిత్ర మంతకంతకుఁ జిత్రవిచిత్రముగుచున్నది.

ఉ॥ ఆతఁడె రామభద్రుఁ డని యామెయు నామెయె భూమిజాతయం
చాతఁడు సంతసంపడుచు నాయమ నెట్టులొ దొంగిలింపఁగా
నాతఁడు వాని నేనరుస నైనను నెత్తుకపోవ నామెయుఁ
యాతన నందుచుండి రొకరైనను దత్త్వ మెఱుంగ లేరహో!

శూర్ప:— (తనలో) కాని మ్మింక దపాయమేమి? ఈతని వీఁపుపై నెక్కి యితని గాత్రమును నా పాదములచేఁ బెనవైచి గగనమార్గమున నెత్తుకొని పోయెద. (శూర్పణఖ విరాధుని వీఁపుపై నెక్కును. ఇరువురును గగనమార్గమున నెగిరి పోవుచుందురు.)

సీత:—ఆర్యపుత్రా! అయ్యవారినిఁ జేయఁబోయినఁ గోఁతి యైనది.

రాము:—ఏమిది? వా రిరువు రొకరినొక రెత్తుకొనిపోవుచున్నారే?

సీత:—ఇఁకముం దేమి జరుగునో తెలియకున్నది.

లక్ష్మ:—ఆహా! వీ రీ యత్యద్భుతరామాయణము నాడుట కెంత శ్రమపడు చున్నారు? (పైకిఁజూచి) పైనుండి జటాయువు వచ్చుచున్నాఁడే. అతఁ డేమో యనుచున్నాఁడు?

(ఆకసమున జటాయువు.)

గీ॥ కనులు మూసుక పాల్ద్రావ గడఁగు పిల్లి
యటుల రాముని వేషాన నతని భార్య
నెత్తుకొనిపోవుచుంటివీ వెవఁడ వోరి!
అడుగు కదుపుము—తలయూడిపడును నిజము.

లక్ష్మ:—ఇతఁడును రాక్షసిని నిజమగు సీత యని భ్రమించుచున్నాఁడే?

సీత:—పైనుండి వచ్చు పక్షీంద్రుఁ జూచి వారు మరల భూమిమీఁదికి వచ్చుచున్నారు.

రాము:—అతఁడే జటాయువు. అన్న యగు సంపాతికి నమస్కరించి వచ్చుచున్న ట్లున్నాఁడు.

శూర్ప:—(విషాదముతో) ఇతఁ డెవరో రామునిరూపమున నన్ను మోహపెట్టు చున్నాఁడు. లేకున్న మానవమాత్రుఁ డెక్కడ? ఈ యుత్పతనశక్తి యెక్కడ? (ప్రకా) ఎవఁడురా నన్నుఁ దీసికొని యెగిరిపోవుచున్నాఁడు?

విరా:—(తనలో) అక్కటా! వినాయకుని పెండ్లికి వేయి విఘ్నములు. ఎట్లో కష్టపడి సీత నెత్తుకొనిపోవుచుండ నీ ముసలిగ్రద్ద యొకటి దాపురించినదే? (కొంచె మాగి) ఒకవేళ యీమె సీత కాదేమో? ఐనయెడల కుసుమకోమలి యగు నామె నన్ను దీసికొని యింత వేగముగా నింగి కెగిరిపోఁగలదా? (ప్రకా) ఎవ్వ తెరా నన్ను దీసికొని యెగిరిపోవుచున్నది?

లక్ష:—(సమీపించి)

చ॥ సుకముగఁ బ్రొద్దుపోయినది; చొక్కపు నాటక మాడినారు; నీ
వొక దనుజుండ వాయుమయు నొక్క నిశాచరియే; వృథాగమీ

రోక రోకరిల్ వరించుకొనియుంటిరి; పాపము! జోగిజోగిరా
చుకొనఁగ బూది రాలినది జుండు! నిరర్థకమయ్యె వేసముల్.

శూర్ప—(జ్ఞప్తికిఁ దెచ్చుకొని) ఏమీ నీవు విరాధుఁడవా?

విరాధు:—(ఆలోచించి) ఏమీ నీవు శూర్పణఖవా?

(ఇరువురు స్వస్వరూపముల ధరించి భూమిపై నిలుతురు)

లక్ష్మ:—ఓరోరీ! దురాత్మ! పరనారీచోర! విరాధా! చచ్చితివి, చచ్చితివి.

(కత్తిదూసి విరాధునిఁ బట్టుకొనును.)

విరా:—ఓరీ! విడువుము విడువుము. అర్భకుఁడవు నీవా నన్నెదిరించువాఁడవు?

లక్ష్మ:—ఓయీ! ఊరక నేల విడిచి సాముచేసెద వేల?

శూర్ప:—అహో! ప్రమాదము. విరాధుఁడు లక్ష్మణుని చేతిలో జనిపోవుచున్నాఁడు. జటాయువు నిటే వచ్చుచున్నాఁడు. ఇకఁ నేమి గతి?

(విచారము నటించును.)

జటా:—(ప్రవేశించి తనలో) ఏమిది? జానకీరూపము ధరించిన దీ చుప్పనాతిరోనా? (ప్రకా) వత్సా లక్ష్మణా! ఋషికంటకుండగు నీ విరాధుని విడువకుము.

సీత:—ఈ రాక్షసీరాక్షసులు తమ నిజరూపములను గ్రహించిన ట్లున్న దే?

రాము:—అదృష్టవశమున వర్ధిల్లితిమి. సౌమిత్రి తన చేతి కత్తిచే నీ విరాధుని యుత్త మాంగము నుత్తరించినాఁడు.

జటా:—ఈమె జానకి నపహరించుటకు దశగ్రీవునిచేఁ బంపఁబడినది. ఈమె నుపేక్షిం పకుము.

లక్ష్మ:—నే నుపేక్షించినను నా కరవాల ముపేక్షింపదు. ఐన నీమె స్త్రీయగుటచే నీమె ముక్కు చెవులనుగోసి బహూకరించెద.

(అటులొనర్చును. శూర్పణఖ పారిపోవును.)

రాము:—జానకీ! మన మార్గము నిష్కంటక మైనది. క్రిందికి దిగిపోయి సౌమిత్రీ జటాయువుల సంభావింతము రమ్ము. (దిగుదురు.)

లక్ష్మ:—గృధ్రరాజా! సీతారాములు కొండదిగి వచ్చుచున్నారు.

[సీతారాములు సమీపించి నమస్కరింతురు.]

జటా:—వత్సా! చిరంజీవ. అమ్మా! వీరప్రసవవు కమ్ము.

లక్ష్మ:—పిచ్చుగుంటుపై భాగీరథి ప్రవహించిన ట్లీ మహాత్ముఁడు మనల బవిత్రులఁ జేయ వచ్చినాఁడు.

రాము:—(లక్ష్మణునిఁ జూచి) అదృష్టవశమున విజయి వగు నిన్నుఁ జూడఁగల్గితిని.

సీత:—ఆ రాక్షసీరాక్షసు లెవ్వరో?

జటా:—ఆతఁడు పదునాలుగువేల పదునలుగురు రక్కసులకు నాయకుఁడైన ఖరునకు మిత్రుఁ డగు విరాధుఁడు. ఆమె రావణుని చెల్లెలగు శూర్పణఖ.

రాము:—విరాధుఁడేనా లక్ష్మణుని కరవాలమున కెఱయైనది?

జటా:—ఔను. మఱియు నొక సంగతి. విరూపిణియగు శూర్పణఖను దర్శించినంత మాత్రమున ఖరుని క్రోధము నిన్నభిషేకింపఁగలదు.

లక్ష్మ:—రాజు కొట్టఁగా మొగసాలకు మొఱవెట్టిన నేమి లాభము?

రాము:—రానిం డేమి భయము? చాల తడ వైనది పర్ణశాలకుఁ బోయి సావకాశముగ ముచ్చటించుకొందము రండు.

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ వెంకట పార్థసారథి కవి ప్రణీతం బైన విచిత్రరాఘవమునఁ

జతుర్థాంకము.

శ్రీ

విచిత్రరాఘవము

పంచమాంకము.

దృశ్యము:—లంకాపురములో నొక వీథి :

[అంతట ననల ప్రవేశించును.]

అనల:—(ముందునకుఁ జూచి) ఏలకో తండ్రిగారి మంత్రి యగు సంపాతి చాల తొందఱగా నిటు వచ్చుచున్నాఁడు.

సంపా:—(ప్రవేశించి) అదిగో విభీషణమహారాజుగారి కుమార్తె యనల యిచ్చట నున్నట్లున్నది. (సమీపించి) అమ్మా! అనలా! ఎచ్చటినుండి వచ్చుచున్నావు?

అనల:—విద్యుజ్జిహ్వుని యింటినుండి.

సంపాతి:—అచ్చటి కేల వెళ్ళితివి?

అనల:—కలదు గదా, మహారాజ లంకేశ్వరుని సోదరి శూర్పణఖ.

సంపా:—(నవ్వి) అబ్బ! చంపితివి. అత్తగా రనినఁ జాలదా? ఆమె రామునిఁ గామించి ముక్కుచెవులఁ గోల్పోవుటయే గాక ఖరుని సైతముఁ జంపించెను.

అనల:—ఆమె విద్యుజ్జిహ్వుని భార్య యడుగఁగాఁ దన నాశికాచ్ఛేదనకారణ మెఱిం గించి మాటలసందర్భమున రాముఁ డటువంటివాఁ డిటువంటివాఁ డని యేమేమో వర్ణించినది. అది విని రాముని యాకారము నొకపరిఁ జూచి యిచ్చెద నని యామె యడుగఁగా మున్ను జానకి పెండ్లికానప్పుడు వ్రాసిన చిత్రపటము నామె కిచ్చి వచ్చుచున్నాను.

సంపా:—ఆ చిత్రపటము నీయొద్ద నెందు కుండెను?

అన:—ఈ దీర్ఘవిరహమున దీనివలనఁ గొంత కాకపోయినఁ గొంత మైన జానకీ దుఃఖభారముఁ దొలఁగించుచుంటిని.

సంపా:—జానకి నపహరించినది మన మహారాజు. ఇందు భాగస్థుఁడయిన మారీచుని పీచమడంగినది. ఇది యిట్లుండ నావును నావును గ్రుమ్ములాడి మధ్య లేఁగకాలు విఱుగఁదొక్కి నట్లు రామరావణుల వైరము గరుత్మత్సహోదరుఁ డగు జటాయువు మరణమునకు దారితీసినది. సరే కాని యిఁక నామెకు మఱి యె ట్లూఱటఁ గూర్పఁగలవు?

అనల:—అందుచేతనే యామెకుఁ బ్రాణములు నిల్పు నుపాయము వెదకుచున్నాను.

సంపా:—ఏలిక యగు విభీషణకుమారునకునుఁ దక్కిన మాల్యవత్ప్రభృతులకును వాలివధ విన్ననాఁటనుండియు సీతనుఁ దిరిగి రామభద్రున కర్పించుటయే మే లని తోఁచుచున్నది.

అనల:—ఏమి? రాముఁడు వాలిని సైతము సంహరించెనా? ఇఁక నిరు లన నెంతటి పని? గుడి మ్రింగువానికిఁ దలుపు లప్పడములు గదా? ఐన మన మహారాజు గారి యభిప్రాయ మేమి?

సంపాతి:—మంత్రులలో మహారాజును దర్శించి చెప్పఁగల సాహస మెవరి కున్నది? అతఁడు మంత్రులతో నాలోచింపక, చేయదగిన పను లెవ్వియుఁ జేయక యెల్లప్పుడు జానకీ నామస్మరణ జేయుచుఁ బ్రబల వైరానుబంధుఁడయి యుం డుటచే మాటలచే వాలివధ చెప్పుటకు వలనుపడక మంత్రులు కూడఁబలుకు కొని రాక్షసాచార్యుఁడగు శుక్రునిచేఁ గొండొక నాటకమును వ్రాయించి దానిని వారి యెదుటఁ బ్రదర్శింప నెంచియున్నారు. నాటకదర్శనార్థము దయ చేయ వలసిన దని మహారాజున కొక యాసన్నపరిచారకుని ముఖమున నివేదిం చితిమి. అప్పు డేబుద్ధియుం డెనో గాని భాగ్యవశమున నాతఁ డందుల కియ్యకొని తన నర్మసచివుఁ డగు మహాపార్శ్వునితోఁగూడ సంగీతశాలయం దాసీనుఁడయి యున్నాఁడు.

అన:—అమాత్యశేఖరా! చెప్పుము చెప్పుము. ఆ నాటక మెక్కడినుండి యెంతవరకు వ్రాయఁబడినది?

సంపాతి:—రాముని సీతాన్వేషణము మొదలు వాలివధ వఱకును.

అన:—జానకియుఁ జిత్రపటములేమి నాటకదర్శనమున మనోవినోదనముఁ జేసుకొన వచ్చును గదా?

సంపాతి:—అట్లే చేయవచ్చును. కాని యామె ప్రచ్ఛన్నయై యుండుట మేలు.

అనల:—విద్యుజ్జిహ్వుని భార్యయొద్ద రాక్షసాంధంకరణమణిఘటిత కంకణములు రెం డున్నవి గాదా? ఆమె నల్లించి బెల్లించి యెట్లయిన నీ కంకణములు సంగ్ర హించుకొని వత్తును. అం దొకటి జానకియు మఱొకటి నేనును ధరించి సంగీత శాలకు వచ్చెదము.

సంపాతి:—అవు నవును. ఆ కటకములనుగూర్చి వినియుంటిని. సమయమున కక్కఱకు వచ్చినవి. సరే! నీవు వెళ్ళుము. నేనునుఁ బాత్రధారిణు లగు నప్సరసలఁ బిలుచుకొని వచ్చెద.

(ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది విష్కంభము.

దృశ్యము: సంగీతశాల.

[అంతట మహాపార్శ్వునితో రావణుఁడు ప్రవేశించును.]

రావ:—వయస్యా! నాటకప్రేక్షణమునకై యీ మంత్రిజనులు నన్నేల నిర్బంధించు చున్నారు?

మహా:—దేవా! జానకికై మన్మథతాపము నందుచున్న మీ కొకింత శాంతిఁ గల్పించుటకుఁ గానోపు.

రావ:—ఐన నాటక మారంభింపఁబడుఁ గాక!

(అంతర్నాటకము.)

నాంది.

సీ॥ భవుఁడు నెవ్వాని సిలుగుల భయముచేత
భార్యల భరించుఁ దీరని బరువు గాఁగ
నెవఁడు దంపతి సుఖహేతు వెవఁడు విరహి
జనశరుం డతఁ డతనుండు జయముఁ గనుత!

రావ:—ఇది నిజమే.

(నాద్యంతమున సూత్రధారుఁడు ప్రవేశించును)

సూత్ర:—

గీ॥ అల శరత్తు కాదంబిని నపహరింప
దొఱకిన ధనంబు వ్రేవఁగ దుఃఖపడెడు
నతని తెలుఁగునఁ గాననాభ్యంతరమునఁ
గుదురు సెడి క్రుమ్మరుచు నున్నయది శిఖండి.

రావ:—నే నపహరించిన జానకిం గానక కన్నీరు మున్నీరుగా నేడ్చుచున్న యీ రాముని సంగతివలెఁ దోఁచుచున్నది

మహా:—నేను నట్లె తలంచుచున్నాను

(తెరలో)

హా! వత్స లక్ష్మణ! ఈ పర్ణకుటీరము సీతారహితమై వెన్నెలకు వెలియైన రాత్రివలె నున్నది.

సూత్ర:—మహారాజా! అవధరింపుము. లక్ష్మణపాత్ర ధరించిన ఘృతాచితో సీతాన్వేషణపరుండగు రాముని భూమికను ధరించి పుంజికస్థల యిదే రంగస్థలము నలంకరించుచున్నది. (నిష్క్రమించును.)

(ప్రస్తావన)

రావ:—నాటకమును బాగుగ మొదలుపెట్టినారు. సీతను గానక రాముం డేమి చేయునో తెలిసికొన నాకుం గుతూహల మగుచున్నది.

(అంతటం గంకణములు ధరించి సీత, అనల ప్రవేశింతురు.)

సీత:—చెలీ! అనలా! అంతఃపురవనాంతరమున నిరోధింపఁబడి దుర్వారశోకానల దందహ్యమానమానసనై యుండుటచే నీ నాటకముం జూడ నిచ్ఛ లేదు కాని యార్యపుత్రుని కథాప్రస్తావమని ముచ్చటపడితిని

అనల:—జానకీ! ఇచ్చటం గూర్చుండి చూచుచుందమా?

సీత:—(రావణునిం జూచి) పరకాంతాపహరణమహాపాతకి యగు నీ రాక్షసేశ్వరుండు మన సమీపమునందే యున్నాండే?

అనల:—నీ భయము నిన్నట్లనిపించుచున్నది గాని నిజముగా మన మాతనికిం జాల దూరమున నున్నాము. మన కీ కటకము లుండుటచే నిచ్చట నిశ్శంకముగాం గూర్చుండవచ్చును. వారిమాటలు మనకును, మన మాటలు వారికిని వినఁబడవు.

సీత:—పూర్వము తపస్వివేషమున వచ్చిన యా రాక్షసున కీ కటకయుగళమును బహుమానముగ నిచ్చుట నా కిపు డుపయోగించినది సుమా?

అనల:—ఆశ్చర్య మాశ్చర్యము!! రాక్షసపుత్రిక నగుటచే నాకును నీవు కాన్పించుట లేదు. స్పర్శచేత మాత్రమే నిన్నుం దెలిసికొనం గలుగుచున్నాను.

సీత:—నీ చేతికిం గూడ నొక కంకణముండుటచే నీవును శ్రీసులకుం గనఁబడ వని తలంతును.

అనల:—సఖీ! నీకు నిపుడుం గాన్పింప వనుము. నా శరీరము నాకే కనుపట్టుట లేదు.

సీత:—పాత్రధారిణు లగు నప్సరసల కెట్లుండునో?

అనల:—వారు చూచిన దోషమేమి? కూర్చుందము. (ఇరువురునుం గూర్చుందురు)

(అంతట లక్ష్మణుండు వెంబడింప రాముండు ప్రవేశించును.)

రాము:—తమ్ముండా! వట్టిపోయిన యీ పర్ణశాలనుం జూచిన నా హృదయము తటుకుకొనిపోవుచున్నది.

రావ:—(సంతోషముతో) అంతే కావలెను. అంతే కావలెను.

సీత:—నాయందలి యార్యపుత్రుని స్నేహానుబంధ మట్టిదే గదా? నేను లేని పర్ణశాల నెట్లు చూడంగలండు?

లక్ష్మ:—అన్నయ్యా! దుఃఖింపకుండు. వదినెగారీ మయూరాకుల మగు నద్రినికుంజమున కుం బోయియుండును.

రావ:—ఆహాహా నేనెత్తుకొని పోయితి నని వీం డెఱుంగండు. వట్టి మూఢుండు.

సీత:—అట్లు జరిగియుండక పోయిననుఁ జిరంజీవి లక్ష్మణుఁ డన్నగారి కూఁట కలుగుట కట్లు పలుకుచున్నాఁడు.

రాము:—నన్ను విడిచి జానకి యెన్నఁడు నచ్చటి కేగియుండలేదు.

రావ:—కేవలము ప్రేమానుబంధము చేతనే కాదు. కాతర్యము చేఁ గూడ నట్లుండును.

సీత:—ఔను. ఆర్యపుత్రుఁడు దగ్గఱ లేకున్న నాకేదియు రుచింపదు.

లక్ష్మ:— పూలు కోసికొనుట కీ పున్నాగవాటికకుఁ బోయియుండును.

రాము:—(పరిక్రమించి) తమ్ముఁడా! సీత యెందునుఁ గాన్పించుటలేదు.

ఉ॥ కన్నుల లేడిపిల్లలునుఁ, గమ్మని పల్కుల రామచిల్కలున్
నెన్నడుమున్ మృగేంద్రములు, నిద్దపు జన్నుల నేనుగున్న, లి
ట్లున్నతి నెంచి యొక్కొకటి యొక్కొక వస్తువుఁ బంచుకొంచు నా
యన్నులమిన్న మ్రింగినవి యక్కట! వన్యమృగంబు లన్నియున్.

రాము:—(ఉత్సాహముతో) దీనితో సీతఁడు మరణించుఁ గాక! నిజముగా నట్లే మైనచోఁ దప్పక జానకి యిఁక నతనియందలి మోహమును వీడి నా భుజదండము నాశ్రయింపఁగలదు.

సీత:—అనలా! నా కారణమున నార్యపుత్రుఁడు పడరాని పాట్లు పడుచున్నాఁడు.

గీ॥ రామచంద్రుని నేను, నన్ రామచంద్రు
డింకఁ జూచుకొందుమొ? లేదొ? యింత కేస
తీపతులకు వియోగంబుఁ దాపినానొ?
కట్టి కుడుపక వదలునే కర్మఫలము?

లక్ష్మ:—(సమీపించి) అన్నయ్యా! ఊఱడిల్లు మూఱడిల్లుము.

రావ:—(ఈర్ష్యతో) మఱల నీ మాయదారి లక్ష్మణుఁ డూఱటఁ గూర్చి యీతనిని బ్రతికించుచున్నాఁడే?

సీత:—భాగ్యవశమున లక్ష్మణుని యూఱడింపుచే నార్యపుత్రుఁడు మఱల నించుక తేఱుకొనుచున్నాఁడు

రాము:—(ఊఱడిల్లి) తమ్ముఁడా! ఇఁక నేమి సేయుదము?

రావ:—ఉత్తమస్త్రీవియోగమున కేదియుచితమో - మహారాజ దశగ్రీవున కేది యిష్టమో దానినే.

రాము:—తమ్ముఁడా! చూడు చూడు మా కొండవా గేమిదియో చెప్పుచున్నట్లున్నది సమీపించి యడిగెద (దగ్గఱి విషాదముతో)

చ॥ అనవరతమ్ము గొండయొడియందుఁ బరుండెద వేల? పిల్చినం
త నఱుఁగు మేల్ముసుంగు నిడి న న్నన వే మనువాఁడ? నా ప్రియాం
గన నినుఁ బోలు నచ్చముగఁ గాంచితివే? అలివేణి నంచయా
నను నళినాయతేక్షణను నా కెఱిఁగింపవె నిన్ను వేఁడెదన్.

రావ:—సీతావృత్తాంతము నెఱిఁగించుటకు దాని దేమి గుండెయా? చెఱువా? ఎఱుఁగదా నా ప్రతాపము?

సీత:—ఆర్యపుత్రుఁ డున్మత్తునివలె నా సెలయేఱు నడుగుచున్నాఁడు! నాయందలి స్నేహానుబంధమే గదా అతని నీ స్థితికిఁ దెచ్చినది.

రాము:—ఇది మందబుద్ధి గల దగుటచేఁ జెప్పుట లేదు.

గీ॥ అదిగో! కనఁబడు సురపొన్న కదలి చివురు
వ్రేళులను జూపి న న్నటు పిలుచుచుండె;

రావ:—ఐననేమి?

రాము:—

తెలిసియేయుండు దానికిఁ గలతెఱంగు,
చెప్పనో యేమొ? అడిగిచూచెదను గాక! [సమీపించును]

రావ:—ఓరీ పాదపాపశద! సీతావృత్తాంత మించుకంత వెడల గ్రక్కితివేని నా వాఁడి కటారిచే నిన్నుఁ దుత్తునియ లొనర్చెద.

మహా:—(తనలో) జానకీవిరహమున నాఁతడును, జానకీమోహమున నీతఁడును ఉన్మత్తులగుచున్నారు. (ప్రకా) దేవా! ఆ చెట్టు జడపదార్థము గదా? అది యెట్లు చెప్పఁ గలుగును?

సీత:—అనలా! రాక్షసునకుఁ జిక్కి పక్కి కైవడి నాపోవు మని నాకును, నా జాడ దెలియక యున్మత్తునివలెఁ జింత నందు మని యతనికిని మూఁడుబంతుల వ్రాసెనుగాబోలు నా మాయదారి బ్రహ్మ.

అనల:—చెలీ! చింతింపకుము. కొలఁది కాలముననే నీ నాథుని సందర్శింపఁగలవు.

సీత:—ఇంతవఱకు నానాథుఁడు జీవించియుండునా?

అనల:—సఖీ! వృత్తాంత మంతయు నీ నాటకమే తెలుపును.

రాము:—శ్వశ్రూభిక్షాన్యాయమున నీ పొన్నచెట్టు నన్నుఁ బిలచియు మిన్నకున్నది. కాని మ్రాఁకొండ నడిగెద.

సీత:—అక్కటా! నన్ను రాక్షసుఁ డెత్తుకొనిపోయినాఁ డని యెవరు చెప్పుదురు? మనోహరుఁ డాసంగతి నెఱింగినఁ గదా నేను దుఃఖసాగరమునుండి తరింపఁ గలుగుట!

లక్ష్మ:—అన్నయ్యా! ఊరక నీ చెట్టుగుట్టల నడిగిన లాభమేమి?

గీ॥ కంటికిని తెప్పయుం బోలె గడ్డిపూల
చేతఁ బ్రియమారఁ బెంచుటఁ జేసి లేడి
పిల్ల లీవెపునకు సాగి వెళ్ళుచున్న
వవిగో! వదినె చందముఁ దెల్పునవియుఁ బోలె.

కావున నీ దారి నేగుదము రమ్ము. (పరిక్రమింతురు.)

రావ:—(క్రోధముతో) ఈ లేడిపిల్లలను దప్పక నఱికివేయవలెను. అవి దక్షిణపు దిక్కును సూచింపుచున్నవి. (కత్తిదూసి లేవ నుంకించును.)

మహా:—(కూర్చుండబెట్టి) మహారాజా! ఇది నాటకము. ఏల యీ చాపల్యము? గోడలకునుఁ జెవు లుండును. ఎవ్వరైన విన్న నవ్విపోవుదురు. సంరంభము మాని యవధరింపుఁడు.

సీత:—(ప్రేమతో) నాకుఁ బుత్రప్రాయము లగు నీ లేడిపిల్లలే మొదట నార్యపుత్త్రునకు దారిఁ జూపి తల్లిఋణమునుఁ దీర్చుకొనుచున్నవి.

రాము:—తమ్ముఁడా! ఈ పువ్వులు మీ వదినె ధరించినవి లాగున నున్నవి చూడుము. (చూపును.)

లక్ష్మ:—ఔను. దేవి చేతనో సిగ్గువడి తలవంచుకొనఁగా దేవి కీలడనుండి యివి జారి యుండవచ్చును.

రావ:—ప్రమాదవశమున నీ పూలు పడిపోవుటఁ జూడనైతిని.

సీత—నన్నీ రక్కసుఁడు బలాత్కారముగ నెత్తుకొనివచ్చునప్పు డివి రాలియుండును.

రాము:—(నాలు గడుగులు వెనుకకు వైచి) తమ్ముఁడా! ఏమిది? విరిగిపోయిన రథము—మృతిఁ జెందిన సారథి—తుత్తునియ లైన ఖడ్గాద్యాయుధములు—తెగిపోయిన ధనుస్సు—ఇచ్చట నన్నియు రణచిహ్నములు కన బడుచున్నవి.

లక్ష్మ:—జానకి నిమిత్త మిరువురు వీరు లిచ్చట యుద్ధము చేసియుందురు.

రావ:—జానకి నెత్తుకొనివచ్చుచున్న నాకు మధ్య నడ్డుపడిన యా జటాయువునకుఁ దగిన శాస్తిఁ జేసితిని

సీత:—హా! తండ్రీ! పక్షిరాజా! ఇట్లు నాకై యుద్ధముఁ జేసియు ధర్మఫలము నంద లేక పోయితివి.

అనల:—ముల్లోకములందును దశాననుఁడే బలవంతుఁడు. ఏమి చేయుదుము?

రాము:—(తత్తరపాటుతో) లక్ష్మణా! విల్లు విల్లు!!

లక్ష్మ:—అన్నగా రేలకో యాకాలమున విల్లు నందిమ్మనుచున్నారు.

మహా:—భ్రుకుటీభీషణముఖుండును, హుంక్రియాగర్భకంధరుండు నగు నీతఁడొక్కరి ముల్లోకముల దహించివేయున ట్లున్నది

రావ:—(అసూయతో) ఈ కృపణునిఁ బొగడిన మన కేమి కీర్తి గలుగును. వీని సమక్షమును వదలి ఇంకొక చోటఁ గూర్చుందము. (లేచును.)

మహా:—మహారాజా! ఇది నాటకము గదా! కూర్చుండుము.

(కూర్చుండఁబట్టును.)

సీత:—ఆర్యపుత్రుని యీ సంరంభ మేలకో?

రాము:—

గీ॥ ఏనుఁగు మృణాళినిం బోలె నిచట నాదు
సతిని భక్షించి పక్షివేషమున రాక్ష
సుం డెవఁడొ చూడు మొక పెద్ద కొండ వ్రాలెఁ
దమ్ముఁడా! వీఁడె పడియుండె దారి నడుమ.

కావున వీనిం జంపెద.

రావ:—(క్రోధముతో) అరే! ఎవఁడురా మదీయమనఃప్రియ యగు జానకిని భ్రమింగి వైచి మత్కరాశికరవాలమున కెఱగాఁ జూచునది?

మహా:—దేవా! అతనికిఁ బట్టిన పిచ్చియే మీకునుఁ బట్టినదా యేమి? ఆమె నశోకవాటికయందు నిరోధించి యుంచితిమిగదా?

సీత:—నన్నే రాక్షసుఁడును భ్రమింగలేదు. ప్రాణనాథునకు విరహదుఃఖము గలిగించుటకే నను జీవించియే యున్నాను.

లక్ష్మ:—(ముందుకు జూచి) అన్నా! ఏల యీ యకాండతాండవము? అతఁడు పూజ్యుఁడగు జటాయువు వలె నున్నాఁడు

(తెరలో)

వత్సా! రామభద్రా! సీత నెత్తికొనిపోవు నాతని నెదిరించి ముప్పాతిక మూఁడువీసము లాయువునుఁ బోగొట్టుకొంటిని. చచ్చిన పాము నేల చంపఁ జూచెదవు.

రావ:—ఏమీ రాజపుత్రులు వచ్చువఱకు నీ ముసలిగ్రద్ద ప్రాణములతోనే యున్నదే! ఇతఁడు చనిపోయెనను నమ్మకముతో విడచి వచ్చితిని.

సీత:—(సంతోషముతో) ఈ జటాయువు నా సంగతిఁ జెప్పివేసినాఁడు (ఆలోచించి) ఐన నన్ను విడిపించుట కింతవర కేల యత్నింపలేదో?

లక్ష్మ:—(సమీపించి) హా తండ్రీ! శకుంతరాజా! నీ కింతటి యవస్థ కల్గినదా?

రాము:—ఆర్యా! చెప్పఁగల యోపిక కలదేని చెప్పుము.

మ॥ ఎవఁడా కన్నపుదొంగ? శౌర్యసుభగుండే యానాఁడో? వాని పే
రెవ? రూరెయ్యది? మేము లేనితఱి నిల్లేలా? జనుల్ నల్వురున్
'తువు 'తువ్వం'చు మొగంబునం దుమియ నీ దుష్కార్యముం
జల్పె; వే
గ వచింపంగదవయ్య, ఆ ఖలుని - ఆ కష్టాత్ము మాతో నిఁకన్.

రావ:—హుష్! ఇటువంటి వారల ననేకమందినిఁ జూచితిని. అఱచుకుక్క కఱువ నేరదు? సంగతియంతయుఁ జెప్పని మ్మా పక్షిని. ఈ లంకేశ్వరుఁడు జడియునా యేమి? ఇంతమాత్రమున నాకు వచ్చిన నష్టమును వానికి వచ్చిన లాభమును లేదు.

సీత:—(ఆతురతతో) అసలే తలప్రాణము తోఁకకు వచ్చియున్న యితఁడేమియుఁ జెప్పనేలేఁడేమో గదా?

(తెరలో)

వత్సా! జానకి నపహరించినవాఁ డొక రాక్షసుఁడు. ఆ కష్టాత్ముఁడు పులస్త్య వంశము చెడఁబుట్టిన మహానీయుఁడు. అతనిని రావణుఁ డందురు.

రావ:—ఈ పక్షి నాపేరును సైత మెఱింగించెను. (నిట్టూర్చి) ఱెక్కలను, కాళ్ళను నరికివేసితిని గాని యిప్పుడు వీని శిరశ్ఛేద మెందుకు జేయనైతిని?

సీత:—ఊరక పేరును జెప్పినంతమాత్రమున లాభమేమి?

రాము:—తండ్రీ! మిగులును పూర్తిసేయుము.

లక్ష్మ:—(కన్నీటితో) ఇంకను మిగు లేమి? మనమే మిగిలితిమి.

రాము:—(ఆతురతతో) మిగిలినదానిం జెప్పకయే యీతఁడు మరణించెనా? (సమీపించి) హా తండ్రీ! జనకసఖా! హా పంచవటీనివాసా! హా ప్రశంసావహసాహాయ్యకా! హా గరుడాగ్రజకులప్రదీప!

గీ॥ సిరులు వీడిన, నడవిఁ గాపురము సేయ
వలసినను, దండ్రి పోయిన, భార్య కానఁ
బడకయున్న నింతగ దుఃఖపడను; కాని
మఱల నీవంటి మిత్రుండు దొఱుకునొక్కొ!

మహా:—మహారాజా! ఇంతటి శోకమునకుఁ గారణము నీవే గదా?

రావ:—తాటకాకరాళసుబాహుమారీచాదుల భంగముచేతను, శూర్పణఖ ముక్కుచెవులనుఁ గోలుపోవుటచేతను నాకు మాత్ర మింతటి దుఃఖము కలుగలేదా యేమి? నే నప్పు డనుభవించితిని. మీ రిప్పు డనుభవించుచున్నారు. (సంరంభముతో)

గీ॥ ఇపుడె సౌమిత్రిశిరము ఖండించివైతు
వెలి కుబికి పొంగి పారెడు వేఁడి వేఁడి
క్రొత్తనెత్తురు కడుపారఁ గ్రోలుగాఁత!
శూర్పణఖ కోపవహ్నికిఁ దర్పణముగ.

(ఖడ్గపాణియై లేచును.)

మహా:—దేవా! ఏల యీ సంరంభము. ఇది ప్రేక్షణికము కదా! (నివారించును.)

సీత:—నన్నపహరించినది రావణుఁడని చెప్పియు లంకాపురమతని నివాసమని చెప్పకయే మరణించెనే యీ జటాయువు? మందభాగిని నగు నే నేమి చేయుదును.

లక్ష్మ:—సోదరా! ఇది దుఃఖమునకు సమయము గాదు. శత్రువుల రేకుమణచు నుపాయ మాలోచింపవలెను.

రాము:—(క్రోధముతో)

చ॥ శరమును బంపినంతటనె జానకిఁ దొంగిలి నట్టి దుష్క్రియా
చణుని నెందు డాగిననుఁ జంపు సురాసురు లడ్డువచ్చినన్
సరియె సబంధుమిత్రముగ, చౌన నొసంగి యతండె దీనుఁడై
శరణని కాళ్ళమీఁదఁబడి సారెకు వేఁడక యున్న నుద్ధతిన్.

రావ:—అరే వృథావాచాట! వృత్రారిప్రముఖ నిఖిలదిక్పాలక నికాయమారణహోమ సోమయాజి యగు నీ లంకేశ్వరుని యెడలనా నీ యాటలు?

లక్ష్మ:—ఆర్యా! శాంతింపుము శాంతింపుము.

చ॥ "కలఁగి యరాక్షసం బగును గాక!" యటంచొక బాణమేయ నా
పలలుని బంధుమిత్రపరివారముతోడుత దెచ్చి నీ పద
స్థలి నిడు; నే, నకారణము సాధులు బాలురు నాఁడువాండ్రు వృ
ద్ధులు హతమార రే? ఇనుముతో ననలంబును దెబ్బ తిన్నటుల్॥
కావున నది దీనజనశరణ్యుండ వగు నీకుఁ దగదు.

సీత:—లక్ష్మణా! సమయమునకుఁ జక్కఁగాఁ బ్రబోధించితివి.

రాము:—అట్లైనచో ముందుగా నీ జటాయువున కగ్నిసంస్కారముఁ జేసిరమ్ము. పిదప దక్షిణదిక్కుగాఁ బోయి యా రక్కసుని యునికిఁ గనుగొందము.

లక్ష్మ:—చిత్తము. (నిష్క్రమించును.)

రాము:—

గీ॥ "ఈ విలాసము లీ యద్ద మేమి చెప్పు?
బోటి! నాదు చూపులపైన గీటువెట్టి
వన్నెఁ జూచుకొ"మ్మనిన యప్పటిది నీదు
వలపు వాల్చూపు నా కింకఁ గలుగునొక్కొ!

సీత:—అనలా! ఈ ప్రణయకథ నా హృదయమర్మముల నంటఁగోయుచున్నది.

గీ॥ దైవ మనువాఁ డొకం డుంట తథ్యమేని
పరసతి - నయోనిజను - పతివ్రత నొకండు
రాపులంబెట్టఁ గాపాడరాఁ డదేల?
కంచెయే చేను మేసినఁ గలదె దిక్కు?

(తెరలో)

హా సోదరా! జటాయువున కగ్ని సంస్కార మొనర్చి వచ్చుచుండగా వీఁడెవఁడో నన్ను లాగుకొని పోవుచున్నాఁడు.

రాము:—లక్ష్మణుఁ డాక్రోశించుచున్నట్లున్నది! తమ్ముఁడా! నిన్నునుఁ బట్టునంతటి శక్తిమంతుఁడా యతఁడు?

మహా:—దేవా! నీ యాజ్ఞ ననుసరించి వనమధ్యమునఁ గాచుకొనియున్న దనుకబంధుఁడే కాఁబోలు నతఁడు?

రావ:—కావచ్చును. (సంతోషముతో) లాగుకొనిపోయి భక్షించును గాక!

సీత:—అక్కటా! కష్టములపైనఁ గష్టములు. లక్ష్మణు నరికట్టుచున్నవాఁ డెవ్వఁడో కదా!

(తెరలో)

కబంధాకారమున నున్న యొక్క రక్కసుఁడు కలశాబ్ధి మంథశిఖరిస్థూలాయితము లగు తన చేతులతో నన్నుఁ బెనవైచి యీడ్చుకొనిపోవుచున్నాఁడు.

రాము:—ఓహో! ప్రమాదము! (పరిక్రమించి) ఆ రాక్షసుఁ డొక చిటుకలోఁ దమ్ముని కత్తికెఱ యయ్యెను.

సీత:—వత్స! లక్ష్మణ! భాగ్యవశమున మృత్యుముఖమునుండి విడివడితివి.

లక్ష్మ:—(ప్రవేశించి) ఈ యశరీరవాణి యేమో యనుచున్నది.

(అంతటఁ గబంధుని జీవుఁ డాకసమునఁ బ్రవేశించి)

రామచంద్రా! జానకి లభించుట కుపాయముఁ జెప్పెద వినుము. కిష్కింధలోని ఋశ్యమూకపర్వతమున వానరరా జగు సుగ్రీవుఁడు కలఁడు. అతనితో

సెయ్యి మొనర్చి యతని యన్న యగు వాలిం జంపి యా రాజ్యమున నాతనిఁ బ్రతిష్ఠింతువేని నీ పని నెఱవేఱును. ఈదారి పంపాసరస్సుమీదుగాఁ గిష్కింధకుఁ బోవును. స్థూలశిరోమునిశాపమునఁ గబంధుఁడనైన నాకు శాపమోక్షమును గల్గించినందుల కిది నేఁ జేయు ప్రత్యుపకారము. ఇఁక నే నేగుచున్నాను. (నిష్క్రమించును.)

రాము:—తమ్ముఁడా! ఇతఁడు చెప్పిన చొప్పున నడుచుకొందము. (పరిక్రమింతురు.)

రావ:—కబంధుఁడును విపక్షపక్షమునఁ జేరినాఁడుగా!

మహా:—భౌతికశరీర మున్నంతవఱకును లేదు.

సీత:—అమ్మయ్య! ఇప్పటికి నా గుండె కుదుటఁబడినది.

రావ:—ఇది కాని పోని రగడ. ఎంతటి భార్గవజేత యైనను దుర్ధర్షుఁ డగు వాలిని జంపుట బూటకము. అందువలననేగదా యీ క్షత్రియకుమారుల మట్టుబెట్టు పని నతనిపైనుంచితిని.

మహా:—(తనలో) ఇతని విజయాశంసన మంతయు వాలియం దిమిడియున్నది. వాలి వధను విని యిఁక నేమి సేయునో? (ప్రకా) ఔ నట్లే.

సీత:—(స్మృతి నభినయించి) రావణు నెత్తుకొనిపోవుచుండఁగా నొక పర్వతశిఖరముపై నైదు కోఁతులను జూచిన జ్ఞాపక మున్నది వారిలో నొకఁడు సుగ్రీవుఁ డగునా యేమి?

అనల:—వారిలో నెక్కుఁడును నిన్ను రక్షింపరాలే దేలనో?

సీత:—ఎట్లు రక్షింపఁగలరు? విమానము వాయువేగమనోవేగముల నతిశయించి పర్వులెత్తుచుండ వారి కవకాశ మెక్కడిది?

లక్ష్మ:—(ముందునకుఁ జూచి) ఇదియే పంపాసరస్సు.

రాము:—

గీ॥ తనువు పచ్చికపులకలఁ దానమాడ
గట్టు తనచుట్టుఁ జేతులఁ గలిపియుండ;
విరిసి కందళ్ళలను గాన్క వెట్టుచుండెఁ;
బ్రణయినియుఁ బోలె నదిగొ! పంపాసరస్సు.

హా! జానకి నాయందలి ప్రేమచే నెట్లు జీవించియున్నదో గదా! (మూర్ఛిల్లును)

రావ:—ఈ లంకాధినాథుఁ డెంతవఱకు దయామయుఁడైయుండునో యంతవఱకు రాక్షసులచే నభిరక్షితయై యుండఁగలదు. (చూచి) మూర్ఛిల్లిన యీతఁడు మరల లేచునా యేమి? లేవకుండిన బాగుండును.

సీత:—హా! ఆర్యపుత్రుఁ డెంత కష్టపడుచున్నాఁడు?

లక్ష్మ:—(తనలో) ఈ సరోవరలక్ష్మినిఁ జూచుటచే వదినె జ్ఞప్తికి వచ్చి యన్నగారు మూర్ఛపోయినారు. (ప్రకా) అన్నయ్యా!

గీ॥ వదినె నెత్తుకపోయిన వాని వృత్త
మెల్లఁ దెలిసికొంటిమిగదా! యిట్లు గాసిఁ
జెంద నేమగు యత్నముల్ సేయకుండ?
వెలఁది కన్నీట దొఱకునే? వెఱ్ఱి గాక.

రాము:—(మూర్ఛ దేఱి) ఋశ్యమూకపర్వత మిక్కడి కెంత దూర మున్నదో?

లక్ష్మ:—సోదరా! అనతిదూరమున నొక భిక్షువు వచ్చుచున్నాఁడు. అతని నడుగుదము.

(అంతట భిక్షుకవేషమున హనుమంతుఁడు ప్రవేశించును.)

హను:—వీరే నేను చూచినవారు సమీపించెద. (పరిక్రమించును.)

రావ:—వాలియే వీరలఁ జంపుట కిట్లు వచ్చెను.

సీత:—అనలా! అపాయ మపాయము.

అనల:—అస్థానమున నిట్టు దుఱపిల్లెద వేల?

సీత:—బిచ్చగాని వేసమున నన్నా రాక్షసుఁ డపహరించినట్లే యితఁడు నా మనోనాథునిఁ జంపవచ్చినట్లున్నది.

అనల:—వెఱ్ఱిదానా? అ ట్లెన్నటికిని సంభవింపదు.

లక్ష్మ:—అయ్యా! సుగ్రీవుని వాసస్థానమగు ఋశ్యమూకపర్వతము నెఱుంగుదువా?

హను:—(తనలో) వాలియే యిటకంపినచో వీరి కా గిరిరాజము తెలియకుండునా? మరియు వీరి మాటలచే నా యంతరాత్మ చల్లఁబడుచున్నది. (ప్రకా) మేఘపంక్తులు తలపాగవలె నమరియుండఁ గకుబటవి యను కవచముఁ దొడిగి సెలయేటి వాలును ధరించి వీరాధివీరునిఁబోలి యా కనఁబడు పర్వతమే ఋశ్యమూకము. మీ రెవరో నేనడుగ వచ్చునా?

రావ:—(తనలో) ఇతఁడు వాలి కాఁడు. (ప్రకా) ఎఱుఁగవా? వీరిలో నొకఁడు ఖరుని బొట్టను బెట్టుకొనిన పాపాత్ముఁడు. రెండవవాఁడు శూర్పణఖ ముక్కుచెవులను గోసిన మహాపరాధి.

సీత:—ఇతఁడు నే ననుకొన్నట్లు భిక్షుకరూపుఁ డగు రాక్షసుఁడు కాఁడు.

లక్ష్మ:—ఈతఁడు దశరథమహారాజు గారాబుకొమరుఁ డగు రాముఁడు. నే నతని తమ్ముఁడను. నన్ను లక్ష్మణుఁ డందురు. ఈతఁడు పితృశాసనమునఁ బదునాలుగేం డ్లరణ్యావాసము సేయవచ్చెను. దురదృష్టవశమున నీతని సతీమణి నెవ్వఁడో రావణుఁడఁట! దొంగతనముగ నెత్తుకొనిపోయెను.

హను:—అటులనా? సుగ్రీవుని మంత్రిని నన్ను హనుమంతుఁ డందురు. రామచంద్రా! మా సుగ్రీవుని సతీమణి నతని యన్న యగు వాలి యపహరించెను. వాలినిఁ జంపి మా ప్రభువతనునిఁ దద్రాజ్యమునఁ బ్రతిష్ఠింతువేని నతఁడును నీకు సాయపడఁగలడు.

రావ:—(కోపముతో) ఈ బిచ్చగాని వాచాలత్వ మంతకంతకు మితిమీఱుచున్నదే? నా చంద్రాయుధ మెక్కడ? మొదట నీతని నఱికివేయవలెను. (ఆలోచించి) నాకీ తొందఱ యేల? వాలినిఁ బంపియుంటిని గదా? ఆతఁడే వీరల నందఱను బ్రమందింపఁగలఁడు.

మహా:—పేదవాని కోపము పెదవులచే టని యెఱింగియు మీరింతగా హడావుడి పడెద రేల?

సీత:—ఇఁక భయము లేదు. వీరి కెడతెగని మైత్రి కలిగినది.

రాము:—అటులనే కానిమ్ము, ఋశ్యమూకమునకు దారితీయుము.

(అందఱు పరిక్రమింతురు.)

రాము:—ఇది యేమి? త్రోవలో పెద్ద కొండవలె నున్న దీ యెముకలప్రోగు!

హను:—ఇది వాలిచే నిహతుఁడైన దుందుభి యను రాక్షసునిది.

రాము:—మన దారికడ్డముగ నిది యేల? కాలఁ దన్నెదను. (తన్నును.)

లక్ష్మ:—(ఆశ్చర్యముతో) కాలి బొటనవ్రేలితోడనే దీని దశయోజనముల దూర మెగురగొట్టినాఁడే!

హను:—(తనలో) ఆహా! తాడి నెక్కువానినిఁ దలఁ దన్ను వాఁ డుండును. ఈరాకొమరుఁడు చాల బలము గలవాఁడు. (ప్రకా) దేవా! మున్ను యుద్ధావసానమునఁ జనిపోయిన యీ దుందుభిని వాలి తన చేతులతో నెత్తి యొక్క యామడ దూరము మాత్రమే విసరఁగలిగెను.

రాము:—(ముందునకుఁ జూచి) శరవిదారితదన్ర్ఫ్హతవివరము లగు నీ తాళవృక్షము లేడును నెవరివి?

హను:—ఇవియును వాలివే.

లక్ష్మ:—వీటి నన్నిఁటి నొక్క బాణముచేతనే త్రుంచఁగలఁ డార్యుఁడు. చూచుచుండుము.

రాము:—(శరమును వదలును. తాళ వృక్షము లేడును కూలిపోవును.)

హను:—(ఆశ్చర్యముతో) ఆహా! ఏమీ నైపుణ్యము! (ముందునకుఁ జూచి) అల్లదే సుగ్రీవుఁడు తన మంత్రులతోఁ గొండ దిగి వచ్చుచున్నాఁడు.

రావ:—(ఆశ్చర్యముతో) ఇంతటి మహాబలశాలి యగు నీతని ముందఱ వాలి మాత్రమేపాటివాఁడు? (ఆలోచించి) అంతకున కంతకుం డగు వాలి రాలవానఁ గురియుచో నాతని జయింపఁగలవాఁ డెవ్వఁడు?

(అంతట సుగ్రీవుఁడు ప్రవేశించి రామునకు నమస్కరించును.)

రాము:—వయస్యా! నీకుఁ గుశలమా?

సుగ్రీ:—నీచే 'వయస్యా!' యని పిలువఁబడుటకంటెఁ గుశలమేమి కలదు?

రాము:—మిత్రమా! విశ్రవస్సుతుఁ డగు రావణు నెఱుంగుదువు గదా? అతని నివాస స్థాన మెద్ది?

సుగ్రీ:—అతని పేరును వినుచుందుము గాని యూ రెఱుంగము.

సీత:—అనలా! ఈ వానరప్రభువును లంకేశ్వరుని స్థితిగతుల నెఱుంగఁడా? ఆర్య పుత్రున కిఁక నీ సంగతిఁ జెప్పువా రెవరు?

అనల:—సుగ్రీవుని భటుఁ డెవఁడైన వచ్చి చూచిపోయి నీ సంగతి నతనికిఁ దెలుపఁ గలఁడు.

హను:—ఆతఁ డీయన సతీమణి నెత్తుకొనిపోయినాఁ డఁట!

సుగ్రీ:—ఆకసమున నెవఁడో యొక రాక్షసుఁ డొక కన్నియ నెత్తుకొనిపోవుచుండ నాభరణకలిత మగు నీ యుత్తరీయము మా కొండపైఁ బడినది. (చూపును.)

రాము:—(చూచి) ఈ యుత్తరీయము మా సీతదే! (తీసికొనును.)

సీత:—నా యాభరణములను మూటగట్టి జారవిడచిన యా యుత్తరీయము భాగ్యవశమున మనోహరుని జేరినది.

రాము:—(శోకావేగములతో)

ఉ॥ జూదము నాడి యోటువడి చూడ్కులు కానుక వెట్టి యంతలోఁ
బో దనఁ బైడిచేలములు భూషణముల్ తుఁది కెంచఁ దానునుఁ
నాదగు సొమ్మె యాట నిఁక నాతలిదండ్రుడు లొసంగినా 'రిదో
నాది' యటంచు జానకి పణంబుగఁ బెట్టును దీని నెప్పుడుఁ.

రావ:—ఈతనికిఁ దహతహ పెచ్చు పెఱుగుచునే యున్నది గాని ప్రాణములు మాత్రము పోవుటలేదు.

రాము:—జానకి యాభరణములను గన్నులారఁ జూచెద. (మూట విప్పును.)

రావ:—ఈ రాకొమరుఁ డీ యాభరణములను జూచుటతోఁ దప్పక సమయఁగలఁడు.

సుగ్రీ:—ఈ నగలను జూపి యీ మహాత్మునకు మఱల దుఃఖముఁ గల్గించితినే?

సీత:—(ఆవేగముతో) ఆర్యపుత్రుఁడు జీవించునా?

రాము:—(స్మృతికిఁ దెచ్చుకొని తనలో)

గీ॥ స్పర్శసౌఖ్య మెక్కడఁ గొంచెపడునో యనుచుఁ
గలఁగి భూషణములఁ దీసి కౌఁగిలించు

కొందువుగదా? సఖీ! యెట్టు లుందు విపుడు
తరులు, కొండలు, నదులు నీ దవ్వొనర్ప.
(ప్రకా) సౌమిత్రీ! నన్నుఁ బట్టుకొనుము. (మూర్ఛిల్లును.)

రావ:—(సంతోషముతో) ఇఁక నేమి? వీని జీవిత మింతటితో సరి. (నిలుచుండును.)
మహా:—దేవా! మఱచితిరా? ఇది నాటకము. (కూర్చుండఁబెట్టును.)
సీత:—ఎంత కష్ట మెంత కష్టము?

గీ॥ అడవులకు వచ్చునాఁడు నాల్గెదడుగులు
వేసినటు వేసి 'యిఁక నెంత వెళ్ళవలయు'
ననుచు మఱిమఱిఁ బ్రశ్నింప నదియె మొదటి
సారిగాఁ బొంగి పొరలు కన్నీరుఁ గన్న
ప్రాణనాథుని మఱల నేఁ బడయఁగలనె?

(మూర్ఛిల్లును.)

అనల:—చెలీ! ఊఱడిల్లు మూఱడిల్లుము.
లక్ష్మ:—అన్నయ్యా! ఊఱడిల్లుము. అంతకంతకు వట్టి పిచ్చిలోఁ బడిపోవుచున్నావు?
రాము:—(మూర్ఛదేరి) సుగ్రీవా! మన మీ క్షణమునుండియుఁ బ్రాణమిత్రులము. (సుగ్రీవుని చేతిలోఁ జేయి నుంచును.)

(తెరలో)

ఓరీ! దురాత్మ! నా తమ్మునితో సంధిచేసుకొని నన్నెదిరించెదవుగా? ఇదె వచ్చుచున్నాను. మీ కీర్తిలతికను మొదలంటఁ గోసివైచుటకు—

సుగ్రీ:—వాలి స్వయముగనే వచ్చి యిట్లనుచున్నాఁడు.
లక్ష్మ:—(కోపముతో) ఓరీ దుష్టా! ఒక్క కోఁతియా మా కీర్తిలతిక నంటఁ గోయునది.
సీత:—(మూర్ఛఁదేరి) మరల నిది యొక పుట్టిమునుక వచ్చినదే.

(మరలఁ దెరలో)

ఆహాహా! ఒక్క పూఁబోడి నెమ్మొగము విరూపముగఁ జేసినంతమాత్రమున నొక పెద్ద శూరుఁడ ననుకొనుచున్నావా? విరాధునిఁ జంపుట యొక ఘుణాక్షరన్యాయము. నీతో నేమి? రామభద్రా! చేవ గలదేని నన్నెదిరింపుము. నా శిలాపాతమున స్రవించు రక్తధారలచే జానకీవిరహాగ్నిని జల్లార్చుకొనుము.

రావ:—రాముని పని ముగించుటకే వాలి వచ్చినాఁడు.

సీత:—అనలా! మీఁద నేమగునో గదా? నా మనస్సు చేయిపెట్టి కలఁచిన ట్లున్నది.

అనల:—రఘుకుమారుఁడే వీనినిఁ బరిభవింపఁగలఁడు.

రాము:—ఓరీ వాలీ! ఊఁటక లట్టాభట్టీయము లేల? చచ్చుటకు సిద్ధముగ నుండుము. (నిష్క్రమించును).

(తెరలో)

హా! దురదృష్టవతిని. నా భర్త రాయి రువ్వియు రువ్వక ముందే రాముఁడు దర్వీకరభీకరమార్గణమును వదలినాఁడు. అది నాకొంపకుఁ జిచ్చుపెట్టనే పెట్టినది. అయ్యో! !

సుగ్రీ:—వాలి చనిపోయిన ట్లున్నది. అందులకే తార యిట్లు విలపించుచున్నది.

రావ:—రామహతకుఁడు వాలినిఁజంపెనా? ఇది యెట్లు నమ్మఁదగును? నీటిపైఁ బాషాణము తేలునా? (క్రోధముతోఁ) ఆహవవిమర్దనిర్దయానిర్ఘాతదిక్పాలకగణుం డగు రావణుని యెదుట బూటకపు నాటకము లాడు నీ యప్సరోంగనల తలల గోఁటిగింప నాజ్ఞాపింతునా.

మహా:—(దోయిలించి) శాంతింపుఁడు దేవా! శాంతింపుఁడు. దీనిని భగవానుఁడు శుక్రాచార్యుఁడు వ్రాసెను. ఇం దసత్యముండదు.

రావ:—ఇది నిజమే. (శోకముతో) హా ప్రియసఖా! హా దుందుభిదానవ సమరసందర్శిత బాహువిక్రమ! కపికుల చక్రవర్తీ!

గీ॥ మన ఖరాధ్యుఁడు మరణించినను, ఖరుండు
సమసినను, నీ పరాక్రమక్రమముఁ జూచు
కొని జిగీషామహాసౌధమును రచించు
కొంటి నది నేఁడు నిలువునఁ గూలిపోయె!

మహా:—సీతపుట్టుక లంకచేటునకే కాఁబోలు!

లక్ష్మ:—దీనజనశరణ్యుఁ డగు సోదరుఁడు వాలిని సంహరించి వచ్చుచున్నాఁడు.

రాము:—(ప్రవేశించి) సుగ్రీవా! ఇఁక గుండెమీఁదఁ జేయివైచికొని హాయిగ విశ్రమింపుము.

లక్ష్మ:—అన్నగారి ప్రతిన నెఱవేఱినది. నీయదియే యవశిష్టము.

సుగ్రీ:—అంతయు భవదనుగ్రహమే! మీ రీ ప్రస్రవణపర్వతముపై నివసించియుండుఁడు. సీతను వెదకుట కిదే వానరసేన నంపుద.

లక్ష్మ:—అట్లే చేయుదము. (నిష్క్రమింతురు.)

రావ:—ఇఁక నుపాయ మేమి?

సీత:—(సంతోషముతో) అబ్బా! ఈ రోజున కొండ నెక్కినట్లున్నది.

(తెరలో)

మిత్రమా! శుకుఁడా! చూచుటలేదా? ఆ సంపాతివలన సీత సంగతి దెలిసుకొని లంకాప్రయాణోన్ముఖుఁడై హనుమంతుఁడు సముద్రము నుల్లఘించుచున్నాఁడు.

(మరలఁ దెరలో)

శార్దూలా! చూచితిని? మన మహారాజుగారితోఁ జెప్పి వచ్చెద.

(అంతర్నాటకము సమాప్తము.)

రావ:—శుకశార్దూలుర పలుకులవలె నున్నవే?

చ॥ ధరణిజమీఁది మోహమునఁ దప్పు నెఱుంగక చారదృష్టియున్
మఱచిన నన్నుఁ దెల్పుటకు మంత్రులు నాటకకల్పనంబుఁ జే
సిరి; కడు మంచి సాధనమె చేతులు కాలిన మీఁద నాకుకై
పరువిడ నేమి లాభ? మిఁక వర్తిలఁగావలె జాగరూకతన్.

మహా:—(చిఱునవ్వుతో) మంత్రులు చరితార్థులైనట్లే.

సీత:—సఖీ! అనలా! హనుమంతుఁడు సముద్రము నుల్లంఘించియుండును. మన మశోకవనమున కేగుదము రమ్ము. (సీతయు అనలయు నిష్క్రమింతురు.)

రావ:—మహాపార్శ్వ! ఎల్లరు నప్రమత్తులై యుండవలసిన దని నా యాజ్ఞగాఁ బరిజనులకుఁ దెలుపుము. నేనును హనుమంతుని విషయమై మంత్రులతో నాలోచించెద. (ఇరువురు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ వెంకట పార్థసారథి కవి ప్రణీతంబైన విచిత్రరాఘవమునఁ

బంచమాంకము.

శ్రీ

విచిత్రరాఘవము

షష్ఠాంకము.

దృశ్యము:—లంకాపట్టణములో నొక వీధి :

[అంతట శూర్పణఖ ప్రవేశించును.]

శూర్ప:—హా సోదరా! రావణా! హా ఆర్య కుంభకర్ణా! వత్స మేఘనాధా! మరణించితిరా? ఏమి సేయుదును? మందభాగ్యురాలను. మున్ను హనుమద్వాలాగ్నిచే లంకాపురగృహనికురుంబమువలె నీ శోకముచే నా హృదయము దహించుకొని పోవుచున్నది. ఆహా! ఏమా రఘుకుమారుని నైపుణ్యము! వింట శర మెప్పుడు తొడుగునో యెప్పుడు విడచునో యేరికినిఁ దెలియదు తాళఫలములవలె శత్రుశిరములు క్రిందఁబడుచుండుట మాత్రము కానుపించును. కానిమ్ము! రాత్రించరకాళరాత్రు లగు నీ రాజపుత్రులపైఁ గసిఁ దీర్చుకొనక మానను. విభీషణుఁడు మానాభిమానములను విడనాడి శత్రుపక్షముం బ్రవేశించి చేతులారఁ గొంపకుఁ జిచ్చు వెట్టినాఁడు. అతనికి రాజ్యము వచ్చిన దని నా కెంత మాత్రమును సంతసము లేదు. రామలక్ష్మణులు వానరులును రాక్షసులును వెంబడింపఁ బుష్పకవిమానము నెక్కి నందిగ్రామమునకుఁ బ్రయాణమై యీ వార్తను భరతుని కెఱింగించుటకు ముందుగా హనుమంతునిఁ బంపిరఁట! హనుమంతుఁడు భరతున కీ సందేశము నందఁజేయకముందే తాపసీవేషమునఁ బోయి యాతని కెద్దియేని నప్రియముఁ జెప్పుదును. అది విని భరతుఁడు తమ్మునితోఁగూడ శరీరమును విడిచిపెట్టును. రాముఁడు నా యన్నల నిర్వురఁ జంపినందుల కిది ప్రతీకారము కాఁగలదు.

(నిష్క్రమించును.)

ఇది విష్కంభము.

దృశ్యము:—నందిగ్రామములో భరతుని పటకుటీరము వెలుపల.

[అంతట భరతశత్రుఘ్నులు ప్రవేశింతురు.]

భర:—తమ్ముఁడా! శత్రుఘ్నా!

ఉ॥ మాయకుఁ డౌచు మైథిలకుమారిని దొంగిలిపోయినట్టి యా
కోయను బట్టి చంపుటకుఁ గూరిమితో మన మాటమీఁదుగా
సాయముసేయ వచ్చిరి విశాంపతు లాయతతేజు లౌచు నా
యా యవనీశులం దగినయట్టుల నందఱ గౌరవింపుమా!

నేనును వారు తెచ్చిన యుపాయనముల నన్నగారి పాదుకల యెదుట నుంచి పిదపఁ గోశగృహమునఁ జేర్చెదను.

శత్రు:—అన్నయ్యా! మీ యాజ్ఞచే రాజుల నందఱ నిదివఱకే గౌరవించియుంటిని. మీరును వారివారి యుపాయనముల నింతకుముందే కోశగృహమునఁ జేర్చితిరి. మఱల నిట్లందురేల?

భరతు:—ఔనుసుమా! ఇంతలోనే మఱపునకువచ్చినది!!

ఉ॥ ఎంచుచు వేళ్ళ బుచ్చితిమి యెట్టులొ యిన్ని దినంబు లగ్రజుం
గాంచుట యెప్పుడెప్పు డని కావునఁ, జిత్తము గంగవెఱ్ఱిచే
సంచలియించె, జ్ఞాపకపు శక్తి నశించె, నికెట్లు మాట ద
క్కించెదొ! తమ్ముఁడా! నిఖిలకృత్యము లీవయి నిర్వహింపుమా!

శత్రు:—అన్నయ్యా! తమ యాజ్ఞ కెల్లప్పుడును బద్ధుఁడనే గదా!

భర:—

ఉ॥ పొంచి నిశాచరుండు కితవుం డయి యెత్తుకపోయె సీత జీ
వించునె? స్వప్నవార్త; యొకవేళ నదృష్టము కల్గియుండి జీ
వించినఁ జూడ మిత్రుఁడును వేడఁగ దైవము లేని యందు నా
కిం ముదసంబు చాల నుడికింపగ బిట్టుగ నేడ్వకుండునా?

చ॥ వదినె నిశాటుచేతఁ బడె; వంద్యగుణాఢ్యయె యాను గాక యా
సుదతి; తదీయశీలపరిశోధనముం బొనరింపకున్న ద
క్కదు యశ, మట్లు సేయుట నిగారపుఁ గార్యము కా దటంచు నె
య్యదియునుఁ బాలుపోక మన యన్నయుఁ బ్రాణము వీడకుండునా?

శత్రు:—

చ॥ వలనుగ నన్నువంటి పసివానికి ధైర్యగుణంబుఁ జెప్పఁగా
వలసినవాఁడ వి వ్విధినిఁ బామరుఁ డట్టుల వట్టి వెఱ్ఱిలో
పలఁబడు చింతకంతకును వాడుచు నుంటివి; అన్న! దైవదు
ర్విలసిత మిద్ది దీనిని స్మరింపక నిబ్బర మూని యుండుమా!

భర:—శత్రుఘ్నా! ఎట్లు స్మరింపకుందును?

సీ॥ రమణీయమణికిరీటము చేతఁ దళుకొందు
శిరముపైఁ గెంజడ లిరవుకొనఁగ;
బంగారు సరిగ దువ్వలువఁ గట్టెడు కటీ
తటమునఁ గావివస్త్రము నటింప;
ప్రాసాదవీధులఁ బరిఢవిల్లెడు మేను
చెడు ముండ్ల వనములఁ జిక్కువడఁగ;
'నవకాయ పిండివంటలఁ దేలువానికిఁ'
గందమూలంబు లాకఁటిని దీర్ప;
గీ॥ చిక్కి సగమయి మనలనుఁ జేర వచ్చు
రామభద్రుని నే నింక నే మొగంబు
నెట్టుకొని చూతు నాతని నిట్టు లడవి
పాలు చేసిన దౌర్భాగ్యభాజనుండ.

శత్రు:—అన్నయ్యా! ఆ మాయదారి విధి యిట్లు చేయుచుండ మన మేమి చేయఁగలము? ధైర్య మవలంబింపుఁడు. ఈ రాజన్యుల నందఱను వారివారి స్వస్థానములకుఁ బంపివేయవలసి యున్నది.

భర:—ఈ రాజలోకముం బురస్కరించుకొని జానకి నపహరించిన యద్దుష్కరుఁడి రక్కసునిపై దాడివెడలఁ దలఁచితిమి గదా! మఱల నిదేమి?

శత్రు:—నిషాదాధిపుఁ డగు గుహుఁ డొక యుత్తరమును వ్రాసెను.

భర:—మాయలేడి రూపవచనములచే నన్నయు లక్ష్మణుఁడునుఁ జాల దవ్వేగిన సందుగొని భిక్షుకవేషమునఁ గొండొక రాక్షసుఁడు మన వదినె నపహరించెనని నాకు గుహుఁడే చెప్పియుండెను. మఱల నీ లేఖ యేమి?

శత్రు:—సలక్ష్మణుఁ డగు నన్నగారికి ససైన్యుఁ డగు సుగ్రీవుని తోడు దొరకినది. కనుక సహాయాంతరాపేక్ష లేదు.

భర:—సుగ్రీవుఁ డెవ్వఁడు? సహాయ మెట్లు దొరకినది?

శత్రు:— ఈ సుగ్రీవుఁడు కిష్కింధాధిపతియుఁ గపికులచక్రవర్తియు నగు వాలికిఁ దమ్ముఁడు. అన్నగారా వాలిని జంపి సుగ్రీవునకుఁ బట్టముఁ గట్టిరి. అందుచేత నతఁడు వారికిఁ దోడ్పడెను.

భర:— ఇది నిజమైయుండును. ఏల యన నొకప్పు డిరువురు ఖేచరు లాశ్చర్యముతో నొకరి కొకరు చెప్పుకొనుచుండ వింటిని.

శత్రు:— ఏమని?

భర:— తన కన్నకొడుకగు వాలి రాముని చేతిలో నిహతుఁడైనను గార్యార్థియగు నింద్రుఁ డెంతమాత్రమును వ్యాకుల పడుటలే దఁట!

శత్రు:— ఐన నీ వాలి యింద్రుని కొడుకన్నమాట. ఇంద్రుని కార్య మెట్టిదో!

భర:— ఇంక నొక సంగతి వినఁబడినది. శతయోజనవిస్తీర్ణమై యగాధ మగు సముద్రముపై ము న్నెన్నఁడుఁ గని విని యెఱుంగని సేతు వొండు నిర్మించి రఁట!

శత్రు:— కనుక వానరులకును రాక్షసులకును యుద్ధము జరిగియుండవచ్చును.

(తెరలో)

మిత్రులపరాజయము! శత్రుల విజయము!! శత్రులే మిత్రులవలె బుజ్జగించుట!!! కానిమ్ము. హిమాలయప్రాంతముల కేగి తపస్సుఁ జేసికొనియెదఁ గాక.

భర:— యుద్ధప్రవృత్తు లగు నెవరో యొకరి జయపరాజయములఁ జింతించుచు నొక వృద్ధతపస్విని వచ్చుచున్నట్లున్నది.

(అంతట వృద్ధతాపసీవేషమున శూర్పణఖ ప్రవేశించును.)

శూర్ప:— (వెనుకటిదానినే మఱలఁ జెప్పును.)

భర:— తమ్ముఁడా! ఆమె యెవ్వరో యెచ్చటనుండి వచ్చుచున్నదో యడుగుము. ఈమె వలన నన్నగారి వృత్తాంత మేమైనఁ దెలియునేమో!

శత్రు:— తెలియవచ్చును. (శూర్పణఖను జూచి) అమ్మా! నీ వెచ్చటనుండి వచ్చుచున్నావు?

శూర్ప:— (శత్రుఘ్నునిజూచి భయముతోఁ దనలో) నా ముక్కుచెవులఁ గోసిన యా క్షత్రియబ్రహ్మచారి యిచ్చటికిని వచ్చినట్లున్నదే! (నిరూపించి) ఈతఁడు లక్ష్మణుఁడు కాఁడు. అచ్చు మాతని పోలికనే యున్న యీతఁడు శత్రుఘ్నుఁడు కావచ్చును. (ముక్కుచెవులను దడిమి చూచుకొని) నా యీ తాపసీవేషమున ముక్కునుఁ జెవులును వచ్చినవి కనుక నా మాటలు విని యీమెకు ముక్కుతో మాట్లాఁడుట యలవాటు కాఁబోలు నని యనుకొందురు గాని యసలు సంగతి వీరికిఁ దెలియదు. (ప్రకా) అయ్యా! ఏ మనుచున్నావు?

శత్రు:— "నీ వెవరు? నీ రాక యెచ్చటినుండి?" యని.

శూర్ప:—(తనలో) రావణుని చెల్లెలను. లంకాద్వీపమునుండి. (నిట్టూర్పు విడిచి ప్రకాశముగా) నే నెవ్వతె నైన నేమి? యెక్కడనుండి వచ్చిన నేమి?

భర:—(తనలో) ఈమె నిక్కముగ తాపసియే. రాక్షసపక్షపాతిని కాదు. ఈమె యేలొకో కంపలం బడ్డ కాకి వలె వగర్చుచున్నది. అన్నగారికిఁగాని లక్ష్మణునకుఁగాని యాపద కలిగియుండదు గదా! ఒకవేళ యీమె యిట్లుండుటకుఁ గారణము వేఱె యుండఁగూడదా! (ప్రకా) అమ్మా! నీ పేరేమి?

శూర్ప:—(తనలో) ఇతఁడే యగునా యేమి నేను చూచి మోహించి మోసపోయినది? (నిరూపించి) కాఁడు కాఁడు. ఇతఁడు భరతుఁడై యుండవచ్చును. (ప్రకా) అయ్యా! ఏ మనుచున్నావు?

శత్రు:—"నీ పేరేమి?" యని యన్నగా రడుగుచున్నారు.

శూర్ప:—(తనలో) నా పేరా? పుట్టినప్పుడు పెట్టినది. శూర్పణఖ. ఈ చేష్టలచేత వచ్చినది విగ్రముఖ. (ప్రకా) ఋశ్యమూక పర్వతవాసు లైన మును లందఱు నన్నుఁ బర్ణాదిని యని పిల్చుచుందురు. పులస్త్య బ్రహ్మవంశీయురాల నని వాడుక.

భర:—కనుక నీవు కిష్కింధనుండి వచ్చుచుంటి వన్నమాట.

శూర్ప:—ఔను.

భర:—దానిని పాలించుచున్నది వాలి గదూ?

శూర్ప:—వాలి గాదు. అతనిం జంపి రఘువంశీయుఁడగు రాముఁడనువాఁడు అతని తమ్ముఁడగు సుగ్రీవు నందు స్థాపించెను.

శత్రు:—ఏమి నీవు రాక్షసివా?

శూర్ప:—(తనలో) ఇప్పు డేమి చెప్పదగినది? (కోపముతోఁ బ్రకాశముగా) పులస్త్య వంశమునఁ బుట్టినంత మాత్రమున నందఱును రాక్షసులే యగుదురా?

భర:—వత్సా! తపస్వినికిఁ గోపము రానీయకుము. విశ్రవసునకుఁగాని వైశ్రవణునకుఁగాని రాక్షసత్వము లేదు గదా!

శూర్ప:—(తనలో) దౌర్భాగ్యుఁడగు విభీషణునకు నట్లే. (ప్రకా) లెస్స బలికితివి.

భర:—ఐన నీ కీ విచార మేల?

శూర్ప:—వినుము. మిత్రు లోడిపోయిరి. శత్రువులు గెల్చిరి. దుఃఖింప కేమి సేయుదును?

శత్రు:—నీకు మిత్రు లెవ్వరు? శత్రువు లెవ్వరు?

శూర్ప:—(తనలో) రాక్షసులు మిత్రులు. వానరులు శత్రువులు. (ప్రకా) వానరులు మిత్రులు. రాక్షసులు శత్రువులు.

భర:—(తనలో) అన్నగారి పక్షమున వినిపాతము దారుణముగ నున్నదే? (ప్రకాశముగ) పర్ణాదినీ! నీవు ఋశ్యమూకగిరినుండి వచ్చితి నంటివి గదా? అచ్చట యుద్ధము జరిగినదా యేమి?

శూర్ప:—అక్కడఁ గాదు. లంకాద్వీపమందు.

శత్రు:—దానిని నీ వెట్లు తెలిసికొంటివి?

శూర్ప:—రుమాదేవి దాసి యగు శంకుకర్ణి యను నాపె రుమ తన సవతితోఁగూడ నగ్ని ప్రవేశ మొనర్చుటఁ జూచి దుఃఖము పట్టఁజాలక ఋశ్యమూకగిరియందున్న నా సమీపమునకు వచ్చెను. ఆమెయే యీ సంగతియంతయు నాకుఁ జెప్పినది.

భర —(ఆవేగములో) రుమ యెవ్వరు?

శూర్ప: —సుగ్రీవుని పట్టమహిషి.

శత్రు:—ఏమి? రాక్షసులు సుగ్రీవునిఁ జంపివైచిరా?

శూర్ప:—(డగ్గుత్తికతో) అతని నొక్కనినే గాదు. అతని మంత్రియగు హనుమంతుఁడు, వాలిపుత్రుఁడు యువరాజు నగు నంగదుఁడు- వీరు వారననేల? అందఱు సకలసైన్యములతో నామరూపములులేకుండ నశించిరి.

శత్రు:—ఐన నా రఘుకుమారు లేమైరి?

శూర్ప:—ఏమైరి? మాయావు లగు రక్కసులు వారిని సైతము గంతపూర్తిగఁ గబళించివైచిరి.

భర:—హా సోదరా! రామభద్రా! వత్స లక్ష్మణా!(మూర్ఛిల్లును)

శత్రు:—హా! అన్న లిరువురు వనభూమికి బలియైరిగా? (మూర్ఛిల్లును.)

శూర్ప:—(తనలో) రాముఁడు నా యన్నలగు రావణకుంభకర్ణులను జంపుటకు విశ్వప్రయత్నముఁ జేయవలసివచ్చినది గాని యతని తమ్ములగు భరత శత్రుఘ్నులను మాట మాత్రముననే చంపుచున్నాను. (ప్రకా) అయ్యలారా! ఊఱడిల్లుఁడు. మీ రెవ్వరో నే నడుగవచ్చునా?

శత్రు:—(మూర్ఛదేఱి) ఈతఁడు భరతుఁడు. నేను శత్రుఘ్నుఁడను

శూర్ప:—(ఆకులపాటు నటించి) ఏమీ మీరు రామలక్ష్మణుల సోదరులా? అయ్యో! అయ్యో!! ఎంత తప్పు చేసితిని. సత్యమే యైనను అప్రియము చెప్పఁగూడదని పెద్దలు చెప్పుచుందురు. అది తెలిసియుండియు నీ పొరబాటు చేసితిని. నేను నరకమునకుఁ బోవుదునేమో గదా? (రోదనము నటించును.)

భర:—(మూర్ఛతేఱి) ఇందు నీ దోష మేమున్నది. మేము మందభాగ్యులము.

శత్రు:—సీతాదేవి యే మైనది?

శూర్ప:—ఏమని చెప్పుదును? రాక్షసులు పెట్టు బాధలు పడలేక ఆ సాధ్వి గొంతుక కురిపెట్టుకొని ప్రాణములం బోగొట్టుకొనెను.

శత్రు:—(శోకముతో) ఇంక నేమి? సర్వనాశన మైనది. హా! జానకీ!

గీ॥ అల్లనాఁడు వనంబుల కరుగునపుడు
నారచీరలు ధరియింపనేర కెటులొ
అన్నగారిని గని నేర్చుకొన్న నీకుఁ
గుతిక కురివెట్టుకొను టెట్లు కుదిరె నమ్మ!

భర:—జానకీ! కులోచితము నాచరించి ధన్యురాల వైతివి. ఇప్పు డేమి చేయవలయును? నా కేమియుఁ బాలుపోవుట లేదు.

శత్రు:—అన్నయ్యా! పాలుపోవ కేమి? ఆ క్రూరరాక్షసుల నుక్కడఁగించివారి వేఁడివేఁడి క్రొన్నెత్తుటితో సోదరులకు తర్పణము లాచరింతము.

శూర్ప:—(తనలో) ఈ యుపదేశమును దప్పక త్రిప్పివేయవలెను. (ప్రకాశముగా) తగినంత 'సాయసంపదలు' లేని మన కది యెట్లు సాధ్యమగును? సీతయే దారి చూపినది గదా!

భర:—హా! ఎంత కష్ట మెంత కష్టము!

చ॥ దిన మొక నూరు కల్పముల తీరున నొక్కటి రెండుగా వెటో
చనెఁ బదునాలుగేఁడు లిదె చల్లఁగ వచ్చిన దన్న వత్తునం
చనిన దినంబు నేఁ డికను హాయిగ నుందు నటంచు గంపెడా
సను గొని యుంటిఁ గాని యిటు సంభవ మౌటఁ దలంపనైతిఁగా?

శూర్ప:—(తనలో) మీ యన్నవలన బాగుపడిన దెవరు? నే నాతనిఁ జూచుటచేతనే ముక్కునుఁ జెవులనుఁ గోలుపోయితిని.

శత్రు:—

చ॥ కనుఁగొని తమ్ముగుజ్జులను కౌఁగిటఁ జేర్చ; వదేలకో యిటుల్
కనలుట? నవ్వువెన్నెలలఁ గాచెడు ముద్దుమొగంపు జందమా
మను గనుపింపఁ జేయవుగ! మాటలఁ జెప్పవు కప్పురంబునన్
మునుకలు వేసినట్టులయి మోదిలి మేము వినంగ సోదరా!

శూర్ప:—(తనలో) ఆతఁడు నాకా నవ్వువెన్నెల మోముచందమామను జూపించెను. చూచితిని. కాని మనోరథము సాగలేదు. (ప్రకాశముగా) ఊరక చింతించిన నేమి ఫలము? ప్రతీకార మాలోచింపుఁడు.

భర:—

చ॥ ప్రకటనచేసి పాదుకల రాజ్యము సేయుము; తండ్రిగారి మా
టకు నెదురైన పనుల్ జరుపుటల్ తగ దీ పదునాలుగేండ్లపై
నొక గడె యైన నిల్వ నని యూఱడఁ బల్కితి వాగ! యప్పుడే
యిఁక నినుఁ జూడరా నని వచింపకపోతివి సత్యభాషణా!

తపస్వినీ! అగ్నిప్రవేశముతప్ప నిఁక నేమి సేయఁగలము?

శత్రు:—లక్ష్మణుఁడు రామునివలె నేను అన్నగారి ననుసరించి నా స్నేహమును ఫలింపఁ జేసికొనియెద.

శూర్ప:—(తనలో) ఇందుకొఱకే గదా నా యీ యారంభ మంతయు. (ప్రకా) భరతుఁడు చక్కని యుపాయము నాలోచించినాఁడు. శత్రుఘ్నా! నీవును మంచిప్రతిక్రియ నాలోచించితివి. నేను నిఁక దపస్సుఁజేసికొనఁ బోయెద. (ఇంచుక యాగి) తపస్సు మాత్ర మెందులకు? నేనును మిమ్ము ననుసరించెద.

భర:—తమ్ముఁడా! లక్ష్మణా! అన్నగారియం దనన్యమైన భక్తిఁ జూపించి జీవితము సఫలము చేసికొంటివి. నా కా యదృష్టము పట్టదాయెను. సోదరా! శత్రుఘ్నా! పున్నామనరకమునకు భయపడికదా, మన తండ్రిగా రనేకకష్టములు పడి మనల నల్గురనుఁ గాంచిరి కావున నా మాట విని నీవు—

చ॥ గుఱుతుగ నిల్చియుండి జనకుం "డొక రిద్దరుఁ గారు నాకు న
ల్గురు సుతు లుండియున్ కడకుఁ గోరి పితృణము నీగ నొక్కఁడ
క్కఱకునుఁ రాకపోయె"నని కందక యుండెడు నట్లు మాకు నం
దఱకును దర్పణంబుల నొనర్పుము వంశము నిల్పువాఁడవై.

శూర్ప:—(తనలో) శత్రుఘ్నుఁడు జీవించునా యేమి? నాకర్థాన్నమే? (ప్రకా) భరతా! శత్రుఘ్నునకును నీవంటి శోకమే కదా? నీ వట్లు నియోగించుట వృథయని తలంతును!

శత్రు:—తండ్రిగారికిఁ బ్రియపుత్రులరగు మీ రందఱు గతింపఁగాఁ దిలోదకములు విడచుట బాలుఁడ నగు నా కెట్లు సాధ్యమగును? నేనును మి మ్మనుసరించెద.

శూర్ప:—వత్సా! ఇంక నాలస్యమేల? అగ్నిహోత్రమును సిద్ధము చేయుము.

భర:—హా! రఘువంశ మింతటితో నంతరించుచున్నది గదా? ఎంత కష్ట మెంత కష్టము!

చ॥ కడుపుకుఁ జిచ్చువెట్టె రఘుకాంతుఁడు కోసలరాజనందనీ!
నిలువునఁ గొంపఁ గూల్చితివి నీవయి కైకరో! కాటి కివ్వనా

కొడుకులఁగంటి విద్దఱను గోరి సుమిత్ర? కులం బడెల్లఁ గీ
డ్పాడుటకు హేతు వక్కటకటా! ఒక మంథరయే తలంపఁగన్.

హా! తండ్రీ!

గీ॥ పుత్రులో పుత్రులో యంచుఁ బాగిలి పొగిలి
కడపటను మమ్ము నల్వురఁ గంటి; వైన
నేమి ఫల? మాత్మజుని వనభూమి కంపి
పాడు చేసితి విక్ష్వాకువంశ మీవె.

శత్రు:—అన్నయ్యా! ఊరక తండ్రిగారిని నిందించిన లాభమేమి?

ఉ॥ ఈ విధి నో నటం చెపుడు నెవ్వర మైనఁ దలంపమైతి మా
హా! విధి! నాఁడు పెండ్లిసమయంబున భూసురులెల్లరుం 'జిరం
జీవ!' యటన్న పల్కుల రచించిన దీవన లెల్ల వ్యర్థమై
పోవునె? ఇప్పు డడ్డుపడఁ బోదొకొ ఒక్కటి యైన నక్కటా!

ఇంధనముల గూర్చుచున్నాను. అనలప్రవేశమునకై సిద్ధముగ నుండుఁడు. (అగ్నిహోత్రముఁ బ్రజ్వలింపఁ జేయును.)

శత్రు:—అన్నయ్యా! అగ్నిహోత్రుఁడు విజృంభించుచున్నాఁడు.

భర:—నాకుఁ బ్రియము నాకుఁ బ్రియము.

శూర్ప:—(తనలో) నా కంతకంటె నుఁ బ్రియము. (ప్రకా) అగ్నిప్రవేశమునకై త్వర పడుఁడు. త్వరపడుఁడు.

భర:—అమ్మా! మాయందు దయయుంచి నా యీ చిన్నసందేశమును వశిష్ఠున కెఱింగింపుము.

శూర్ప:—(ఆనందముతోఁ దనలో) ఈ హేతువుచేత నే నగ్నిం బ్రవేశించుట తప్పిపోఁ గలదు. (ప్రకాశముగా) ఏమని నీ సందేశము?

భర:—

ఉ॥ రావణుచేతిలోఁ బడిరి రాముఁడు సీతయు లక్ష్మణుండు; మా
కీవిధి దుర్భరం బగుట నేగుచునుంటిమి వారి వెంట నిం
ద్రావసథమ్ముఁ జేరఁగ; మహర్షివరేణ్యా! ఇతఃపరమ్ము మా
ప్రావకుఁ దప్పకుండఁ బరిపాలన సేయఁగదయ్య రాజ్యముల్.

శూర్ప:—(తనలో) నా మనోరథము ఫలించుచున్నట్లున్నది. ఇంకను ఆడించి చూచెదను. (ప్రకా) ఇం దాయనకుఁ జెప్పవలసిన దే మున్నది. అమ్మహర్షికి స్వయముగా నన్నియుఁ దెలియును. (అగ్నికిఁ బ్రదక్షిణము చేయును.)

శత్రు:—పరాదినీ! అన్నగారి సందేశము శీఘ్రముగా నెఱింగించి రమ్ము. ముందుగా మేమే యగ్నిలోఁ బ్రవేశింపవలసినది.

శూర్ప:—(తనలో) వీరి కీయుద్దేశము దృఢముగానే యున్నది. ఇంక నేఁజేయఁదగిన దేదియు లేదు. (ప్రకా) సరే. మీ యనుశాసనము తప్పక చేయవలసినదే. విశేషించి యిటువంటి స్థితిలో—(నిష్క్రమించును.)

భర:—తమ్ముఁడా! ఇంక నాలస్యమేల? అగ్నికిఁ బ్రదక్షిణము చేయుదము.

(ఇద్దరు నగ్నికిఁ బ్రదక్షిణము జేయుదురు.)

(తెరలో)

గీ॥ వచ్చుచున్నాఁడు శ్రీరామభద్రుఁ డిపుడె
పుష్పకవిమాన మెక్కి సమ్మోదగరిమ
నంకమున సీత ప్రక్కన ననుజుఁ డవల
వానరులు రాక్షసులుఁ బ్రీతి బలసి కొలువ.

భర:—(చూచి) ఎవఁడితఁడు ప్రియము చెప్పుచున్నాఁడు.

శత్రు:—అన్నయ్యా! త్వరపడకుము. ప్రియవాక్యము వినఁబడుచున్నది.

భర:—తమ్ముఁడా! ఎల నీకీ వెఱ్ఱి? ముందుగా మన మెవ్వరమో తెలియక యప్రియము జెప్పి తరువాత ఖేదపడిన యా తపస్వినియే యిట్లు ప్రియము పలుకుచున్నది. ఇవి వట్టి మిథ్యావాక్యములు. (మరల నగ్నిని సమీపించును.)
(అంతటఁ బటాక్షేపమున హనుమంతుఁడు ప్రవేశించును.)

హను:—భరతా! నావి మిథ్యావాక్యములు కావు. ఈ కారణము లేని కంగా రేల? జగదభిరాముఁ డగు రాముఁడు శతయోజన విస్తీర్ణమగు సముద్రము నవలీల దాటి యఖిలదుష్టరాక్షస సంహారముఁ గావించి పుష్పకవిమానమెక్కి వచ్చుచు దా మిప్పటికి వచ్చునప్పటి కాలస్యమగునేమోనని నన్ను ముందుగాఁ బుత్తెంచుటచే వచ్చితిని. క్షణ మాలసించినచో మాటదక్కనిదే.

భర:—మాయారణప్రవీణు లగు రక్కసులముందఱ మా రాముని శక్తి యెట్లు పని చేసినది?

హను:—వాలి నొక్క బాణముచేతనే సంహరించిన రామునకు రావణుఁ డొక లెక్కయా? గుడి మ్రింగువానికి గుడిలోని లింగ మెంత?

శత్రు:—ఏదో విని యాకులపాటున వచ్చిన తపస్వినివలన వ్యర్థముగ మనము తొందరపడితిమి. సమయమున కీతఁడు వచ్చి మనలను రక్షించెనుగాని లేనిచో మన మన్నగారికిఁ దీరని దుఃఖముఁ గూర్చియుందుము. (హనుమంతునిఁ జూచి) అయ్యా! మీ పేరున నుండ నోచిన పుణ్యాక్షరముల వినఁగోరుచున్నాను.

హను:—అయ్యలారా! నన్ను హనుమంతుఁ డందురు. నేను వానరరాజగు సుగ్రీవుని మంత్రిని. మీ రేదో తాపసి యనుచున్నారు. ఆమె యెవ్వతెయో నే నెఱుఁగ వచ్చునా?

శత్రు:—ఆమెపేరు పర్ణాదినియఁట!

హను:—పర్ణాదిని యెవరు?

శత్రు:—తాను ఋశ్యమూకగిరియం దుండుదాన ననియు, సుగ్రీవుని హితకోటిలోఁ జేరినదాన ననియు నామె చెప్పినది.

హను:—(ఆశ్చర్యముతో) పర్ణాదిని యను పేరు గల తపస్విని నే నింతవఱకుఁ గన లేదు. విన లేదు. (ఆలోచించి) అన్న యగు దశగ్రీవుని జంపిన కారణమున రామునిపైఁ గోపగించి శూర్పణఖయే యిట్లు తాపసీవేషమున మిమ్ము వృథగా నావేగఁ బఱచినది.

భర:—(ఆశ్చర్యముతో) కావచ్చును. ఆమె పులస్త్యవంశీయురాల నని కూడఁ జెప్పినది.

(తెరలో మంగళధ్వనులు.)

హను:—(వినుట నటించి) ఆర్యా! రామభద్రుఁడు వచ్చుచున్నట్లున్నది. ఎదు రేగుదము రండు.

(సీతారామలక్ష్మణులు తక్కిన పరిజనులతోఁ బ్రవేశింతురు.)

భర:—(సమీపించి) ఆర్యా! దశరథప్రియనందనా! భక్తజనవత్సలా! సత్యభాషణా! ఈభరతుఁడు చిరకాంక్షితము లగు నీ పాదకమలములకు నమస్కరించుచున్నాఁడు.

(రాముఁడు భరతునిఁ గౌఁగిలించుకొనును. రామ భరతులకు శత్రుఘ్నుఁడును లక్ష్మణుండును నమస్కరించి యాశీర్వాదముల నందుదురు.

భర:—(సీతనుఁ జూచి) తల్లీ! ని న్నే మొగము పెట్టుకొని చూతును?

చ॥ అడవులనుండ నేగుటకు నంతటఁ బోక దశాస్యు చేతిలోఁ
బడి పడరాని పాట్లు పడి వంతఁ గృశించుట కెట్టు లంతకున్
జడుఁడను నేనె కారణము జానకి! న న్నని మున్నుపట్టు లి
ప్పుడు దయఁ జూతువో? కినిసి బ్రువ్వఁగ దిఁగట్టఁ జూతువో గదా?

సీత:—మఱదీ! మే మడవులకుఁ బోవుటచేతనే దుష్టశిక్షణమును, శిష్టరక్షణమును మీ యన్నగారికి సమకూడినవి. ఇది యంతయు మా పిన్నత్తగారి దయచేతనే గదా!

శత్రు:—హనుమంతుఁడే రానియెడల నొక్క క్షణకాలము క్రిందటనే మే మీ లోకమును బాసియుందుము.

రాము:—అ దెట్లు?

హను:—మీపైఁ గసితీర్చుకొనుటకై శూర్పణఖ తపస్విని వేషమున నిచ్చటకు వచ్చి మీరు మరణించినా రని చెప్పి వీరల నగ్నిం బ్రవేశింపఁ బురికొల్పి చల్లఁగ దాటి పోయినది.

లక్ష్మ:—ఆ చుప్పనాతి యిచ్చటికిఁగూడ దాపురించినదా!

సీత:—ఈ రామాయణమున కంతటికిని హనుమంతుఁడే పట్టుగొమ్మ—జీవము మనమాతని ఋణము నేడు జన్మములకును దీర్చుకొనలేము.

హను:—తల్లీ! ఎంత మా టంటిరి? నా స్వకృత్యమును నేను నెఱవేర్చుకొనుట గూడ నొక విశేషమా?

గీ॥ అరయఁ ద్వద్దాసదాసదాసానుదాస
సంఖ్య నూ తైన పిదప నాశ్రయణయుక్తి
నందుఁ గడగొట్టువానికి నర్చనంబు
సలుపు యోగ్యతయును నాకు గలదొ? లేదొ?

రాము:—పెద్దల యాశీర్వచనప్రభావముచే మనమందఱము మరల నొకరి నొకరు చూచుకొను భాగ్యము కలిగినది. ఇంక నేమి కావలెను?

హను:—ఐన నిట్లగుఁ గాక!

(భరతవాక్యము.)

మ॥ ఇలఁ బాలింతురు గాక ప్రీతి నెపుడున్ భూపాలుర్; పరస్త్రీల దొం
గిలి యడ్డం బగు గడ్డినిం గఱచి నేగిం జెందు నా యాతతా
యులు లేకుందురు గాక! సర్వజన మత్యుత్సాహమౌఁ గాక! ఇ
మ్ముల రామాయణ మాదికావ్యమయి సొంపుం బెంపు వాటించుతన్

(అందఱు నిష్క్రమింతురు.)

ఇది శ్రీ వెంకట పార్థసారథి కవి ప్రణీత మగు విచిత్రరాఘవమున
షష్ఠాంకము సర్వమును సంపూర్ణము.